1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 7
సంచిక : 2
పుటలు : 52
రు. 25 లు
ISSN NO : 2582-8738

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

ఏప్రిల్ 2021

యు.జి.సి. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక https://ugccare.unipune.ac.in https://www.ugc.ac.in









## తెలుగుజాతి ఆధునిక చరిత్రలో నిలిచిపోయే రెండు గొప్ప రచనలను ఆవిష్కరించిన పవన్‌కళ్యాణ్

- ప్రాంతీయ భాషల్లో సాంకేతిక విద్య: ఐఐటీ డైరెక్టర్‌ల రెండు నాల్కలధోరణి
- విద్యామాధ్యమంపై వీడుతున్న వలసవాద నీడలు
- జర్మన్ల భాషావేశం
- ఈ చదువులు మాకొద్దు
- ఆగిన **తెలుగు వెలుగు** చిరస్మరణీయ సేవలు

## మానవజాతుల సమగ్ర వికాసం కోసమే మాతృభాషలు

# బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ వారికి ధన్యవాదాలు

**'తెలుగుజాతి' ట్రస్టుకు – 2021 మార్చి నెలలో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ – గుంటూరు వారి నుండి రూ 1,00,000/–లు విరాళము అందినది. అందుకు బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ వారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం.**

**– 'తెలుగుజాతి' ట్రస్టు–తెనాలి**

బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తిగారు బి.ఏ. ఆనర్స్(ఇంగ్లీషు) చదివారు. వీరు గుంటూరు జిల్లా – వట్టిచెరుకూరు మండలం – సౌపాడు గ్రామంలో 1936 సెప్టెంబరు 22వ తేదీన బొమ్మిడాల మాణిక్యమ్మ కోటిరత్నం దంపతులకు జన్మించారు. స్వగ్రామంలోను, గారపాడులోను, గుంటూరులోను, విశాఖపట్నంలోను, చెన్నపట్నంలోను విద్యాభ్యాసం చేశారు. కొద్దికాలం ఉద్యోగం చేశారు. తరువాత టొబాకో వ్యాపారంలో ప్రవేశించారు. వ్యాపార పనులమీద ఎన్నో విదేశాలు సందర్శించారు. బొమ్మిడాల బ్రదర్స్ టొబాకో కంపెనీ అభివృద్ధిలో భాగస్వాములయ్యారు. శ్రీ బొమ్మిడాల పూర్ణయ్య, శ్రీ బొమ్మిడాల నారాయణమూర్తి, శ్రీ బొమ్మిడాల భానుమూర్తి, శ్రీ బొమ్మిడాల కాశీవిశ్వనాథం గారలు వీరి సోదరులు, వ్యాపార భాగస్వాములుగా ఉన్నారు.



గ్రామీణ ప్రాంతం నుండి వచ్చి, వ్యాపారంలో నిలదొక్కుకొని, విద్య నేర్చిన కారణంగా అంతర్జాతీయ వ్యాపారరంగంలో మెళకువతో వ్యవహరించి, స్థిరపడిన తరువాత– విద్యారంగంలోను సాహిత్యరంగంలోను పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కవులు, పండితులను సన్మానిస్తున్నారు. వారి గ్రంథాల ముద్రణకు తోడ్పడుతున్నారు. విద్యావంతులైన వారిని సత్కరిస్తున్నారు. పలురంగాలలో నిష్ణాతులైన వారిని గుర్తించి, అవార్డులు అందజేస్తున్నారు. పలు విద్యాసంస్థలకు భూరి విరాళంతో సహకరిస్తున్నారు.

శ్రీకృష్ణమూర్తి గారు జన్మించిన గ్రామం – సౌపాడు(గుంటూరు జిల్లా)లో పాఠశాల, దేవాలయం, కళ్యాణమండపం ఏర్పాటు చేశారు. బాల్యంలో చదివిన గారపాడు(గుంటూరు జిల్లా)లోని ఉన్నత పాఠశాలకు నూతన భవనాలు నిర్మించి, ఎంతో మంది బాలబాలికలకు ఉత్తేజం కలిగించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో **HRD** వారి భవన నిర్మాణానికి తోడ్పడ్డారు. గుంటూరు పట్టణంలో స్టూడెంట్స్ హాస్టల్ నిర్వహిస్తున్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ప్రత్యేకించి వారు చదివిననాటి విద్యార్థుల వార్షిక సమ్మేళనాలు వీరి ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎక్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా వ్యవహరిస్తున్నారు.

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు,
డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్,
సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




ఏప్రిల్ 2021

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరు నామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.

5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపి సహకరించండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని పరిశీలించడం ఇబ్బంది అవుతుందని గమనించండి.

## అమ్మనుడి చదువరులకు తెలుగు ఉగాది శుభాకాంక్షలు

### లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| సంపాదక హృదయం: | మానవజాతుల సమగ్ర వికాసం కోసమే మాతృభాషలు | | 05 |
| జర్మనీ నుండి: | జర్మన్ల భాషావేశం | శ్రీగణేష్ తొట్టెంపూడి | 07 |
| తెలుగుజాతి ఆధునిక చరిత్ర: | అద్భుతగ్రంథం...ప్రతి ఒక్కరు చదవాలి | | 08 |
| సాంకేతికవిద్య: | ప్రాంతీయ భాషల్లో సాంకేతిక ... | రహ్మానుద్దీన్ షేక్ | 09 |
| విద్యామాధ్యమం: | విద్యామాధ్యమంపై వీడుతున్న... | జె.డి.ప్రభాకర్ | 13 |
| చరిత్రగా మిగిలింది: | ఆగిన 'తెలుగువెలుగు'... | సన్నిధానం నరసింహశర్మ | 16 |
| కొత్తమాట: | కొత్తమాటల పుట్టింపు –7,8 | స.వెం.రమేశ్ | 19 |
| భాషను నేర్చుకోవడం: | పిల్లలు భాష ఎలా నేర్చుకొంటారు | జాన్‌హోల్ట్ | 23 |
| మాటల నిర్మాణం: | పదనిష్పాదనకళ 8 | వాచస్పతి | 25 |
| వారసత్వ సంపద: | ఈ చదువులు మాకొద్దు | డా॥ పి.శివరామకృష్ణ'శక్తి' | 28 |
| సాహిత్యం: | ఆపత్కాలపు కవిత్వచూపు | బూర్ల వేంకటేశ్వర్లు | 44 |
| కథ: | ఊరొచ్చేస్తాంది...! | కరణం కళ్యాణ్ కృష్ణకుమార్ | 46 |
| పుస్తక సమీక్షలు | | | 49, 50 |
| నవల : | మాఊరు | అగరం వసంత్ | 36 |
| ఆత్మకథ : | కొయ్యబొమ్మలాట కళాకారుడు | చంద్రప్ప సోబటి | 41 |
| ధారావాహికలు: | పడమటి గాలితో... | గుజ్జర్లమూడి కృపాచారి | 30 |
| | అడుగుజాడలూ ఆనవాళ్లు–8 | ఈమని శివనాగిరెడ్డి | 33 |
| నానీలు: | సమరసతా నానీలు | సాకి | 29 |
| కవిత: | హోళీ–హోళికా | గుడికందుల ప్రకాశం | 32 |


| కార్టూన్లు | బొమ్మలు | కంప్యూటర్ |
|---|---|---|
| సరసి | చిదంబరేశ్వరరావు | బండారు రఘురాం |

ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదవగలరు

రచనలను, వార్తలను, వాట్స్‌యాప్‌లో పంపవద్దు: 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సాప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం,విజయవాడ–520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు మాసపత్రిక

### చందా వివరాలు

| | | |
|---|---|---|
| జీవిత చందా | : | రూ.5000 |
| 4 సం॥ చందా | : | రూ.1000 |
| 1 సం॥ చందా | : | రూ. 300 |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

### బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**–యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

**గూగుల్ పే/ ఫోన్ పే**

ద్వారా కూడా చందాను చెల్లించవచ్చును

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమ పూర్తి చిరునామాను, ఫోన్ నెంబరు, మెయిల్ ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.

**94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా – 522 211.
ఫోన్ : 94929 80244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ– పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

'అమ్మనుడి' పత్రికను నడపడం ఆర్థికంగా ఎంతో ఇబ్బందిగా ఉంది. చందాలే ముఖ్య ఆధారంగా ఉన్నది గనుక – మీరు చందాదారులుగా చేరడంతో పాటు, మీ మిత్రులను, సంస్థలను ప్రోత్సహించి వారిని చందా దారులుగా చేర్పించగోరుతున్నాము.

–ప్రచురణకర్త

### ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/–లు, ఆపైన– విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

## తెలుగుజాతి (ట్రస్టు) ప్రచురణ

సంపుటి : 7 సంచిక : 2
**అమ్మనుడి**
ఏప్రిల్ 2021

సంపాదక హృదయం

# మానవజాతుల సమగ్ర వికాసం కోసమే మాతృభాషలు

**మా**తృభాషల పుట్టుక, పెరుగుదల ప్రపంచమంతా ఎన్నేళ్లక్రితం మొదలై కొనసాగుతున్నదో స్పష్టమైన అంచనాలు ఏమీలేవు. అయితే వాటి పతనం మాత్రం ఇటీవల కాలంలో చాలా వేగంగా జరుగుతోందనే అనుకోవాలి. లభిస్తున్న చారిత్రిక ఆధారాలను బట్టి, ఇరవై ఏళ్ల క్రితం వరకు యునెస్కో సేకరించిన వివరాలను బట్టి ఈ సమాచారం తెలుస్తుంది. ఇదంతా మన అమ్మనుడి చదువరులకు తెలిసిందే.

తెలుగు వారికి సంబంధించినంత వరకూ సుమారు ఇరవైఐదేళ్లుగా వెలికివస్తున్న ఆందోళనలు, ఆవేదనలు తరువాత దేశ వ్యాప్తంగాను, వివిధ భాషాజాతులలో వస్తున్న కదలికా మనందరం గమనిస్తున్నదే. ప్రపంచంలోని అనేక మంది మేధావులు వివిధ దేశాలలో చేస్తున్న ఆందోళనలు, ఉద్యమాలు ఈ పరిణామాలకు దోహదం చేస్తున్నాయి. బంగ్లాదేశ్ ఏర్పాటుకు దారితీసిన పరిణామాలు గానీ, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భాష విషయమై వస్తున్న కదలికలు గానీ, సొంతభాషలతోనే అత్యాధునిక జ్ఞాన సముపార్జన సులభ సాధ్యమనీ, నిరూపణ అవుతూనే ఉంది. కానీ స్వార్థపర, అవినీతి మయ, వలసవాద ఆధిపత్య శక్తులు పాలనా రంగాల్లో బలపడుతుండడం వల్ల ఇది క్రమంగా రాజ్యాల మధ్య, ప్రభుత్వాల మధ్య మాత్రమే కాకుండా ప్రపంచ మానవ జాతుల మధ్య కూడా వైరుధ్యాలను పెంచేందుకు దారి తీస్తున్నది.

భారతదేశానికి సంబంధించి, ఈ పరిణామాలు చాలా త్వరగా చోటుచేసుకుంటున్నాయని, విజ్ఞులు హెచ్చరిస్తున్నారు. 2021 ఫిబ్రవరి 21 ఎల్లనాడుల అమ్మనుడుల పండుగ సందర్భంగా, జరిగిన కార్యక్రమాలు ఇందుకు అద్దం పట్టాయి. రాజ్యాంగం గుర్తించిన 22 భాషలనూ అధికారిక భాషలుగా గుర్తిస్తూ రాజ్యాంగ సవరణ చేయ్యాలనే బెంగళూరు తీర్మానం కేంద్ర ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరిక జారీ చేసింది. భారతీయ భాషల సాధికారతకై ఈ తీర్మానం పట్టుబట్టింది. నూతన జాతీయ విద్యావిధానం పేరిట ప్రభుత్వం చేసుకుంటున్న ప్రచారంలో పస లేదన్న సత్యం అందరికీ ఇప్పుడిప్పుడే అర్థమవుతున్నది. పైకి చెప్పే గంభీరమైన మాటలకీ ఆచరణకీ ఉన్న దూరం అందరికీ పూర్తిగా తెలియడానికి ఒకటి రెండేళ్ల సమయం కంటే ఎక్కువ పట్టదు. అన్ని భాషలనీ సమదృష్టితో చూసే శాస్త్రీయ ధోరణిని విడిచిపెట్టి, పైకి డాంబికంగా మాట్లాడుతూ తమ చేతకానితనాన్ని అడుగడుగునా బయట పెట్టుకుంటున్న విద్యావేత్తలు, నిపుణులు నిజాయితీగా పని చేయడానికి సిద్ధం కాకపోతే వారిని ప్రజలు క్షమించరు. చరిత్ర మన్నించబోదు.

భాషాభిమానులమని పదే పదే చెప్పుకోవడానికి సంతోషపడే మిత్రులంతా తమ ఆలోచనలను, చూపునూ మార్చుకోవాలి. భాషల్ని ప్రేమిస్తున్నామనీ, గౌరవిస్తున్నామనీ మమకారాలను ఒలకపోసే పెద్దలు, పండితులు నేటి భాషావసరాలు ఏమిటో తెలుసుకోవాలి. ప్రజలు, ప్రజాస్వామ్యం, జ్ఞాన సముపార్జనలో భాష అవసరం, మానవ మేధకూ భాషకూ గల సంబంధం వంటి కీలకాంశాలను గురించి తెలుసుకోకుండా భాషోద్యమాలను చేస్తున్నామని చెప్పుకోవడం వల్ల అపహాస్యం పాలవుతాము.

ఎవరి భాషలను వారు అన్ని రంగాల్లో పోటా పోటీగా వినియోగించుకుంటూ పరస్పర సహకారం, సమిష్టి అభివృద్ధి, లక్ష్యంగా ప్రపంచ భాషాజాతుల పురోగతి కోసం, అన్ని స్థాయిల్లోనూ ఉద్యమాలను నిర్మాణం చేసుకుంటూ ముందుకు సాగవలసిన తరుణం వచ్చేసింది. పాలక వర్గాలతో సహా అందరినీ కలుపుకుంటూ, అవసరమైనప్పుడు సంఘర్షిస్తూ ప్రజాసమూహాల మద్దతుతో ఇదంతా ముందుకు సాగాలి. నిజానికి మాతృభాషలను రక్షించుకోవాలనే నిజమైన తపనకు ఒక ఆకారం ఇప్పుడిప్పుడే అందుతున్నది. అర్థమవుతున్నది. ఇక ప్రయాణం ముందుకే. ప్రపంచ భాషాజాతుల అభివృద్ధికై తెలుగుజాతి కూడా కలిసి ముందడుగు వేస్తుంది.

తేదీ : 01-04-2021

సామల రమేష్ బాబు

# చదువరులకు విన్నపం
## 'అమ్మనుడి'కి మూడు నెలల విరామం

**తొ**లుత 'నడుస్తున్న చరిత్ర'... తర్వాత 'అమ్మనుడి'. 1993 డిసెంబర్ సంచికతో మొదలైన నడుస్తున్న చరిత్ర ప్రయాణం 2013 అక్టోబరుతో ఆగింది. మళ్ళీ 2015 మార్చి నెల నుండి ఆ ప్రయాణం సాగింది. అయితే, అక్కడి నుండి 'అమ్మనుడి' పేరుతో!

నడుస్తున్న చరిత్రను మొదలు పెట్టినప్పుడు అది ఒక సామాజిక, రాజకీయ, విశ్లేషణల సమాహారం. ఆలోచనను ప్రేరేపించే మేధోపరమైన పత్రిక. కాలం గడిచేకొద్దీ అది ఒక సమగ్ర సామాజిక ఉద్యమ ప్రాతినిధ్య రూపాన్ని సంతరించుకుంది. ఇదంతా 'నడుస్తున్నచరిత్ర' పత్రిక చరిత్ర. తెలుగుజాతి ప్రజల మదిలో ఒక భాషోద్యమ నిర్మాణపత్రికగా ఎంతో గుర్తింపును పొందింది. దాని ఫలితంగానే 'అమ్మనుడి' పేరుతో 2015 మార్చి నుండి ప్రయాణం సాగుతున్నది.

ఇటువంటి పత్రికలు- ప్రజలభాషలలో... అందునా, తెలుగులో ఎంతకాలం మనగలుగుతున్నాయనేది ఇక్కడ చర్చించే విషయం కాదు. చారిత్రక అవసరాలను తీర్చడంలో ఈ పత్రికలు ఎంతో కృషిచేశాయి. చరిత్రను సృష్టించాయి. అమ్మనుడి ఒక నిర్మాణాత్మక భాషోద్యమ పత్రికగా అనతి కాలంలోనే ఎంత విశిష్టతను సాధించిందో చదువరులకు తెలిసిందే. దీన్ని నిరంతరం కొనసాగించడానికై ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. కానీ తప్పనిసరి పరిస్థితుల్లో మూడు నెలలపాటు- మే, జూన్, జులై సంచికలను ప్రచురించలేక పోతున్నాము. మళ్ళీ ఆగస్టు 2021 సంచిక నుండి ప్రతీ నెల వెలువడగలదని మనవిచేస్తున్నాము. అమ్మనుడి చదువరులు సహకరిస్తారని నమ్ముతున్నాము.



**ప్రత్యేక సంచికగా 'అమ్మనుడి' ఆగస్టు 2021 సంచిక**

గిడుగు వేంకటరామమూర్తి గారి 158వ పుట్టినరోజు సందర్భంగా వెలువడనున్న ప్రత్యేక సంచికలో వ్యాస రచనలకోసం అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాము. రచనలు మాకు చేరవలసిన చివరితేది: జులై 15

-సంపాదకుడు 'అమ్మనుడి'




**తెలుగు ఉగాది సందర్భంగా పుస్తకంగా వెలువడనున్నది**

14 నెలల పాటు **'అమ్మనుడి'** పత్రికలో ధారావాహికగా మీరు చదివిన నవల, రానున్న తెలుగు ఉగాది సందర్భంగా పుస్తకంగా వెలువడనుంది. కావలసినవారు **'అమ్మనుడి'** పత్రిక కార్యాలయాన్ని సంప్రదించ కోరుతున్నాం. ఫోన్లు : 98480 16136, 94929 80244

శ్రీగణేష్ తొట్టెంపూడి

# జర్మన్ల భాషావేశం

“**ఆం**ధ్రత్వమాంధ్రభాషాచ నాన్యః తపసః ఫలం”. అంటే, తెలుగు వాడిగా పుట్టడం, తెలుగు మాట్లాడటం, తెలుగు దనం పొందటం ఎంతో తపస్సు చేసుకుంటేగానీ లభించవు అని పై దానికి అర్థం. ఇది అన్నది తమిళుడైన అప్పయ్య దీక్షితులు అని అంటారు. మరి ప్రస్తుత సమాజంలో తెలుగు పరిస్థితి ఎలాఉందో వేరే చెప్పనక్కర్లేదు. అమ్మ భాషకు పట్టిన ఈ స్థితిని అధిగమించాలంటే ఏంచేయాలి? అమ్మభాషను భావి తరాలకు అందించాలంటే తెలుగును ప్రాచీన ధోరణిలో కాకుండా ఆధునిక విధానాలలో అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇక్కడ ఒక్క విషయాన్ని మన తెలుగు సమాజం గుర్తించుకోవాలి. “మానవుని ఆధునిక అవసరాలను తీర్చని దేన్నైనా ఆయా మానవ సమాజాలు అటకెక్కిస్తాయి”. ఈ ఒక్క విషయాన్ని తెలుగు సమాజం, భాషమీద పరిశోధన చేస్తున్నవారు ఎప్పుడూ గుర్తించుకోవాలి.

భాష పట్ల చూస్తున్న మన దృష్టి మారాలి. సంప్రదాయ కళ్ళద్దాలతో కాకుండా ఆధునిక కటకం పెట్టుకొని భాషను చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరి ఈ ఆధునిక దృష్టి విధానంలో మన భాషని ఎలా చూడాలి? 84 మిలియన్ల (2011 జనాభా గణాంకాల ప్రకారం) జనాభాచే మాట్లాడబడుతున్న తెలుగు-వాళ్ళ అవసరాలను తీర్చుతోందా? ఈ వ్యాసంలోనూ రాబోయే సంచికలో నూ కొన్ని విభాగాలు తెలుగుభాషకు ఆధునిక హంగులు ఎలా అద్దాలి, భాషను ఎలా సామాజిక అవసరాలకు అనుగుణంగా ఎలా సంసిద్ధం చేసుకోవాలి? మన విద్యావ్యవస్థలో తెలుగును ఎలా నిలపాలి? డిజిటల్ రంగానికి తెలుగును ఎలా సంసిద్ధం చేసుకోవాలి- అన్న విషయాలను అలాగే జర్మనీ దేశంలో జర్మన్లు అనుసరిస్తున్న మాతృభాషావిధానాన్ని కూడా వివరించటానికి ప్రయత్నిస్తాను.

ఐరోపా ఖండాన్ని ఒకసారి పరిశీలిస్తే....ఐరోపా ఖండంలోని పెద్ద దేశాలు, రష్యాని మినహాయించుకుంటే జనాభా లెక్కల ప్రకారం (2019 - గణాంకాలు)జర్మనీ 83,019,213 మందితో (ఐరోపా జనాభాలో 16.17% ) మొదటి స్థానంలో ఉంది. 67,102,883 మందితో. (ఐరోపా జనాభాలో 13.05%) ఫ్రాన్స్ రెండో స్థానంలో ఉండగా, 66,647,112 మందితో (ఐరోపా జనాభాలో 12.98%) యునైటెడ్ కింగ్‌డమ్ మూడవ స్థానంలోనూ, 60,359,546 మంది (ఐరోపా జనాభాలో 11.76%)తో ఇటలీ నాల్గవ స్థానంలోనూ, 46,937,812 మందితో (ఐరోపా జనాభాలో 9.14%)తో స్పెయిన్ ఐదవ స్థానంలోనూ ఉంది. ఈ మొదటి ఐదు పెద్ద దేశాలను మన ఉభయాంధ్ర రాష్ట్ర జనాభా 84,580,777 (మొత్తం భారతదేశ జనాభాలో 6.99%)తో పోల్చుకుంటే .... **ఆ ఐదు ఐరోపా దేశాల్లో ఆయా దేశాల మాతృభాషలు శాస్త్ర సాంకేతిక రంగాలో అగ్రస్థానంలో ఉన్నాయి.** ఇక్కడ వ్యక్తిగతమైన ఒక అభిప్రాయాన్ని వెళ్ళబుచ్చదలచాను. జర్మన్ పరిశోధనా తృష్ణ, అదీ వాళ్ళ మాతృభాషలో... ఎలా ఉంటుందంటే నేను మాస్టర్స్ డిగ్రీ చదివే విద్యర్థులకు డేటా ఎనాల్టిక్స్ బోధిస్తాను. తరగతిలో ఏ విద్యార్థి అయినాగనక (ఎం.ఎస్. స్థాయిలో) పరీక్ష ఇంగ్లీష్‌లో రాయను, జర్మన్ భాషలోనే రాస్తాను అంటే అధ్యాపకుడు ఒప్పుకోవలసిందే. ఇంకా చెప్పాలంటే వైద్య రంగంలో పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథం కూడా విద్యార్థికి ఆసక్తి ఉంటే అతని మాతృభాషలో రాసుకోవచ్చు. ఒక్కసారి మనసుపెట్టి మన విధానంతో ఆలోచించండి.

వారి భాషాభిమానానికి ఇది పరాకాష్ఠ. ఒక్క భాషని నేర్చుకొనటం మీదే నెలకి బిలియన్ల యూరోల వ్యాపారం జరుగుతుంది అంటే మీకు ఆశ్చర్యం వేయక మానదు.

ఇక్కడ నేను చెప్పదగ్గ ఇంకో విషయం ఏమిటంటే జర్మన్ భాష నేర్చుకొనకపోతే ఉద్యోగ అవకాశాలు కూడా తక్కువే. అన్యదేశం వారికి ఈ దేశంలో శాశ్వత నివాసం ఏర్పరచుకోవాలంటే ఇచ్చే పి.ఆర్. రావాలన్నా జర్మన్ భాషలో బి2 పూర్తి చేసి ఉండాలి. దీనిద్వారా ఇక్కడికి వచ్చే ప్రతి ఒక్కరూ జర్మన్ భాషని నేర్చుకోవలసి ఉంటుంది. ఇంతవరకూ నేను ప్రభుత్వ కార్యాలయాల్లో పనిమీద వెళ్ళినప్పుడు ఎప్పుడూ వాళ్ళు ఇంగ్లీషులో మాట్లాడటం వినలేదు. వారి భాషాభిమానానికి ఇది పరాకాష్ఠ. ఒక్క భాషని నేర్చుకొనటం మీదే నెలకి బిలియన్ల యూరోల వ్యాపారం జరుగుతుంది అంటే మీకు ఆశ్చర్యం వేయక మానదు.

భాషతో వీరు చేసే వ్యాపారం అద్భుతం. **ఎక్కడ విజ్ఞానం ఉన్నా ఈ జర్మన్లు తమ భాషలోకి తెచ్చేయాలని చూస్తారు.** ఇక ఈ జర్మన్‌లకు భారతీయ భాషల మీద ఉన్న పరిశోధనా తృష్ణని పరిశీలిద్దాం.

జర్మనీలో 12 ప్రభుత్వరంగ విశ్వవిద్యాయాల్లో భారతీయ భాషల గురించి, భారతీయ సంస్కృతుల గురించి అధ్యయన కేంద్రాలున్నాయి. మాక్స్‌మ్యూలరు (1823-1900) మొదలుకొని నేటి డిజిటల్ యుగం వరకు అనేక మంది జర్మన్ శాస్త్రవేత్తలు భారతీయ భాషలమీద పనిచేస్తున్నారు. ఇక్కడ విభిన్న విశ్వవిద్యాలయాలు భారతీయ భాషలకి అభివృద్ధి చేసిన సాంకేతిక ఉపకరణాలను మీకు ముందుముందు శీర్షికల్లో వివరిస్తాను.

భాష లేకపోతే భావం లేదు;నీ భావాల్ని నీ భాషలో చెప్పడమే సరైనది

# ఈ రెండు పుస్తకాలనూ ప్రతి ఒక్కరూ చదవాలి





**తె**లుగుజాతి ఆధునిక చరిత్రలో 19వ శతాబ్దిలో నెలకొన్న చారిత్రక పరిణామాలను నమోదు చేస్తూ వెలువడిన రెండు పుస్తకాలను ప్రముఖ నటుడు, 'జనసేన' అధినేత పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు. 2021 మార్చి 29న హైదరాబాదులో అనూహ్యంగా జరిగిన సమావేశంలో ఈ ఆవిష్కరణ జరిగింది. ఆరెండు పుస్తకాలు 1. దక్షిణ భారతదేశంలో ప్రధమ ప్రజాఉద్యమకారుడు గాజుల లక్ష్మీనరసు చెట్టి(1806 -1868). 2. 19వ శతాబ్దిలో సీమాంధ్ర సమాజం. గాజుల లక్ష్మీనరసు చెట్టి పుస్తకాన్ని ఆచార్య వకుళాభరణం రామకృష్ణ, కొంపల్లి సుందర్‌లు రచించగా, 19వ శతాబ్ది సీమాంధ్ర సమాజం పుస్తకాన్ని కొంపల్లి సుందర్ రచించారు. పుస్తకాలు ప్రచురణకాగానే పవన్ కళ్యాణ్ చదివి, తానుగా చొరవ తీసుకొని, వీటిని మార్చి 29న స్వయంగా ఆవిష్కరించడం విశేషం.

'19వ శతాబ్దిలో సీమాంధ్ర సమాజం' పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం అని ఆయన అన్నారు. ఆంగ్ల వలసపాలకులవల్ల సీమాంధ్ర ప్రాంతంలో ఎలాంటి అన్యాయాలు జరిగాయో, ఆర్థికంగా, సాంఘికంగా, సాంస్కృతికంగా ఎలా అణగదొక్కారో, ఈ రోజు మనం ఇలా ఉండటానికి కారణాలు ఏమిటో- అనే విషయాలు ఈ పుస్తకం చదివితే తెలుస్తాయని చెప్పారు.

ఇది మంచి పరిశోధనగ్రంథం. దీన్ని ఇంతకు ముందే సుందర్ గారు మొదట "ఇన్ పర్స్యూట్ ఆఫ్ సెల్ఫ్ రెస్పెక్ట్" పేరుతో 2018లో ఇంగ్లీషులో ప్రచురించి, తనకు ఒక పుస్తకం పంపారని తెలిపారు. ఈ పుస్తకం మీరు చదివితే మీ రాజకీయ జీవితానికి బలమైన తోడ్పాటునందిస్తుందని తెలియజేశారు. దీన్ని చదివిన తర్వాత - ఇంత అద్భుతమైన గ్రంథం కేవలం రీసెర్చి స్కాలర్లు, జర్నలిస్టులు, విద్యార్థుల దగ్గరే ఆగిపోతుందని తెలిసి, బాధపడ్డానన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ చదవాలంటే మీరే తెలుగులోకి అనువదించండని కోరానన్నారు. పోరాటయాత్రలో ఈ పుస్తకంలోని విషయాలను ఉటంకించానన్నారు. మూడేళ్ళ తర్వాత ఎంతో శ్రమపడి తెలుగులోకి తెచ్చారన్నారు. సమాజాన్ని అర్థం చేసుకోవడానికి ఈ పుస్తకం బాగా ఉపయోగపడుతుందని చెప్పారు.

తెలుగు సమాజం కోసం తన సర్వస్వాన్ని ధారపోసిన గొప్ప తెలుగుబిడ్డ - గాజుల లక్ష్మీనరసు చెట్టి చరిత్ర మంచి పుస్తకమని, ఆయన మరుగున పడిన తెలుగువాడని- ఇటువంటి వారి జీవితాల నుండి నేర్చుకోదగిన అంశాలు చాలా ఉన్నాయన్నారు. వీరు ప్రజాహక్కులు, ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంకోసం గళమెత్తిన మొదటి తెలుగువాడని, దక్షిణ భారతదేశంలో ప్రజా ఉద్యమకారుడు గాజుల లక్ష్మీనరసు చెట్టి అని చెప్పారు. ఈ రెండు గ్రంథాలను రచించిన రచయితలకు ధన్యవాదాలు తెలిపారు.

రచయిత కొంపల్లి సుందర్ మాట్లాడుతూ- ఎవరూ ఊహించని స్థాయిలో ఒక ఊహా ప్రపంచ నాయకుడు వాస్తవ ప్రపంచంలోని పరిశోధన విషయాలను గురించి, చలన చిత్ర స్థాయిలోని జనంలోకి తీసుకురావడం చరిత్రలో ఇంతవరకు జరగలేదన్నారు. ఆ ఘనత పవన్‌కళ్యాణ్ గారికే సొంతం అన్నారు. తెలుగులో ఈ పుస్తకం వెలువడటానికి పవన్‌కళ్యాణ్ చేసిన కృషికి సర్వదా ఋణపడి ఉంటానన్నారు. చరిత్రకు సంబంధించిన పరిశోధనలు చేసే పరిశోధకులకు పవన్‌కళ్యాణ్ ఇచ్చిన చారిత్రక గౌరవం అని తెలిపారు.

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

# ప్రాంతీయ భాషల్లో సాంకేతిక విద్య అంశంపై రెండు నాల్కల ధోరణి

**ప్రాంతీయ భాషల్లోనే మెరుగైన సాంకేతిక విద్య అందుతుంది అని ఒప్పుకుంటూనే, ప్రాంతీయ భాషల్లో నైపుణ్యం ఉన్న ఆచార్యుల కోసం వెతికితే సాంకేతిక నైపుణ్యంతో రాజీ పడాలని అంటున్న ఐఐటీ డైరెక్టర్లు.**

**2020లో** అమలు లోకి వచ్చిన జాతీయ విద్యా విధాన చట్టంలో ఆంగ్లం-హిందీ భాషల్లో, ఎనిమిది ప్రాంతీయ భాషల్లో సాంకేతిక విద్యా వనరులు రూపొందించడంతోపాటుగా ప్రాంతీయ భాషల్లో ఇంజనీరింగ్ విద్యను ప్రవేశపెడతామని కేంద్ర విద్యాశాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ పలు మార్లు మీడియా ముఖంగా తెలిపారు. నవంబరులో ఈ అంశమై ముందడుగు వేస్తూ దేశంలో సాంకేతిక విద్యకు పేరున్న వివిధ ఐఐటీల, ఎన్ఐటీల సంచాలకులతో పలు సమావేశాలు జరిపి మొదటగా ఎంపిక చేసిన కొన్ని ఐఐటీల్లో, ఎన్ఐటీల్లో హిందీలో మాధ్యమంలో ఇంజనీరింగ్ కోర్సుల బోధనను తదుపరి విద్యా సంవత్సరం నుండి ప్రవేశపెడతామని ప్రకటించారు. ఈ సమావేశాల పరంపర జరుగుతూండగానే, ప్రాంతీయ భాషల్లో ఇంజనీరింగ్ విద్యపై సానుకూలంగా కొందరు, ప్రతికూలంగా కొందరు విద్యావేత్తలు తమ అభిప్రాయాన్ని మీడియా ముఖంగా పంచుకున్నారు. **గమ్మత్తైన విషయం ఏమిటంటే, విద్య మాతృభాషలో చదివితేనే మెరుగ్గా అబ్బుతుందన్న నిజాన్ని మాత్రం అందరూ ఒప్పుకున్నారు.**

జవాహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎం. జగదీశ్ కుమార్ మాట్లాడుతూ, "గత నాలుగైదు దశాబ్దాలుగా ఆంగ్ల మాధ్యమ బోధన అనేది ఒక వివాదాంశంగా ఉంది. ముఖ్యంగా గ్లోబల్ సౌత్ అని పిలవబడే అభివృద్ధి చెందని అన్ని దేశాలలో మూకుమ్మడిగా వారి ప్రాంతీయ భాషలను పక్కన పెట్టి అంగ్లంలో చదువుకోవడం ఒక అభివృద్ధి సూచకంగా చూడబడుతోంది. ఇజ్రాయెల్ మినహా మిగితా మధ్యధరా దేశాల్లో, జపాన్, చైనా మినహా మిగతా ఆసియా దేశాల్లో, ఆఫ్రికా, మధ్య-దక్షిణ అమెరికా దేశాల్లో ఈ ఆంగ్ల మాధ్యమ మోజు పెరుగుతూ వస్తుంది. ఆంగ్ల మాధ్యమ విద్యా బోధనకు వ్యతిరేకంగా ఆయా దేశాల్లో ఉద్యమాలు నడుస్తున్నా, అవి భావోద్వేగాల ఆధారంగానే తప్ప- వైజ్ఞానిక పరిశోధనల మీద ఆధారపడి లేవు. **అయితే మాతృభాషా మాధ్యమ బోధన ద్వారా చదువుకున్న విద్యార్థుల్లో జ్ఞానం, గ్రహణశక్తి మెరుగ్గా ఉంటాయనేది ఎన్నో పరిశోధనల్లో ఋజువైంది.** ఉదాహరణకు హాంగ్‌కాంగ్ లో ఇటీవల జరిగిన ఒక అధ్యయనంలో మాతృభాషలో ఉత్తీర్ణులై వచ్చిన విద్యార్థులు భౌతిక శాస్త్రంలోని పై స్థాయి విషయాలను ఇట్టే అర్థం చేసుకోగలిగారు, ఆంగ్లమాధ్యమంలో చదువుకున్న విద్యార్థులకన్నా మెరుగ్గా. దక్షిణాఫ్రికాలో జరిగిన మరో పరిశోధనలో మాతృభాషలో విజ్ఞానశాస్త్ర, ఇంజనీరింగ్ సంబంధిత అంశాలను చదువుకున్న విద్యార్థులు, ఆంగ్లమాధ్యమంలో చదువుకున్న విద్యార్థులకన్నా మెరుగ్గా తాము నేర్చుకున్న అంశాలను తిరిగి చెప్పగలిగారు, వారి ఆత్మవిశ్వాసం కూడా మెరుగ్గా ఉందని ఈ అధ్యయనంలో తెలిసింది. లెబనాన్ దేశంలో విద్యార్థులు తమకు మాతృభాషాలో విద్య కావాలని అడుగుతున్నారట. విద్యార్థులకు వారి మాతృభాషల్లో విద్య అందితే వారి సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, నెగ్గే నైజం బాగా మెరుగవుతున్నాయని ఈ రంగంలో జరిగే ప్రతి పరిశోధనలోనూ, అధ్యయనంలోనూ తెలుస్తోంది. ప్రాథమిక స్థాయి నుండి ఆపై ఇంజనీరింగ్ విద్యలో సైతం మాతృభాషా బోధనను ప్రవేశపెట్టాలన్న కొత్త విద్యా చట్టం, అందుకు తగ్గట్టు అడుగులు వేస్తున్న ప్రభుత్వ చర్యలు మెచ్చుకోదగ్గవి." అని జాతీయ విద్యా చట్టాన్ని ఆయన సమర్థించాడు. తన సుదీర్ఘ బోధనానుభవంలో ఐఐటీలో ఆంగ్లంలో మాత్రమే కాకుండా, ఆంగ్లం-హిందీ కలిపి మిశ్రమ భాషలో బోధించినపుడు విద్యార్థులు తాను చెప్పిన పాఠాలను మరింత మెరుగ్గా ఆకళింపు చేసుకున్నారని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు తరగతి గదిలో మరింత ఆసక్తిగా నడుచుకున్నారని, తన స్వీయానుభవం పంచుకున్నాడు. ఐఐటీల్లో మొదటి సంవత్సరాంత పరీక్షల్లో మౌలిక సబ్జెక్టులైన ఫిజిక్స్, గణితంలో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉత్తీర్ణులు కాలేక పోవడానికి ఆంగ్ల మాధ్యమం ఒక అడ్డుగోడగా ఉంటోందని, ఆ గోడని దాటే అదనపు చాకిరీ విద్యార్థులు భరించాల్సి వస్తుందని ఆయన అన్నాడు. ప్రాంతీయ భాషల్లో, లేదా కనీసం ఆంగ్లం కలిపిన మిశ్రమ భాషలో బోధనా, పరీక్షలు చేపట్టి ఈ అడ్డంకిని సమర్థంగా దాటవచ్చని ఆయన అభిప్రాయ పడ్డాడు.

ఐఐటి హైదరాబాదు ఆచార్యులు శివ్ గోవింద్ సింగ్ తమ అభిప్రాయాన్ని చెబుతూ, మాతృభాషలో బోధనాంశాలు విద్యార్థి తిరిగి చెప్పగలిగినపుడే అతను విషయ పరిజ్ఞానాన్ని మెరుగ్గా కలిగి ఉండే అవకాశాలున్నాయని, తన స్వీయ అనుభవంలో తెలుసుకున్న విషయమిది అని ఆయన చెప్పాడు.

ఐఐటీ బెనారస్ హిందూ యూనివర్సిటీ సంచాలకుడు ప్రమోద్ కుమార్ జైన్ మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక అంశాల్లో విషయ పరిజ్ఞానం సమకూర్చాల్సిన బాధ్యత బోధకులదే అని చెప్పాడు. ప్రస్తుతం ఐఐటీలలో, ఎన్ఐటీలలో ఉపాధ్యాయులు మిశ్రమ భాషలో బోధిస్తున్నారని, అయితే పరీక్షా విధానం కూడా ప్రాంతీయ భాషల్లో ఉంటే విద్యార్థులకు మరింత చేరువగా సాంకేతిక విద్య ఉంటుందని అభిప్రాయపడ్డాడు.

**మరి బయట ప్రపంచంలో అన్ని ఉద్యోగాలలో ఆంగ్ల భాష అవసరం ఉంటోంది, ఇలాంటి పరిస్థితుల్లో ప్రాంతీయ భాషల్లో చదువుకున్న సాంకేతిక విద్యార్థులు ఎలా పోటీని తట్టుకోగలరు? అన్న సంశయానికి ఆచార్య జగదీశ్ కుమార్ సమాధానమిస్తూ, ఆంగ్లం కేవలం సంభాషణలకు కావాల్సిన ఒక ఉపకరణమే గానీ, పనికి కావాల్సిన నైపుణ్యత ప్రాంతీయ భాషలో నేర్చుకున్నా,**

**ఆంగ్లంలో నేర్చుకున్నా పెద్ద తేడా ఉండదు అని అన్నాడు.** పైగా మాతృభాషలో నేర్చుకున్న విద్యార్థి మెరుగైన ఆత్మవిశ్వాసంతో పని చేయగలడని అన్నాడు. ఉదాహరణగా తమిళనాడులోని ఏదైనా ఆటోమొబైల్ తయారీ కంపెనీలో ఆంగ్ల భాషా నైపుణ్యం కన్నా ప్రాంతీయ భాషా నైపుణ్యం ఎక్కువ అవసరం అని అక్కడ ఉద్యోగాల్లో చేరిన పూర్వవిద్యార్థులు తెలిపారని ఆయన చెప్పాడు.

ప్రాంతీయ భాషల్లో బోధనలో ఏం చిక్కులున్నాయి?

బోధనకు కావాల్సిన పారిభాషిక పదాలు, బోధనా సామగ్రి, ఉపాధ్యాయుల్లో ప్రాంతీయ భాషా బోధనకు కావాల్సినంత ఆసక్తి ఉండటం మొదటి సవాలు. ఉద్యోగాల కల్పన రెండో సవాలు. పరిశోధనకు పెద్ద పీట వెయ్యాలంటే, పరిశోధనా పత్రాలను ప్రాంతీయ భాషల్లో ప్రచురించే జర్నల్ల సంఖ్య పెరగాలి, పరిశోధనా పత్రాలను సమర్పించే సమావేశాలలో ప్రాంతీయ భాషలలో సమర్పించే పత్రాలకు పెద్ద పీట వేయాలి.

అయితే ఐఐటీ లాంటి జాతీయ సంస్థల్లో ఒక్కో తరగతిలో దేశం నలుమూలల నుండి వచ్చిన ఎన్నో భాషలు మాతృభాషలుగా గల విద్యార్థులుంటారు. ఉపాధ్యాయుడు కూడా ప్రాంతీయ భాష తెలిసిన వాడై ఉండకపోవచ్చు. కానీ మారుతున్న సాంకేతికత వలన ఏ భాషలోనైనా బోధన జరుగుతుంది. ఈ పరిస్థితిని ఎంత సృజనాత్మకంగా అందరికీ ఉపయోగపడేలా మలుచుకోవచ్చోనన్న బాధ్యత ఉపాధ్యాయుడి పై ఉంది. జాతీయ అనువాద, అనుసృజన సంస్థ ఏర్పడ్డాక ఈ విషయమై మరింత స్పష్టత చేకూరుతుంది.

పై అభిప్రాయాలకు విపరీతంగా పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. **వారు ప్రాంతీయ భాషల్లో ఇంజనీరింగ్ విద్యకు వ్యతిరేకత తెలుపున్నందుకు ప్రధాన కారణం, సమయాభావం.** అతి తక్కువ కాలంలో, అంటే ఈ రానున్న విద్యా సంవత్సరం నుండే బోధన ప్రాంతీయ భాషల్లో జరగాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వీరిలో సింహభాగం వ్యతిరేకిస్తున్నారు. తగినంత సమయం ఇస్తే, ప్రాంతీయ భాషల్లో బోధనాంశాలు రూపొందించవచ్చని, ప్రాంతీయ భాషల్లో చదివించే ఉపాధ్యాయులను సన్నద్ధం చేసుకోవచ్చని వారి

## నలభై శాతం తెలుగు ఇంజనీరింగ్ విద్యార్థులకు తెలుగులోనే ఇంజనీరింగ్ కావాలి!

### అఖిల భారత సాంకేతిక విద్యా సంస్థ నిర్వహించిన సర్వేలో తెలిసిన ఆసక్తికరమైన విషయాలు.

**ఈ** ఏడాది ఫిబ్రవరిలో అఖిల భారత సాంకేతిక విద్యా సంస్థ(ఏఐసీటీఈ) ఒక సర్వేను నిర్వహించింది. ఈ సర్వేలో ఏఐసీటీఈ అనుబంధ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులందరూ పాల్గొనవచ్చు. వారం రోజులపాటు అందుబాటులో ఉన్న ఈ స్వచ్ఛంద సర్వేలో 83,195 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం పది ప్రశ్నలున్న ఈ సర్వేలో విద్యార్థులు ప్రస్తుతం ఏ ఏడాది ఇంజనీరింగ్ చదువుతున్నారు, ఏ కళాశాలలో చదువుతున్నారు, పేరు, స్త్రీ/పురుషుడు, ఇంజనీరింగ్ బ్రాంచ్, మాతృభాష, పదవ తరగతి వరకు చదువుకున్న మాధ్యమం, ఇంటర్ లో చదువుకున్న మాధ్యమం, బిటెక్ విద్య ఇంగ్లీష్ కాకుండా మాతృభాషా మాధ్యమంలో ఉండాలా, ఒకవేళ మాతృభాషలో ఉంటే, ఏ భాషలో చదవాలనుకుంటున్నారు. అనే అంశాలున్నాయి.

ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రముఖ కళాశాలలన్నిటి పేర్లూ సర్వేలో కనిపించాయి, అంటే ఇక్కడి విద్యార్థులు బాగానే సర్వేలో పాల్గొన్నారు. నాలుగు ఏడాదుల వాళ్ళు సమపాళ్ళలో పాల్గొన్నారు. అత్యధికంగా కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు 26% పాల్గొన్నారు. తమిళం మాతృభాష అని చెప్పుకుని 29,683 మంది విద్యార్థులు పాల్గొనగా, తెలుగు వారు 11,531 మంది విద్యార్థులు ఈ సర్వేలో పాల్గొన్నారు. 14,730 మంది హిందీ విద్యార్థులు ఈ సర్వే లో పాల్గొన్నారు. సంఖ్యాపరంగా మొత్తం సర్వే లో పాల్గొన్నవారిలో దాదాపు 14% తెలుగు విద్యార్థులున్నారు.

పదవ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం వారు మొత్తం సర్వేలో 79% ఉన్నారు. 15.2% మంది మాతృభాషా మాధ్యమంగా నమోదు చేసుకున్నారు. అయితే ఐచ్ఛికాలలో ఆంగ్లమా, మాతృభాషా? అని ప్రశ్న ఉన్నా, జవాబులో హిందీ, తమిళం, తెలుగు, సెమి-ఇంగ్లీష్ ఇలా ఇతర ఐచ్ఛికాలు కూడా సర్వేలో పాల్గొన్న విద్యార్థులు చొప్పించారు. అలా ఒక 50-100 తెలుగు అని సూచించారు (telugu, Telugu, Telugu medium ఇలా వేరు వేరుగా చొప్పించి).

ఇంటర్లో 81.7% మంది ఆంగ్ల మాధ్యమం అని ఎంచుకోగా, 12.6% మంది మాతృభాషా మాధ్యమమని ఎంచుకున్నారు. ఇక్కడ కూడా బలవంతంగా హిందీ, తమిళం, గుజరాతీ అని చొప్పించిన వారున్నారు.

తొమ్మిదవ ప్రశ్న – ప్రస్తుత ఇంజనీరింగ్ విద్య ఒకవేళ ఆంగ్లంతో పాటుగా మాతృభాషామాధ్యమంలో అందుబాటులో ఉంటే, ఆంగ్ల మాధ్యమమా? మాతృభాషా మాధ్యమమా? అని అడగగా, 56.2% మంది మాతృభాషా మాధ్యమమని, 43.8% మంది ఆంగ్లమాధ్యమం అని జవాబిచ్చారు.

ఇక ఆఖరు ప్రశ్న – మాతృభాషా మాధ్యమమైతే ఏ భాషలో ఉండాలి? అని.

దీనికి జవాబుగా అత్యధికంగా 14,129 మంది తమిళం అని జవాబిచ్చారు. తరువాతి స్థానంలో హిందీ 8.608 మంది విద్యార్థులు అడిగారు. ఆ తరువాత తెలుగు కావాలని 4.646 మంది విద్యార్థులు కోరారు. తరువాతి వరుసలో మరాఠీ, కన్నడ, మలయాళం, గుజరాతీ, మొదలగు భాషల్లో ఉండాలని అభ్యర్థన అందింది.

ఈ సర్వేలో తికమక పెట్టే విషయం, మాతృభాష ఏది అని ఆరవ ప్రశ్నగా అడిగి, మళ్ళీ పదవ ప్రశ్నలో మాతృభాషా మాధ్యమ ఇంజనీరింగ్ విద్యలో ఏ భాషను ఎంచుకుంటారు అని అడగడం.

అంటే తమిళమో, తెలుగో మాతృభాష ఉన్నా, హిందీ మాధ్యమంలో అడుగుతారని ఏఐసీటీఈ అభిమతం ఏమో?

మాతృభాషలోనే ఇంజనీరింగు కావాలని అడిగిన విద్యార్థుల్లో, భాషలవారిగా : తమిళం-47.5 %, హిందీ-58.43% తెలుగు-40.18%. అంటే 10లో నలుగురు తెలుగు ఇంజనీరింగ్ విద్యార్థులకు తెలుగులోనే ఇంజనీరింగ్ కావాలి.

తెలుగు మాధ్యమం పాఠశాల స్థాయిలో వద్దు అన్న ప్రభుత్వాలకి ఈ గణాంకాలు కనువిప్పు చేస్తే బావుణ్ణు.

–రహ్మానుద్దీన్ షేక్

వాదన.

కొందరు ఆచార్యులు మాత్రం ఈ ప్రాంతీయ భాషల్లో ఇంజనీరింగ్ విద్యా బోధన చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తిరోగమనానికి నాందిగా, వెనుకబాటుతనం వైపు పోకడగా (a very regressive and retrograde idea) చెబుతున్నారు.

ఐఐటీ బీహెచ్‌యు ఇప్పటికే మొదటి సంవత్సరం బీటెక్ కోర్సును హిందీలో ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం ప్రాంతీయ భాషల్లో ఇంజనీరింగ్ అందించే ఐఐటీలు, ఎన్ఐటీల జాబితా రూపొందిస్తోంది. ఈ ప్రాంతీయ భాషా తరగతులు ఇంతకు ముందున్న ఆంగ్ల భాషా తరగతులకు అదనంగా చేరుతున్నాయే తప్ప, ఆంగ్ల భాషను తీసివేసి ప్రాంతీయ భాషల్లో కోర్సులు ప్రవేశపెట్టడం లేదు. కొందరు మీడియా ఛానళ్ళ వారు మాత్రం ఆంగ్ల భాషను తీసివేసి ప్రాంతీయ భాషల కోర్సులతో భర్తీ చేస్తున్నట్టుగా దుష్ప్రచారం చేసారు.

ఒకానొక ఐఐటి సంచాలకుడు (చాటుగా, పేరు చెప్పకుండా) ఒక మీడియా సంస్థతో మాట్లాడుతూ, ఈ కేంద్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల మొత్తం బోధనా సిబ్బంది విముఖంగా ఉన్నారని, ఇది విద్యను చిన్నచూపు చూడటం అని అతను ఎందకట్టాడు. ఐఐటీలకు ఉన్న ప్రాచుర్యాన్ని, పేరు ప్రఖ్యాతులను– ఈ ప్రాంతీయ భాషల కోర్సుల ప్రవేశం నీరుగార్చుతుందని అతడు ఆందోళన వ్యక్తం చేసాడు. ప్రాంతీయ భాషల్లో ఇంజనీరింగ్ బోధన అసంభవం అనీ, ఐఐటీ లాంటి జాతీయ సంస్థలో దేశం నలుమూలల నుండి వివిధ భాషలు మాట్లాడే విద్యార్థులు వచ్చి సమర్థవంతంగా ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్నారని. ప్రాంతీయ భాషా బోధన విద్యార్థుల్లో అనవసరపు తారతమ్యాలు తెస్తుందని అతడి అభిప్రాయం. ప్రాంతీయ భాషల్లో ఐఐటీల్లో చేరేందుకు ఎంపిక పరీక్షలు ఉండటంలో అభ్యంతరం లేదు కానీ, ఒక సారి ఐఐటీలో చేరిన విద్యార్థి ప్రపంచ స్థాయి నైపుణ్యం పొందాలంటే ఆంగ్ల మాధ్యమం అవసరమని అతడి అభిప్రాయం. ఐఐటీల్లో బిటెక్ ప్రాంతీయ భాషల్లో బోధించడం ఒక దుర్ఘటనగా అతడు వర్ణించాడు.

మరొక ఐఐటీ ప్రొఫెసర్ మాట్లాడుతూ, "ఐఐటీల్లో ఇంత హడావుడిగా ప్రాంతీయ భాషల్లో బోధన మొదలుపెట్టాలంటే ఉపాధ్యాయులను సన్నద్ధం చేయటం కష్టం! ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో ఆంగ్ల మాధ్యమంలో సమర్థవంతంగా బోధించగల ఆచార్యులను వెతకడమే మూడు చెరువుల నీరు తాగిస్తుంటే, ప్రాంతీయ భాషా బోధకులను ఇప్పటికిప్పుడు చేర్చుకుని, ఐఐటీ స్థాయికి వారు బోధించేలా తీర్చిదిద్దడం నేల విడిచి సాము చేయటం లాంటిది. నేను హిందీ మాధ్యమంలో చదువుకొని, ఆపై ఐఐటీ కాన్పూర్ విద్యార్థినయ్యాను. ఐఐటీలో ఉండగా హిందీపై పట్టు పోయింది. ఇప్పుడు హిందీలో ఇంజనీరింగ్ పాఠ్యాంశాలు బోధించమంటే, నేను బోధించలేను! నాణ్యమైన ఉపాధ్యాయులను వెతికి మరీ ఐఐటీల్లో బోధనా సిబ్బందిగా అతి కష్టం మీద తీసుకు రాగలుగుతున్నాము. విదేశాల నుండి ఇక్కడకు వచ్చే ఆచార్యులు ఈ రకమైన పరిణామాల వల్ల ఐఐటీల్లో చదివించడానికి సుముఖత చూపకపోవచ్చు. ప్రపంచంలో వంద ఉత్తమ సాంకేతిక కళాశాలల్లో చేరేందుకు ఉబలాట పడుతున్న భారతీయ ఐఐటీల శ్రమను, ప్రాంతీయ భాషా ఇంజనీరింగ్ బోధన నీరుగార్చేస్తుంది. ఐఐటీల ఎంపిక – అది విద్యార్థుల ఎంపికైనా, బోధనా సిబ్బంది ఎంపికైనా – ప్రాంతీయ భాషల్లో ఇంజనీరింగ్ విధానం తేవడంతో నాసిరకంగా పరిణమిస్తుంది."

"గత ఏడాది ఆర్థికంగా వెనకబడ్డ విద్యార్థుల రిజర్వేషన్ వల్ల పెరిగిన విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు తరగతి గదులు లేక ఇబ్బంది పడుతుండగా, ఈ ప్రాంతీయ భాషల్లో ఇంజనీరింగ్ ఐఐటీల్లో మరిన్ని తరగతుల అవసరాన్ని కల్పిస్తుంది. ఒక్క ఏడాదిలో విద్యార్థులకు తగిన వసతులు ఏర్పాటు చేయటం పెద్ద సమస్యే.

ప్రాంతీయ భాషల్లో సాంకేతిక విద్య అనగానే మన వారికి కొత్తగా పాఠ్య పుస్తకాలు రాయాలన్న అవసరం కన్నా, ఉన్న ఆంగ్ల పాఠ్యపుస్తకాలను ప్రాంతీయ భాషల్లో తర్జుమా చేసెయ్యాలనే తోస్తుంది. ఎందుకంటే ఆ పని సులువు కనుక. ఒక ఇంజనీరింగ్ విద్యార్థి తరగతి గదిలో ప్రామాణిక పాఠ్య పుస్తకాలే కాకుండా, బయటి పుస్తకాలు ఎన్నో చదవాల్సి ఉంటుంది. ప్రధాన పాఠ్యపుస్తకం ఒక్కటి ప్రాంతీయ భాషలో రూపొందించి ఇవ్వటమే కష్టం అయితే, అదనపు రిఫరెన్స్ పుస్తకాలను ప్రాంతీయ భాషలో చదివే విద్యార్థులకు ఎలా అందించగలము? అలా అందించలేనప్పుడు, వారికి అన్యాయం చేస్తున్నట్టే." అని మరో ప్రొఫెసర్ అన్నారు.

ఒక ఫేస్‌బుక్ పోస్టులో ఐఐటి ఖరగ్పూర్ సంచాలకుడు వీరేంద్ర కుమార్ తివారీ రాస్తూ ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించాడు. ప్రతి సాంకేతిక విద్యా సంస్థలో ప్రాంతీయ భాషా హబ్ ఉండాలని. ఈ హబ్ బోధనాంశాలను, ఇతరత్రా విద్యార్థులకు అవసరమయ్యే బోధన సామగ్రిని ప్రాంతీయ భాషల్లో రూపొందించాలని ఆయన ప్రతిపాదించాడు. ప్రత్యేక సంస్థలో వచ్చి చేరే విద్యార్థుల నేపధ్య భాషను అనుసరించి, అందుబాటులో ఉన్న సిబ్బంది సహకారంతో, విద్యార్థులు ముఖ్యంగా ఆంగ్ల భాష బోధనలో ఎదుర్కొన్న అంశాల ప్రాతిపదికన ఈ హబ్ లు పని చేయవచ్చని ఆయన అన్నాడు. ఐఐటీ ఖరగ్పూర్ లో ఇప్పటికే ఇలాంటి ఒక ప్రాంతీయ భాషా హబ్ బెంగాలీ, తెలుగు, హిందీ విద్యార్థులకు ఆసరాగా పని చేస్తోందని. కొన్ని ఎంపిక చేసిన సబ్జెక్టులకు ఈ సహకారం ఒడియా, తమిళంలో కూడా ఉందని ఆయన ఈ పోస్ట్‌లో పేర్కొన్నాడు.

**మన ముందున్న వ్యక్తి ఏ భాషలో మాట్లాడుతున్నా, మన భాషలోకి మార్చి వినిపించగల కృత్రిమమేధ సాంకేతికత అండతో మన భాషలో బోధించే సిబ్బంది లేకున్నా, చక్కగా తరగతి గదిలో ఆంగ్లంలో చెప్పేదంతా మన మాతృభాషలో వినవచ్చు.**

ఇలాంటి సాంకేతిక విప్లవం వైపు ఇప్పటికే ఐఐటీ ఖరగ్పూర్ పనిచేస్తోందని వీరేంద్ర అన్నాడు.

ఐఐటీ గౌహతి సంచాలకులు గౌతం బరువా మాట్లాడుతూ, దీర్ఘ కాలంలో ఇది సాధ్యమేమో కానీ, ఇంత తక్కువ వ్యవధిలో ప్రాంతీయ భాషల్లో ఇంజనీరింగ్ బోధన అసాధ్యమని అన్నాడు.

ఐఐటీ ఢిల్లీ డైరెక్టర్ రాంగోపాల్ రావు మాట్లాడుతూ ఐఐటీల్లో

ప్రాంతీయ భాషల్లో ఇంజనీరింగ్ అనేది ఐఐటీల నాశనానికి నాంది అని పేర్కొన్నాడు. బోధనా సిబ్బంది ఎంపికకి ప్రస్తుతం కేవలం విషయ పరిజ్ఞానం ఒక ప్రాతిపదిక. ప్రాంతీయ భాషల్లో బోధించే సిబ్బందిని ఎంపిక చేయాలంటే, ఆ భాషలో నైపుణ్యత ఉన్నవారినే ఎంచుకోవాలి. అలాంటి వారిలో విషయ పరిజ్ఞానం పెద్దగా ఉండదు, అందువల్ల ఐఐటీ బోధనా సిబ్బంది నాణ్యత దెబ్బ తింటుంది. ఆ విధంగా ఈ చర్య ఐఐటీల ముగింపుకి మొదటి అడుగవుతుంది.

ఇంటర్ వరకు పూర్తి తెలుగు మాధ్యమంలో చదివి ఆపై ఐఐటీకి వచ్చిన రావు మాత్రం జేఈఈ(ఐఐటీల్లో చేరేందుకు రాసే అర్హత పరీక్ష) మాతృభాషల్లో ఉండాలని అంటున్నాడు.

ఒక సారి ఐఐటీ లో చేరాక విద్యార్థులు సహాయక జట్టులుగా ఏర్పడి ఎంత త్వరగా అయితే అంత త్వరగా ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి అని ఆయన అభిమతం.

"మనం ప్రపంచ స్థాయి ఇంజనీర్లను తయారు చేస్తున్నాం. తమిళనాడు కోసమో, ఆంధ్ర కోసమో కాదు!" అని ఆయన అభిప్రాయం.

"మొదటి ఏడాది, మొదటి సెమెస్టర్ లో కొన్ని సబ్జెక్టులు కావాలంటే ప్రాంతీయ భాషల్లో బోధించవచ్చేమో కానీ, సాంతం బిటెక్, ఎంటెక్ ప్రాంతీయ భాషల్లో బోధించడం కష్టం" అని ఆయన అభిప్రాయం.

**ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో ఉన్న భారతీయ జనతా పార్టీ, ఈ పార్టీకి సిద్ధాంతపరంగా వెనుక ఉన్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చాలా ఏళ్ళుగా విద్య ప్రాంతీయ భాషల్లో ఉండాలని సైద్ధాంతికంగా నమ్ముతున్నారు. ముఖ్యంగా సాంకేతిక విద్య భారతీయ భాషల్లో ఉండాలన్నది వీరి సంకల్పం.** 2016లో ఆరెసెస్ నేతృత్వంలో ఒక అభ్యర్థన ద్వారా ప్రాంతీయ భాషల్లో సాంకేతిక విద్య ఉండాలని పట్టుబట్టి అప్పటి మానవవనరులశాఖ(ప్రస్తుతం విద్యా శాఖ) మంత్రి ప్రకాశ్ జావడేకర్ కి వినతిపత్రం ఇచ్చారు. ఐఐటీల్లో, ఐఐఎంలలో, ఇంకా కేంద్ర ప్రభుత్వ నిధులతో నడుస్తున్న ఉన్నత విద్యా సంస్థల్లో ప్రాంతీయ భాషల్లో విద్య ఉండాలని. విద్యా విధాన చట్టంలో ప్రాంతీయ భాషల్లో సాంకేతిక విద్య అంశం జోడించడంలో ఈ వినతిపత్రం ముఖ్యంగా చెప్పుకోవాలి.

మార్చి 26 నాటికి వివిధ ఉన్నతవిద్యాసంస్థల అభిప్రాయాలను సేకరించిన కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, ఆ అభ్యర్థనలలోని కొన్ని విషయాలను బహిర్గతం చేసింది.

ప్రాంతీయ భాషల్లో ఇంజనీరింగ్ విద్యను అందించేందుకు అనువుగా ఉన్నత విద్యాసంస్థలను సన్నద్ధం చేసేందుకు, వారి అభిప్రాయాలు సేకరించేందుకు రెండు పేనళ్ళను కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నియమించింది. ఇందులో మొదటి పేనల్ ఏఐసీటీఈ(అఖిల భారత సాంకేతిక విద్యా సంస్థ) నేతృత్వంలో ఉంది. ఈ పేనల్ తన అధీనంలో ఉన్న అన్ని ఇంజనీరింగ్ కళాశాలల్లో, సంస్థల్లో, విశ్వవిద్యాలయాల్లో ప్రాంతీయ భాషల్లో ఇంజనీరింగ్ విద్యను అందించేలా మార్గదర్శకాలు జారీ చేస్తూ, ప్రాంతీయ భాషల్లో ఇంజనీరింగ్ విద్యకు అనుకూలంగా నడుచుకుంది.

ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి అమిత్ ఖరే నేతృత్వంలో ఐఐటీల్లో, ఎన్ఐటీల్లో ప్రాంతీయ భాషల్లో సాంకేతిక విద్య సాధ్యాసాధ్యాల బేరీజుకు రెండవ పేనల్ ఏర్పరచబడింది. ఈ పేనల్ ఇంకా తన అభిప్రాయం చెప్పలేదు. ఈ పేనల్ కు ఐఐటీల తరపు నివేదిక భారతీయ భాషల్లో ఇంజనీరింగ్ అందించడం కష్టమని, అందుకు ఐఐటీలు ఇప్పుడప్పుడే సన్నద్ధంగా లేవని చెప్పింది. అయితే ప్రాంతీయ భాషల్లో చదువుకుని వచ్చే విద్యార్థులు ఆంగ్ల మాధ్యమ స్థాయిని అందిపుచ్చుకునేలా ఆంగ్ల నైపుణ్య బోధన చేయగలమని ఐఐటీల నివేదిక తెలిపింది. ఇదే పేనల్ కు ఎన్ఐటీల తరపున అందిన నివేదిక ప్రాంతీయ భాషల ఇంజనీరింగ్ విద్యకు సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది.

ఐఐటీ తరపు నివేదిక సమర్పించిన వారి ప్రకారం ఐఐటీల్లో వచ్చి చేరే విద్యార్థులు వివిధ భాషల వారుంటారు. ఒక ప్రాంతీయ భాషలో బోధన మొదలుపెడితే, మిగితా భాషల వారికి అన్యాయం చేసినట్టు ఔతుందని వారి అభిప్రాయం.

ఐఐటీల్లోలా కాకుండా ఎన్ఐటీల్లో 50% ప్రాంతీయ విద్యార్థులు చేరతారు. అందువలన ప్రాంతీయ భాషలో ఇంజనీరింగ్ సబ్జెక్టుల బోధన ఎన్ఐటీల్లో పెద్ద ఇబ్బంది కాకపోవచ్చు. ఎన్ఐటీ భోపాల్, అలాహాబాద్, హిమాచల్ ప్రదేశ్, జైపూర్లు ఈ విధానాన్ని స్వాగతిస్తూ ప్రాంతీయ భాషా ఇంజనీరింగ్ బోధనకు తాము సిద్ధమని తెలిపారు.

ఏఐసీటీఈ వారు ఆంగ్లంలోని పాఠ్యాంశాలను ప్రాంతీయ భాషల్లోకి అనువదించే పలు యాంత్రిక అనువాద ఉపకరణాలను అభివృద్ధి చేసినట్టు తెలుస్తోంది. సంస్థ ఇప్పటికే మొదటి, రెండవ సంవత్సర ఇంజనీరింగ్ పాఠ్యాంశాలను ఎనిమిది భారతీయ భాషల్లోకి సమర్ధవంతంగా అనువదించి అందుబాటులో ఉంచిందట. కేవలం ఒక 5% మానవ తనిఖీ జరిగితే చాలు, ఇవన్నీ నేరుగా తరగతి గదిలో వాడుకోవచ్చు. ఫార్ములాలు, గణిత, భౌతికశాస్త్ర ఈక్వేషన్లు ఈ ఉపకరణాల ద్వారా అన్ని భారతీయ భాషల్లోకి తర్జుమా ఐపోతాయట.

ఇప్పటికే ఇంజనీరింగ్ విద్యార్థులకు అందుబాటులో ఉన్న స్వయం మొబైల్ ఆప్ లోని కొన్ని కోర్సులను యాంత్రిక అనువాదం ద్వారా అనువదించి నాణ్యతా పరీక్షలు చేస్తున్నారట.

ఏఐసీటీఈ చెయిర్మన్ అనిల్ సహస్రబుద్ధె ఈ విషయాలను చెబుతూ, సాంకేతిక విద్య ప్రాంతీయ భాషల్లో బోధించడం కొత్తేం కాదని. చాలా ఏళ్ళుగా రాజస్థాన్ లో హిందీలో, తమిళనాడులో తమిళంలో ఇంజనీరింగ్ డిప్లొమా ఇస్తున్నారని, స్వాతంత్ర్యానికి ముందు ఎన్నో సంస్థల్లో ఉర్దూలో సాంకేతిక విద్య ఉండేదని ఆయన చెప్పాడు.

## మాతృభాషకాని భాషలో విద్యాభ్యాసం
## విద్యార్థి చదువుకు అడ్డంకిగా మారుతుంది – 'యునెస్కో'

జె.డి. ప్రభాకర్
8500227185

# విద్యామాధ్యమంపై వీడుతున్న వలసవాదపు నీడలు

**స**మాజంలో ప్రజలు స్థానికంగా అమ్మనుడులను పలుకుతూ జీవనం సాగించే సహజ వాతావరణంలో ఇతర భాషలు ఉపయోగించే సందర్భాలు కలగడానికి అనేక కారణాలు ఉండవచ్చు. ఒక ప్రాంతానికి పక్కనే వేరొక భాషా సమూహం సరిహద్దులు పంచుకున్నప్పుడూ, ప్రకృతి వైపరీత్యాలూ, వలసలూ, వ్యాపారాలూ మొదలగు కారణాలచేత ఒక భాషా సమూహం వారు మరొక భాష నేర్చుకునే పరిస్థితులు నెలకొంటాయి. అలా కాకుండా **వ్యాపారం పేరుతో దేశాలను రాజకీయ చతురతతో దురాక్రమణ చేసి, ఆ దేశంలో నివసిస్తున్న ప్రజల శ్రమశక్తిని దోచుకుంటూ, అధికారాన్ని విస్తరింప చేస్తూ, వారి భాషనూ, సంస్కృతినీ, మతాన్నీ ఇతరులపై బలవంతంగా రుద్దే క్రమం 15వ శతాబ్దంలో యూరోపియన్లు ప్రారంభించారు.** మన భారతదేశంలో ఈ వలసవాదం 18వ శతాబ్దంలో ప్రారంభమైంది. చరిత్రకారుడు ఫిలిప్ హాఫ్మన్ చెప్పినట్లు 1914 సంవత్సరం నాటికి బ్రిటిష్ వలసవాదులు 84 శాతం భూగోళాన్ని దమననీతితో ఆక్రమించారు.

**ఆచార సంస్కృతులలో మార్పులు:**

వలసవాదానికి గురైన అనేక ప్రాంతాలూ, దేశాలూ వారి ఆచారాలూ, కట్టుబాట్లూ, సంస్కృతీ, సంపదా, భాషలూ సంకట స్థితిలోకి వెళ్లాయి. మొదట, బ్రిటిష్ ప్రభుత్వంలో ముఖ్యులైన వారెన్ హేస్టింగ్స్ మతమూ, సామాజిక ఆచారాల విషయాలలో జోక్యం చేసుకోకూడదు అనే ఉద్దేశంతో “ప్రతి సమాజంలో దాని సహజ చట్టాలూ, దాని ఆచారాలూ, అభ్యాసాలూ ఉన్నాయని, వాటిని కొనసాగించడానికి అనుమతించాలి” అని ఆదేశించారు. 1781 లో మొహమ్మడన్ కాలేజ్, 1782 లో హిందూ కాలేజీలను స్థాపించి, మన దేశం యొక్క సాహిత్యమూ, చట్టమూ, మతాన్నీ పరిరక్షించాలని ఆదేశించారు. కొద్దికాలంలోనే, అంటే జూలై 10వ తారీకు 1800 సంవత్సరంలో కాలేజ్ ఆఫ్ ఫోర్ట్ విలియంని బ్రిటిష్ ఇండియా గవర్నర్ జనరల్ స్థాపించి- ఓరియంటల్ భాషలపై దృష్టి కేంద్రీకరించారు. భారత దేశంలో ప్రజల సాంఘిక మరియు సాంస్కృతిక జీవితంలో ఉద్దేశపూర్వకంగా జోక్యం చేసుకోని బ్రిటిష్ విధానం- 1813 తరువాత గణనీయమైన మార్పుకు గురైంది. పారిశ్రామిక విప్లవం రూపంలో ఇంగ్లాండ్‌లో జరిగిన భౌతిక మార్పు దీనికి ప్రధాన కారణం. ఈ మార్పులో భాగంగా, బ్రిటీష్ ఇండియా యొక్క అన్ని అధికార పరిధులలో సతి ఆచారాన్ని నిషేధించిన బెంగాల్ సతీ రెగ్యులేషన్ 1829 డిసెంబర్ 4 న అప్పటి గవర్నర్ జనరల్ లార్డ్ విలియం బెంటింక్ ప్రేరణతో ఆమోదించడం జరిగింది. సతీ సహగమనం మానవ స్వభావం యొక్క భావాలకు విరుద్ధం అని నియంత్రణ విధించింది. బాల్య వివాహాలు కూడా 19 వ శతాబ్దపు భారతదేశంలోని మరో దురాచారం. భారతీయ సంస్కర్తలు కేశవ్ చంద్ర సేన్, బిఎమ్ మలబరి ఈ పద్ధతిని భారతీయ సమాజం నుండి నిర్మూలించడానికి కృషి చేశారు. స్త్రీ శిశుహత్యలు మరొక అమానవీయ పద్ధతి. దాన్ని కూడా అరికట్టడానికి బ్రిటీషువారు 1795, 1802, 1804 తరువాత 1870 లో ఈ సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా చట్టాలను రూపొందించారు. అయినప్పటికీ భారతదేశంలో ఉన్న సంఘ సంస్కర్తలైన మహాత్మ జ్యోతిబా పూలే, రాజా రామ్మోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగం పంతులు మొదలగువారు భారతదేశంలోని సతీసహగమనమూ, బాల్య వివాహమూ, అస్పృశ్యతా వంటి సామాజిక దురాచారాలను అధ్యయనం చేసి వాటికోసం స్థానిక భాషలలో ప్రజలను విద్యావంతులను చేసి వీటిని అరికట్టడంలో ముఖ్య పాత్ర పోషించారు.

**బ్రిటిష్ పరిపాలనలోని విద్య - ఆర్థిక దోపిడి:**

**వ్యాపారం చేసుకోవడానికి ఈస్టిండియా కంపెనీ పేరుతో బ్రిటీషు వారు భారత దేశంలోకి అడుగుపెట్టి, క్రమేణా భారతీయులకు విద్యను అందించడానికి గల ప్రధాన కారణం- ఆర్థిక లాభాలను ఆర్జించడానికే అని చెప్పవచ్చు.** ఇక్కడ భారతీయులను బానిసలుగా చేసుకుని వారి శ్రమను దోపిడీ చేసి, తద్వారా సంపదను భారతదేశం నుండి తరలించి, తమ దేశానికి ఎగుమతి చేసుకోవడానికి ఉపయోగించుకున్నారు. 1.వ్యాపారం విస్తరింపచేయడానికీ, 2.దేశంలో ఉన్న ప్రజలందరినీ రాజకీయంగా పరిపాలించడానికీ, 3.బ్రిటిష్ ప్రభుత్వానికీ భారతీయులకూ మధ్యవర్తులుగా పనిచేసే ఒక వర్గం కావాలని భారతీయులకు విద్య నేర్పించడం జరిగింది. క్రైస్తవ మిషనరీల సహాయంతో ప్రైవేట్ పాఠశాలలనూ మరియు ప్రభుత్వ పాఠశాలలనూ ఏర్పరిచారు. **బాంబే ప్రెసిడెన్సీలో, మౌంట్‌స్టూవర్ట్ ఎల్ఫిన్‌స్టోన్, 1827లో గవర్నర్‌గా ఉన్నప్పుడు, భారతీయులకు చదువు మాతృభాషలో కల్పించాలని బొంబాయి ఎడ్యుకేషన్ సొసైటీని ప్రోత్సహించారు. మాతృభాష ద్వారా పాశ్చాత్య శాస్త్రం మరియు జ్ఞాన వ్యాప్తిని ప్రోత్సహించడానికి అనేక జిల్లా ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయబడ్డాయి. అయినప్పటికీ చాలా మంది ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులు ఇంగ్లీషు బోధనా మాధ్యమంగా ఉండాలని కోరుకున్నారు. అయితే బాంబే ప్రెసిడెన్సీ విద్యావిధానం స్థానిక భాషలకు విరుద్ధంగా ఉండడంతో ఈ నిర్ణయం వివాదానికి తెరలేపింది. ఇంగ్లీష్‌లో చదువుకున్న వారికే కొలువుల్లో పనిచేయడానికి ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చారు. వారి ప్రభుత్వం కోసం పనిచేసే వారిని ఎంపిక చేసుకోవడం మెకాలే మినిట్ ఆన్ ఇండియన్ ఎడ్యుకేషన్ 1835 లో పేర్కొన్నట్టుగా “మనకూ, మనం పరిపాలించే లక్షలాది ప్రజలకూ మధ్య వ్యాఖ్యాతలుగా ఉండే వర్గాన్ని**

**రూపొందించండి వర్గపరంగా, రక్తం మరియు రంగులో భారతీయులు, కానీ రుచి, అభిప్రాయాలు, నైతికత, తెలివితేటలలో ఇంగ్లీషు వారిగా ఉండాలి", వాళ్లనే బ్రిటిష్ ప్రభుత్వం ప్రోత్సహిస్తూ ఉండేవారు.** ఈ వర్గాన్ని ఉపయోగిస్తూ అనేకమంది శ్రమను దోచుకున్నారు. భారతీయులను బానిసలుగా మలిచారు. ఇంగ్లీషు భాషను ఎర చూపి ఈ వర్గానికి భారతీయత అనే భావన లేకుండా చేశారు. దేశాన్ని ఆర్థికంగా కొల్లగొట్టారు.

**ఇంగ్లీషు భాషా వ్యాప్తికి ఆర్థిక కారణాలు:**

బ్రిటీషువారికి తమ వ్యాపారం విస్తరించాలన్నా, రాజకీయంగా దేశాన్ని నియంత్రించాలన్నా భాష ముఖ్య సాధనంగా నిలిచింది. తమకు తెలియని భారతీయ భాషలు నేర్చుకొని వ్యాపారం కొనసాగించడం కష్టమని భావించి, భారతీయులను అనేకమందికి తమ భాష నేర్పించి శ్రామిక వర్గాన్ని తయారుచేసుకొన్నారు. ఇంగ్లీషు భాషా వ్యాప్తి బ్రిటిష్‌వారి వ్యాపార వ్యాప్తికి సారూప్యతను కలిగి ఉంది. **దోపిడీకీ, రాజకీయ నియంత్రణకూ భాషే ఆధారమైంది.** భారతీయులకు పాఠశాలలు స్థాపించి ఇంగ్లీషు భాషలో విద్య నేర్పించడాన్ని తమ అక్రమార్జనకు పెట్టుబడిగా భావించారు. భారతదేశ సంపదను వారి దేశానికి ఎగుమతి చేయడానికి ఇంగ్లీషు భాషను ఒక వాహనంగా వాడుకున్నారు.

భారతదేశంలోని ఎగువ మధ్యతరగతీ, మధ్యతరగతీ వర్గాలు బ్రిటిష్ ప్రభుత్వానికి పని చేయడం వలన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్న ఆశతో ఇంగ్లీష్ నేర్చుకోవడం ఆరంభించారు. ఆనాటి భారతీయులకు ఇంగ్లీషు నేర్పించడం ఈస్టిండియా కంపెనీ నియంత్రణలోనే ఉండేది. 19వ శతాబ్దం నాటి ఎగువ మధ్య తరగతీ, మధ్యతరగతీ భారతీయులు ఉద్యోగాలు చేసుకోవడం వల్ల తమ ఆర్థిక పరిస్థితి మెరుగవుతుందని, చక్కటి జీవన విధానం ఏర్పడుతుందన్న ఆశతో తమ పిల్లల్ని ఇంగ్లీషు మాధ్యమ పాఠశాలలకు పంపించేవారు. **బ్రిటిషు పాలకులతో ఇంగ్లీషులో మాట్లాడమే గొప్పగా భావించేవారు.**

**బ్రిటిష్ ఇంగ్లీషు విద్య – స్వతంత్ర భారతదేశంపై ప్రభావం:**

బ్రిటిష్‌వారు అందించిన ఇంగ్లీషు విద్యను ఒక భాషా కోణంలో మాత్రమే చూడకూడదు. మన దేశ ఆచారాలనూ, సంస్కృతినీ, దేశీయ సాహిత్యాన్నీ మరుగుపరిచే విధంగా – పాశ్చాత్య విద్యను అమల్లోకి తీసుకువచ్చారు. భారతీయ భాషలలో వ్రాయబడ్డ మన సాహిత్యాన్ని అధ్యయనం చేయడానికి తావు ఇవ్వలేదు. మన భావాలను మన భాషల్లో వ్యక్తీకరించడానికి ఆనాటి విద్యలో అవకాశం కల్పించలేదు. మన నీరు తాగుతూ, మన ఆహారాన్ని తింటూ, మన నేల మీద ఉంటూ, యూరోపియన్ల సాహిత్యమూ, వారి కళలనూ, శాస్త్రాలనూ అభ్యసింపచేశారు. **స్థానికంగా మనకుండే సమస్యలూ, కళల మీద అధ్యయనం కొరవడింది. పూర్తిగా మన దేశం యొక్క స్థితిగతుల మీద అవగాహన లేకుండా ఆనాటి విద్య పెడదోవ పట్టించిందనే చెప్పాలి. కాలక్రమేణా మన దేశ భాషల స్థానే న్యాయస్థానాల్లోనూ, ఇతర అధికార కార్యకలాపాలలోనూ ఇంగ్లీషుతో భర్తీ చేశారు.**

73 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో నేటికీ వాటి నీడలు అలాగే నిలిచిపోయాయి. బ్రిటీష్ వారు పరిపాలించిన అన్ని దేశాల్లోనూ విద్యా రంగాల్లో ఇంగ్లీష్ మాధ్యమంగా ఉంటోంది. ఆర్థిక దోపిడీ నుంచి అన్ని దేశాలూ బయట పడుతున్నా, బ్రిటీషువారు వదిలి వెళ్లిన భాషను మాత్రం విద్యా రంగంలోనూ, అధికార కార్యాలయాలనూ కొనసాగిస్తూనే ఉన్నారు. **ఆనాడు ఈస్టిండియా కంపెనీ వారు విద్యను నియంత్రించే స్థాయిలో ఉంటే – ఈనాడు విద్యా మాధ్యమంలో ఏ భాష ఉండాలనేది ప్రైవేటు కంపెనీలూ, మార్కెట్లూ నిర్ణయించే స్థాయిలోకి వచ్చింది. విద్య పూర్తిగా వ్యాపారమయమై పోయింది.** ఇంగ్లీష్ వస్తేనే ఉద్యోగాలు వస్తాయి అనే భ్రమలోకి నేటి సమాజాన్ని తీసుకెళ్లారు. బ్రిటీషు కాలంలో వారికి పనిచేసిన వారిలాగే, రక్తంలోనూ, రంగులోనే భారతీయులుగా ఉంటూ, భావాలలోనూ, నైతికతలోనూ, తెలివితేటల్లోనూ ఇంగ్లీషు వారిగా నేటికీ మన సమాజంలో చదువుకున్నవారు ఉండటం శోచనీయం. ఇంగ్లీషు నేర్చుకుని బ్రిటిష్ వారికి సేవ చేసి ఆర్థికంగా లాభపడాలని ఎగువ మధ్యతరగతీ, మధ్యతరగతీ వర్గాలు ఆనాడు ఏ విధంగా అయితే అనుకున్నాయో, నేడు కూడా నేర్చుకున్న ఇంగ్లీషు విద్యతో విదేశాలకు వెళ్లి వారికి సేవ చేసి ఆర్థికంగా బలపడాలని ఆలోచిస్తూ పనిచేస్తున్న వారూ ఉన్నారు. అయితే, ప్రపంచంలోని సమాచారం, సాహిత్యం ఎక్కువగా ఇంగ్లీష్ భాషలో ఉండటం వలన వాటిని అభ్యసించడానికి, జ్ఞానార్జనకు ఇంగ్లీషు భాషలో చదువుతున్నారు. ఉద్యోగ అవకాశాల కోసం కూడా ఇంగ్లీషు ప్రధానాధారం అని ఇంగ్లీషు మాధ్యమంలో చదువుతున్నారు. కానీ నేడు అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధతో (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) యంత్రానువాద సహాయంతో ఒక భాష నుంచి అనేక భాషలకు అనువాదం జరుగుతున్న ఈ కాలంలో జ్ఞానార్జనకు భాష అడ్డుగోడగా ఉంటుందనడంలో నిజం లేదు. ఇక భారతదేశంలో ఉద్యోగ అవకాశాలు పొంది పనిచేస్తున్న వారిలో ఇంగ్లీషు భాషలో నిష్ణాతులై, దానిని ఉపయోగిస్తూ సంపదను సృష్టించడమూ లేదు.

**మూడు భాషల సూత్రం:**

స్వాతంత్ర్యానంతరం అప్పుడే వలసవాద నీడల నుంచి బయట పడుతున్న సమయంలో శ్రీమతి ఇందిరాగాంధీ ప్రభుత్వంలో 1968 లో భాషా సమూహ గుర్తింపునూ, జాతీయ ఐక్యతనూ దృష్టిలో ఉంచుకొని, పరిపాలనా సామర్థ్యం లక్ష్యంతో మూడు భాషల విధానాన్ని అమలు చేశారు. ఈ మూడు భాషల సూత్రం ప్రాంతాలను ఆధారంగా చేసుకొని రూపొందించినట్టుగా కనిపిస్తుంది. హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో హిందీ, ఇంగ్లీషు మరొక ఆధునిక భారతీయ భాషను ఉపయోగించాలనీ, హిందీ యేతర రాష్ట్రాల్లో స్థానిక భాష, ఇంగ్లీషూ, హిందీ భాష ఉండాలని సూచించింది. తమిళనాడు రాష్ట్రం హిందీ భాషను బలవంతంగా రుద్దడం ఖండించి, మూడు భాషల సూత్రాన్ని వ్యతిరేకించారు. చివరకు మూడు భాషల సూత్రం దేశంలో

విజయవంతంగా అమలుపరచడంలో విఫలమై చతికెలపడిందని చెప్పొచ్చు. **ఏది ఏమైనప్పటికీ, బ్రిటీష్ వారు రూపొందించిన ఇంగ్లీష్ మాధ్యమ విద్య నుండి బయటకు వచ్చి – స్థానిక భాషలో విద్యను అందించే ఆలోచన చేయడం హర్షణీయం.** కానీ, ప్రభావవంతంగా ఈ సూత్రాన్ని అమలు చేసి, స్థానిక భాషల్లో విద్యను అందించినట్లయితే ఫలవంతంగా ఉండేది. విద్యా నాణ్యతా, బోధనా పద్ధతులూ ఆశించిన విధంగా లేకపోవడం వల్ల విద్యార్థుల ఫలితాలు పాఠశాలలో నిరాశ పరిచే విధంగా ఉన్నాయని 2018 వ సంవత్సరం లో విడుదల చేసిన ప్రపంచ బ్యాంకు గణాంకాలలో తేలింది. విద్యార్థుల అంతర్జాతీయ పరీక్షా ఫలితాలను ప్రపంచ దేశాలతో పోల్చి చూసినప్పుడు, నిరంతరం యుద్ధ వాతావరణం గడిపే ఆఫ్ఘనిస్తాన్‌తో సమానంగా మన దేశ ఫలితాలు ఉండటం విచారకరం. సగటున వేయికి 400 ఉంటే, భారతదేశంలోని విద్యార్థుల ఫలితాలు 355 సంఖ్యలో ఉన్నాయి.

**నూతన విద్యా విధానం –2020:**

భారతీయ భాషలను ఒక అంశంగా కాకుండా– విద్యా మాధ్యమంగా చేయడం పూర్తిగా వలసవాదపు భావాలకు విభిన్నంగా ఉండటం గొప్ప విషయం. విద్యను వలసవాద నీడల నుండి స్వతంత్ర పరిచినట్టు ఉన్నది. అమ్మనుడులను బోధనా మాధ్యమంగా 29జులై 2020నుండి అమలు పరుస్తూ..."సాధ్యమైన చోట, కనీసం 5 వ తరగతి వరకు, కానీ 8 వ తరగతి వరకు, అంతకు మించి ఇంటిభాష / మాతృభాష / స్థానిక భాష / ప్రాంతీయ భాష బోధనా మాధ్యమంగా ఉంటుంది" అని స్పష్టం చేసింది. దీనికి గల ప్రధాన కారణం బహుభాషావాదాన్ని ప్రోత్సహించడంతోపాటు, జాతీయ ఐక్యతను ప్రోత్సహించడం కోసం. ఈ విధానంలో మూడు భాషలు ఎంపికకు వీలు ఉన్నా, అందులో రెండు భారతదేశానికి చెందినవే అవ్వాలి. అయినప్పటికీ ఏ భాష కూడా బలవంతంగా విద్యార్థులపై గతంలో లాగా రుద్దదని – మానవ వనరుల అభివృద్ధి విద్యా మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. **నూతన విద్యా విధానం 2020లో భారతీయ సంస్కృతిని పాఠశాల విద్యలో ప్రతిబింబించేలా పాఠ్యప్రణాళికలు రూపొందించడం ప్రధానాకర్షణగా నిలుస్తోంది. ఇందులో కొన్ని విషయాలు మెరుగుపరచవలసినవి ఉన్నా, పూర్తి స్థాయిలో ఇది ఎటువంటి ఫలితం తీసుకుంటుందో చూడాలి.**

ఈ వ్యాసరచయిత పరిశోధక విద్యార్థి,
హైదరాబాదు విశ్వవిద్యాలయం.




మాతృభాషలో చదివిన పిల్లలు, ఇతర భాషలో చదివిన పిల్లలకంటే మెరుగుగానూ, త్వరగానూ నేర్చుకొంటారు. ఇంటి భాషలో చదివిన పిల్లలు, తర్వాత పాఠశాలలో పరీక్షలలో పనితీరు బాగుంటుంది. ప్రతిభా నైపుణ్యాలకు మించి ప్రయోజనాలతో బాటు మెరుగైన ఆత్మనిర్భరత, ఆత్మగౌరవం, ఆత్మధైర్యం అలవడతాయి–'యునెస్కో'

సన్నిధానం నరసింహశర్మ
92920 55531

# ఆగిన తెలుగు వెలుగు చిరస్మరణీయ సేవలు



బావుటా చేబట్టిన
ఈనాడు
సంపాదకులు
సుప్రసిద్ధులు
శ్రీ రామోజీరావు

**ఒక పని ఆగితే ఒక వ్యక్తికి నష్టం కావచ్చు,**
**ఒక పని ఆగితే ఒక సంస్థకు నష్టం రావొచ్చు.**

**కానీ ఒక పది మందికి అవసరమైన పని ఆగితే యావత్తు సమజానికీ నష్టం – పూడ్చలేని నష్టం ప్రస్ఫుటమవుతుంది. రామోజీ ఫౌండేషన్ వారు కొన్ని ప్రమాణాలతో నడిపిన 'తెలుగు వెలుగు' ఆగిపోయిందన్న వార్త చెవులబడినప్పుడు – భాషా సాహిత్యాభిమానులు ఆ సామాజిక నష్టాన్ని అనుభూతిచెందారు.**

చతుర, విపుల నవలాసాహిత్యానికి, కథాసాహిత్యానికి అనువాదాలకు చేసిన దోహదం అసామాన్యమైనది. 1978 నుండీ కొనసాగి అవి ఇప్పుడు ఆగాయి.

ప్రొద్దుటే లేవగానే సూరీడునీ ఈనాడునూ చూడకపోతే ఇద్దై పోయేవారు అసంఖ్యాకులు. రామోజీరావుగారి దార్శనిక దృష్టివల్ల, వ్యాపార సృజనాత్మకతల వల్ల రాష్ట్రంలో వేలమందికి ఉపాధి ఏర్పడడం మరువరానిది. క్రొత్తగా 'బాలభారతం' అని పిల్లల పత్రిక పెడితే అది లక్షా యిరవై వేల పైబడి పంపిణీ స్థాయికి ఎదిగిందంటే శ్రీ రామోజీరావు మార్గదర్శకత్వం, అంకితభావాలు గల ఆయన సహచర ఉద్యోగుల శ్రమతత్వం ఎన్నో ఆంతరంగీకంగా ఉన్నాయి. ఒక పెద్ద నిఘంటువును తెలుగు జాతికి అందించాలని లక్షల రూపాయలు వెచ్చిస్తూ ఒక అవిచ్ఛిన్న భాషా సేవ కొనసాగిస్తున్న శ్రీ రామోజీ రావు గారి పాత్రను మరువలేం.

వ్యవసాయ ప్రధానమైన, అన్నపూర్ణకి అక్షయపాత్ర వంటి అన్నదాత పత్రికను ప్రదానం చేసిన క్రొత్త చూపు శక్తి– శ్రీ రామోజీరావుగారిది.

బాలబాలికల్లో సృజనాత్మక పెంపుదలకు, ఆహ్లాదాన్ని కలగజేయడానికి, ఆధునిక వైజ్ఞానిక సమాజ అనుగుణ ఆలోచలనలను పెంపొందించడానికి పిల్లల పత్రిక– 'బాలభారతం'ని అభివృద్ధిపరిచారు. అదీ కాలీన పత్రికా జీవనపరిస్థితులను బట్టి ఆగిపోయింది.

ఎంత మందికో బ్రతుకుదన్నులిచ్చిన పత్రికలుగా ఆగిపోవడం తప్పని పరిస్థితుల్లోనే అయినా ఆ ప్రభావం ఎన్నో కుటుంబాలపై పడింది.

కొన్ని దినపత్రికలలో వివిధ సాహిత్య శీర్షికలు ఏదో ఒక రోజైనా వారపు విందులు చేస్తున్న సందర్భంలో ఈనాడులో అటువంటి సాహిత్యపు పుట లేదని లోటుగా సాహితీజనులు కొందరు అనుకోవడం ఉండేది. అటువంటి సందర్భంలో ప్రత్యేకంగా 'తెలుగువెలుగు' అనే భాషాసాహిత్య పత్రికను శ్రీ రామోజీరావుగారు ప్రధాన సంపాదకులుగా కొన్నేళ్లు ప్రామాణిక పద్ధతుల్లో నడపడం తెలుగు పత్రికా చరిత్రలో ఒక మహాదర్శం. తెలుగువెలుగు ఆయన కలల వెలుగు. ప్రణాళికాబద్ధంగా ఆలోచించి 2012 సంవత్సరంలో సెప్టెంబరు తొలి సంచికగా ప్రారంభించి, 2021వ సంవత్సరం మార్చి సంచిక వరకూ నిర్వహించారు. 103 సంచికలు సర్వాంగ సుందరంగా తెలుగు నాట మూడు ప్రాంతాల ప్రాతినిధ్యమూ సహజంగా ఉండేల చూసుకుంటూ నడిపారు. శతాధిక మాస భాసమైన ఈ తెలుగు పత్రికా ప్రస్థానంలో ఎన్నో శక్తిమంతమైన రచనలు! ఆసక్తి




తెలుగువెలుగు తొలి సంచిక
సెప్టెంబరు 2012

పెంచే శీర్షికలు. ధారావాహికలతో శిరోభార రచనలు కాకుండా నిత్యనూతన ఆలోచనలతో తెలుగు వెలుగు విజృంభించింది. అది 60వేల ప్రతుల పంపిణీకి ఎదిగింది. తెలుగు వెలుగు కేవలం తెలుగుభాషా సాహిత్యాలకు చెందిన పత్రిక మాత్రమే కాదు.

అది తెలుగు చరిత్ర, సాంస్కృతిక, కళాసంబంధ రచనలని పొదిగించుకున్న పత్రిక.

రామోజి ఫౌండేషను నడిపిన ఈ పత్రికకు ఆత్మ, శిరస్సు, మార్గనిర్దేశిక, సంపాదకత్వం, అన్నీ- శ్రీ రామోజీరావుగారే.

సంస్థ ట్రస్టీ శ్రీ కిరణ్ ఎప్పటికప్పుడు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను, విధినిర్వాహణ చేసేవారికి, నిధి నిర్వాహణాది కార్యాలను ప్రోత్సాహకరంగా చేయడం - తెలుగు వెలుగు విజయానికి దోహదం చేసింది.

శాఖాధిపతిగా తెలుగు వెలుగు బాధ్యులుగా తదేక దీక్షతో- సంపాదకుల ట్రస్టీల అనుసంధాన బలంతో శ్రీ జాస్తి విష్ణుచైతన్య చేసిన సేవలు తీసుకున్న మెలకువల వల్ల - తెలుగు వెలుగు తన ముద్రను వేసుకోగలిగింది. 25 మంది ముఖ్యులైన సిబ్బందితో పత్రికను నడపడం ఆషామాషి కాదు.

చతుర పత్రిక 518 సంచికల్ని; విపుల 518 సంచికల్ని; బాలభారతం 94 సంచికల్ని ఇచ్చింది.

తెలుగు వెలుగు 103 సంచికలు వచ్చాయి. శ్రీ రామోజీరావు గారికీ తెలుగు వెలుగు పత్రిక పట్ల గాఢాభిమానం ఉండటానికి అనేక అంశాలు సాక్షాత్కరిస్తాయి. దినపత్రికలకు రాయతీల ద్వారా వచ్చే కాగితంతో తె.వె. నడపలేదు. స్విట్జర్‌లాండ్ నుండి పెర్లెన్‌టాప్ అనే సంస్థనుండి నాజూకైన, విలువైన గట్టి కాగితాన్ని ప్రత్యేకంగా దిగుమతి చేసుకుని, ఆ కాగితాన్ని తెలుగువెలుగుకు వినియోగింపజేశారు. 60 పుటల దరిదాపు ఉండే ప్రతీ సంచికకు ఉత్పత్తి ధర ముప్పై అయిదు రూపాయలవుతుండగా 10 రూపాయలు ప్రతీ సంచికకు నష్టం వచ్చినా, తక్కువ ధరకే పత్రిక దొరకజేయడంలో లాభదృష్టిలేదు సరికదా ఏమైనా మంచి ప్రమాణాలతో నడపడమే ముఖ్యమని భావించిన- ఆదర్శ భాషా సాహిత్యాభిమాని శ్రీ రామోజీరావుగారు.

కష్టపడి, ఇష్టపడి సాహిత్య సృజన చేసే రచయితలని గౌరవించుకోవాలి. పత్రిక ద్వారా మరీ గౌరవించు కోవాలనేది వారి మంచి పూనిక.

రచనలు వెలువరించి, కనీసం ఆ రచనపడిన ప్రతులను రచయితలకు పంపడం కూడా చేయని పత్రికలు తెలుగునాట కొన్ని ఉన్నాయి.

తెలుగు వెలుగులో రచనలు ముద్రించాక రచనలు పడిన పత్రికలను విఫణివీధిలోకి అవి రాకముందే రచయితలకు చేర్చడం తెలుగువెలుగు చేబట్టింది. రచయితలకు నగదు పారితోషికాలను వారివారి బ్యాంకు అక్కౌంట్లలో జమచేయించడం తెలుగువెలుగు క్రమం తప్పకుండా చేసేది.

లెక్కకు మిక్కిలి రచనలు వస్తున్నా-అవసరమైనప్పుడు వాని ఆనుపానులు, మంచి చెడ్డలు మార్పుచేర్పుల గురించి సంపాదక వర్గ సభ్యులు-ఆయా రచయితలతో సంప్రదించే ఆరోగ్యకర ధోరణి తెలుగు వెలుగు చేబట్టింది. అల్పసంతోషులు సహృదయులు అయిన రచయితలపట్ల ఇది ఆహ్వానించదగిన అంశం. పారితోషికాలను పంపిస్తూ, రచనలు పంపినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ సౌజన్యపూరిత సంబంధాలను నెలకొల్పే అధికార లేఖలను పంపి తెలుగువెలుగు మేలుతోవలో సాగింది. తానాలో తెలుగు సభలు పెద్దఎత్తున జరిగినప్పుడు వేలకొలది సంచికలు తీసుకువెళ్ళి ఉచితంగా ప్రతినిధులకు పంపిణీ చేసిన ఉదార దృష్టి తెలుగు వెలుగు పత్రికది. తెలంగాణా ప్రత్యేక రాష్ట్రం వచ్చాక వైభవోపేతంగా దొరతనం నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా నాలుగు కాలాలపాటు దాచుకోదగిన ప్రత్యేక సంచికను వెలువరించి తెలుగుజాతీయ భావైక్యతకు దోహదం చేసింది.

ప్రేమ అంటే కేవలం ప్రేయసీ ప్రియుల మధ్య సంబంధ వ్యక్తీకరణలు మాత్రమే కావు; తల్లిబిడ్డ, అక్కాచెల్లీ, తండ్రికొడుకూ,




తెలుగువెలుగు తుది సంచిక
మార్చి 2021

వంటి ఇతర సంబంధాలూ ప్రేమకు సంబంధించినవే. ఆ సంబంధాలకూ చెందిన ప్రేమలేఖలూ ఉంటాయి. అవి తెలుగు వెలుగు 'ప్రేమలేఖ'. శీర్షిక విలక్షణంగా నడిపింది. ప్రేమలేఖల పోటీ పెట్టి, ప్రతినెలా బహుమతి వేయినూటపదహార్లు ఇచ్చే పద్ధతి పెట్టారు. మంచి స్పందన వచ్చింది.

తెలుగు వెలుగులోని సంపాదకీయాలు ప్రత్యేక గ్రంథంగా తీసుకురావలసినవి ఉన్నాయి. తెలుగు భాషా పరిరక్షణకు పాఠ్యగ్రంథాలలో తెలుగు స్థితిగతులూ ఇటువంటి అనేక భాషా సాహిత్య విషయాలపై దొరతనాలకు నిర్మాణాత్మక సూచనలు చేస్తూ అవసర సందర్భాలలో తగు మాత్రం విమర్శలు చేస్తూ సాగిన సంపాదకీయాలు అవిస్మరణీయమైనవి. స్వతంత్ర ఆలోచనలతో భాషోద్యమకారుల ఆలోచనలతో కాంతిమంతాలైనవి. 'తులాభారం', 'కొండఅద్దంముందు' శీర్షికల్లో గ్రంథ దీర్ఘ సమీక్షలూ, లఘుసమీక్షలు చేయించడం, వేయడమే కాక రచయితా లేక ప్రకాశకునికి సమీక్ష పడే సంచిక పంపే మరో మంచి సంప్రదాయాన్ని ప్రవేశపెట్టారు.

ప్రకటిత రచనా ప్రక్రియల్లో ఒక నాటక ప్రక్రియ తప్ప తక్కిన అన్నిటికీ స్థానకల్పన చేశారు. చలనచిత్ర కవుల, కళాకారుల, పాటల రచయితల రచనలు వేశారు. చివరకు పేరడీ రచనలనీ స్వాగతించారు. సమస్యాపూరణలు ఆసక్తి కరంగా నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో జరిగిన వర్కుషాపులకు రచయిత సభలకు, జానపద వస్తు, గిరిజన వస్తు ప్రదర్శనలకు తన ప్రతినిధుల్ని పంపించి సారాంశ ప్రధానాంశాలను సచిత్రంగా ఇచ్చారు.

శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి ఇతర దేశాల్లో గల భాషాసాహిత్య కార్యక్రమాలను తెలుగు ప్రాంత పాఠకులకు తెలిపారు. చాలామంది తక్కిన రచయితల రచనలు వెలువరించడానికి వీలుగా – ఒక రచయిత రచన ప్రచురించాక మొదటి 4 నెలల తర్వాత, తర్వాత 6 నెలల తరువాత మాత్రమే ఆయా రచయితల రచనలు వేసేవారు. భాషాదిజ్ఞానాంశాలు గ్రహించడానికి వీలుగా మాటకట్టు వేరువేరు రచయితలచే నిర్వహింపజేసేవారు.

2012 తిరుపతిలో ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. ఆ సందర్భంగా అమ్మనుడి సంపాదకులు భాషోద్యమ అంకిత మూర్తులు డా॥ సామల రమేష్‌బాబు శ్రీ రామోజీరావును కలిసారు. అప్పుడు వారు శ్రీ సామల వారికి భాషోద్యమ పరంగా అనేక నిర్మణాత్మక సూచనలు చేశారు. శ్రీ రమేష్‌బాబు వంటివారి ముఖాముఖి కార్యక్రమలు 'తెలుగువెలుగు'లో ఇచ్చేవారు. సమాజానికి అవసరమైన శ్రీ రామోజీరావుగారి అభిప్రాయ ఆలోచలనల్ని– అమ్మనుడిలో ఇచ్చేవారు.

ముచ్చటైన అచ్చు, మృదువైన పటిష్టమైన కాగితం, సంపాదకుల సరైన రచనల ఎంపికలు ఉండి – తెలుగువారి భాషోద్యమానికి వెలుగు బావుటా అయిన పత్రిక – ఆగిపోయిందా? సాహిత్య ప్రామాణిక పత్రిక – ఒక నిశ్శబ్ద చైతన్య శంఖం కాలాన్ని బద్దలు కొట్టుకొని మళ్ళీ పూరింపబడుతుందా? తెలుగు వెలుగు మళ్ళీ అక్షరాలా దృశ్యమానమవుతుందా? **వర్తమాన కాలాన్ని ప్రశ్నిస్తే – ఆగిన తెలుగు" అని వినిపిస్తోంది. చిరస్మరణీయమైన ఆ పత్రిక ప్రామాణిక సేవలు ఎలా మరువగలం?**



"భాషా పెత్తనం స్వరాజ్యం కాబోదు
మొదటి ప్రాధాన్యత ఎల్లవేళలా మాతృభాషదే
ఆ తర్వాతనే హిందీ భాష
నిఖార్సయిన ఉన్నతి మాతృభాషతోనే సాధ్యం"
"మాతృభాషను పణంగా పెట్టి ఆంగ్లభాషను నేర్చుకోవలసివస్తే
అసలు ఆంగ్లభాషను నేర్చుకోవలసిన అవసరం ఏ దేశానికీ లేదు"
– మహాత్మాగాంధీ

స.వెం.రమేశ్

# కొత్తమాటల పుట్టింపు

7

“అన్నయ్యా, పిండిని రుబ్బే గ్రైండర్‌ను రుబ్బురోలు అని పిలుచుకోవచ్చుగా. మనకు ఉన్న తెలుగుమాటలకు మారుగా కొత్త మాటలను పుట్టించడం ఎందుకు?” అన్నాడు చిన్నయ్య.

“రుబ్బురోలును చేత్తో తిప్పుతాం. గ్రైండరును మించు(విద్యుత్)తో తిప్పుతాం. అవి చేసే పనులు ఒకటే కావచ్చు కానీ, వాటి అడపొడ (ఆకారం)వేరువేరు. కాబట్టి గ్రైండర్‌కు కొత్తమాటను పుట్టించితేనే బాగుంటుంది. కదూ అన్నయ్యా” చెప్పినాడు నారాయణ.

“అలాగయితే మన పాత తెలుగుపేర్లన్నీ పోయినట్లేగా. ఆ పేర్లతోపాటు ఆపేర్లకు చెందిన పనిపలుకులూ పోయినట్లేగా. రుబ్బురోలు అనే మాటను వాడడం చిన్నతనం అయిపోయి, గ్రైండర్ అనే మాటను వాడుతున్నాం. రుబ్బురోలుతోపాటు రుబ్బడం అనే పనిపలుకూ పోయింది. గ్రైండ్ చేయడం అనేది వాడుకయింది. మిక్స్ చేయడం, వాష్ చేయడం, కుక్ చేయడం, కట్ చేయడం....వంటివి కోకొల్లలుగా వచ్చేసినాయి. పనిపలుకులు పోవడం నుడికి పెనుముప్పని నువ్వే అంటుంటావుగా అన్నయ్యా” అంటూ అంగలార్చినాడు చిన్నయ్య. ఇక నేను కలిపించుకోక తప్పలేదు.

“చిన్నయ్యా, నీ అలమట నాకు ఎరుకపడింది. నువ్వు కాస్త గందరగోళంలో ఉన్నావు. రుబ్బురోలు, గ్రైండర్ మట్టుకే కాదు. ఎన్నో ఉరువు(వస్తువు)లు వాటి అడపొడను మార్చుకొని కొంగొత్త జాడలతో మనముందుకు వచ్చినాయి, వస్తున్నాయి కూడా. నారాయణ చెప్పినట్లు కొత్త అడపొడకు పాతపేరును మనవాళ్లు ఒప్పుకోరు. అలా పుట్టించినపుడే, వాటికి చెందిన పనిపలుకులు కూడా మనగలుగుతాయి. కొత్తమాటలు రాకపోతే పాతమాటలను వాడడానికి ఇచ్చగించక పెరనుడి మాటలనే తీసుకొని వాడేస్తారు. కాబట్టే కొంగొత్త ఉరువులకు కొత్తమాటలు కానే కావాలి” అన్నాను.

“ఎన్ని కొత్త ఉరువులు వచ్చినా కొత్తమాటల్ని పుట్టించగలమా?” అడిగినాడు చిన్నయ్య.

“అలా పుట్టించగలిగేదే కదా చేవయిన నుడి. ఇన్నాళ్లూ అన్నయ్య దగ్గరుండి నువ్వు నేర్చుకొన్నది ఇంతేనా. అన్నయ్య తలచుకొంటే వేలమాటలను పుట్టించగలడు” అన్నాడు నారాయణ.

చాలు నారాయణా, నీ పొగడ్తలను ఆపు. నన్ను పొగడడం అంటే, నాకాళ్లకింద గోతిని తీయడమే. వేలమాటలను నేనే కాదు, నువ్వయినా చిన్నయ్యయినా ఇంకెవరయినా కూడా పుట్టించవచ్చు. అది మన తెలుగుకున్న చేవ. మీకొక మందలను చెపుతాను వినండి. తెలంగాణలోని బోదన్‌లో పూదోట శౌరీలు అనే పంతులమ్మ ఉన్నారు. ఆడపిల్లల బడి అది. కొత్తమాటల పుట్టింపు ఎలా అనేది నేను చెపుతుంటే విని, ఎనిమిదవ తరగతి పిల్లలతో ముచ్చటించింది. తొలినాడు ఒక చేర్పును గురించి చెప్పి, ఒకటి రెండు మాటలను పుట్టించి చూపించింది. ‘మీరు కూడా ఈ చేర్పుతో కొత్తమాటలను పుట్టించండి చూద్దాం’ అని పిల్లలతో అనింది. అంతే ఆ అరగంట తరగతంతా నవ్వులతో తెలుగుమాటలతో నిండిపోయింది. పన్నెండు పదమూడేళ్ల ఈడున్న ఆ పిల్లలు అరగంటలో ఏబైకి పైగా మాటలను పుట్టించినారు. రెండవనాడు ఇంకొక చేర్పును చెప్పమని శౌరీలమ్మని బతిమాలుకొన్నారు. ఆ రెండో చేర్పుతో కూడా పదులమాటలను పుట్టించినారు. ఆ పంతులమ్మ ఎలమికి ఎల్లలు లేకుండా పోయాయి. పసిపిల్లలు కూడా మాటలు పుట్టించగలిగినంత తేలికయిన నుడి తెలుగు. త్వచకుడ్యము, తరంగదైర్ఘ్యము, స్వపరాగ సంపర్కము, పరపరాగ సంపర్కము, అనులోమానుపాతము, క్వార్ధము, విశేషణోత్తరపద కర్మదారయ సమాసము, జస్త్వసంధి, శ్చుత్వ సంధి, క్షితిజరేక, పత్రహరితము, ద్విచక్రవాహనము, ప్రయాణప్రాంగణము, ప్రాఙ్నన్నయ యుగము, ఊర్ధ్వకోణము, స్నిగ్ధతాగుణకము, ఆదునికానంతర కవిత్వము, విస్తృత ఆవర్తన పట్టిక, కాంతి పరావర్తనము, విహంగవీక్షణము... వంటి నూర్లవేల పెరమాటలను దింపుకొని, వాటినే తెలుగనుకొని, వాపునే బలుపనుకొని మురిసిపోతున్నాం. ఈ పోకడను వదిలించుకొంటే కానీ మన నుడి ఎదగదు” అన్నాను.

చిన్నయ్యా నారాయణా కాసేపు ఏమీ మాట్లాడలేదు. పిమ్మట చిన్నయ్య పెదవివిప్పి, “నువ్వు కలతపడవద్దు అన్నయ్యా, ఇప్పటికి మనం ఉన్నాముగా, ముందుముందు ఇంకా కొందరు ఈ పనికి పూనుకొంటారులే” అన్నాడు.

“అది సరే అన్నయ్యా, బోదన్ బడిలో శౌరీలమ్మ పిల్లలకు చెప్పిన చేర్పులు ఏమిటో చెప్పవా” అడిగినాడు నారాయణ.

“చెపుతాను నారాయణా, వాటిలో మొదటిది ‘ఎన’. కొత్త ఉరువులకు కొత్తపేర్లను పుట్టించడానికి ఈ ‘ఎన’ అనే చేర్పు బాగా ఒదుగుతుంది. ఇది కూడా మన తెలుగు నుడిగంటులలో కనిపించదు. అరవ నుడిగంటులలో ‘ఇనం’ అనేమాట కనబడుతుంది. దీని తెల్లం ‘జాతి’ లేదా ‘రేస్’. తెన్నాటి తెలుగువాళ్లు దీనిని ‘ఎనం’ అని వాడుతారు. దానికీ మన ‘ఎన’కూ పొత్తు ఉంది. ‘వస్తువు’ అనేది సంసుక్రుతపు మాట. ఉరువు అనేది కూడా సంసుక్రుత రూపం నుండి తెలుగు అయిందే. మరి దీనికి తెలుగుమాట లేదా అంటే, అదే ఈ ‘ఎన’. తెలుగు నుడిగంటులలో లేకపోవచ్చు కానీ తెలుగువాళ్ల నోళ్లలో మట్టుకు బాగా ఉంది ఇది. దువ్వడానికి వాడే ఎన, దువ్వు+ఎన=దువ్వెన; ఈర్చడానికి వాడే ఎన, ఈర్చు+ఎన=ఈర్పెన; రెండు వంతులను కలిపే ఎన, వంతు+ఎన=

వంతెన; బండి ఇరుసూ గానులూ మెత్తగిల్లడానికి అంటే కందడానికి వాడే ఎన, కందు+ఎన=కందెన; ఇవి కొన్ని మచ్చులు. వెతుక్కొంటే మరిన్ని మాటలు దొరుకుతాయి. ఎనతో ఎన్నలేనన్ని మాటలను పుట్టించవచ్చు. మచ్చుకు కొన్నిటిని పుట్టిద్దాం'' అంటూ మొదలుపెట్టినాను.

| | | | |
|---|---|---|---|
| 1. అరుచు+ఎన | అరపెన | లౌడ్‌స్పీకర్ | .... |
| 2. ఆర్చు+ఎన | ఆర్పెన | డ్రైయర్ | .... |
| 3. ఈద+అదుపు+ఎన | ఈదదుపెన | ఏ.సి. | ఈద=గాలి. |
| 4. ఉజ్జు+ఎన | ఉజ్జెన | మాబ్ | ఉజ్జు=తుడుచు. |
| 5. ఉతుకు+ఎన | ఉతుకెన | వాషింగ్‌మెషిన్ | ..... |
| 6. ఉలివు+ఎన | ఉలివెన | సౌండ్‌బాక్స్ | ఉలివు=సౌండ్. |
| 7. ఎంచు+ఎన | ఎంపెన | కాలిక్యులేటర్ | .... |
| 8. ఎత్తు+ఎన | ఎత్తెన | లిఫ్ట్ | .... |
| 9. ఎనిక+ఎన | ఎనికెన | కంప్యూటర్ | |
| | | ఎనిక=లెక్క. సంగణక యంత్రం అంటున్నారు. | |
| 10. ఒత్తు+ఎన | ఒత్తెన | ఐరన్‌బాక్స్ | ..... |
| 11. ఒరయు+ఎన | ఒరయెన | టెస్టర్ | ఒరయు=టెస్ట్‌చేయు |
| 12. కడుగు+ఎన | కడుగెన | వాషర్ | .... |
| 13. కలుపు+ఎన | కలుపెన | మిక్సర్ | .... |
| 14. కాచు+ఎన | కాపెన | గీజర్ | .... |
| 15. కుందు+ఎన | కుందెన | కుర్చీ/చెయిర్ | |
| | | కుందు=కూర్చొను | |
| | | వీల్ చెయిర్=గానుకుందెన | |
| | | ఈజీ చెయిర్=వాలుకుందెన | |
| | | చెయిర్ పర్సన్=కుందెనరి. | |
| 16. కుమ్ము+ఎన | కుమ్మెన | ఒవెన్ | |
| | | కుమ్ము=వేడి నిప్పులు; | |
| | | కుంపటి=వేడినిచ్చేది; | |
| | | కుమ్మెన=వేడిచేయడానికి వాడేది | |
| 17. కోయు+ఎన | కోతెన | హార్వెస్టర్ | .... |
| 18. గొరుగు+ఎన | గొరుగెన | రేజర్ | .... |
| 19. చలవ+ఎన | చలవెన | కూలర్ | .... |
| 20. చివ్వు+ఎన | చివ్వెన | పీలర్ | .... |
| 21. తుడుపు+ఎన | తుడుపెన | ఎరేజర్ | .... |
| 22. తురుము+ఎన | తురుమెన | గ్రేటర్ | .... |
| 23. తెంచు+ఎన | తెంపెన | కట్టర్ | .... |
| 24. (తొల)చూపు+ఎన | (తొల)చూపెన | టెలివిజన్ | |

తొల=దూరం; తొలగు=దూరమగు; తొలగా ఉన్నవాటిని చూపునది తొలచూపెన. చిన్నదిగా చూపెన అని పిలుచుకోవచ్చు. దూరదర్శన్ అంటున్నారు.

| | | | |
|---|---|---|---|
| 25. దంచు+ఎన | దంపెన | మిక్సీ | .... |
| 26. దుమ్ము+ఎన | దుమ్మెన | డస్టర్ | |
| | | దుమ్మును దులిపేది | |
| 27. దొరల్చు+ఎన | దొరల్పెన | కన్వర్టర్ | .... |
| 28. నింపు+ఎన | నింపెన | ఫిల్లర్ | .... |
| 29. పలుకు+ఎన | పలుకెన | ఫోన్ | |

టెలిఫోన్‌కు దూరవాణి అని వాడుతున్నారు. ల్యాండ్‌ఫోన్‌కు స్థిరవాణి అని, మొబైల్‌ఫోన్‌కు చరవాణి అనీ వాడుతున్నారు. ఫోన్‌కు, ఎనను చేర్చకుండా 'పలుకి' అనడం తెన్నాటి తెలుగువాళ్ల వాడకం. నేలపలుకి, అలపలుకి అనేవి కూడా. 'ఫోన్ చేసినారా' అనడాన్ని 'పిలిస్తిరా' అనడం, మిస్డ్‌కాల్‌ను 'దూసుపిలుపు' అనడం, తెన్నాటి తెలుగు వాడకం.

| | | | |
|---|---|---|---|
| 30. పొదువు+ఎన | పొదువెన | రికార్డర్ | |
| | | పొదువుకొనేది. | |
| 31. పొల్లు+ఎన | పొల్లెన | సూయింగ్‌మెషీన్ | |
| | | పొల్లు = కుట్టు. కుట్టెన అనికూడా వాడవచ్చు. | |
| 32. పోజు+ఎన | పోజెన | ప్యూరిఫైయర్ | |
| | | పోజు= శుభ్ర పరచు. | |
| 33. మరతిప్పు+ఎన | మరతిప్పెన | స్క్రూడ్రైవర్ | .... |
| 34. మార్చు+ఎన | మార్పెన | ట్రాన్స్‌ఫార్మర్ | |
| | | నియంత్రిక అని వాడుతున్నారు. | |
| 35. రుద్దు+ఎన | రుద్దెన | స్క్రబ్బర్ | ..... |
| 36. రుబ్బు+ఎన | రుబ్బెన | గ్రైండర్ | .... |
| 37. వండు+ఎన | వండెన | కుక్కర్ | .... |
| 38. వడ+ఎన | వడెన | ఫ్రిజ్ | |
| | | వడ=గట్టకట్టిన మంచు | |
| 39. విత్తు+ఎన | విత్తెన | సీడర్ | ..... |
| 40. వీయు+ఎన | వీవెన | ఫ్యాన్ | ..... |
| 41. వెచ్చ+ఎన | వెచ్చెన | హీటర్ | ..... |
| 42. వెలచు+ఎన | వెలపెన | ఫిల్టర్ | |
| | | వెలచు=వడకట్టు | |

"ఇట్లా ఎన్నో మాటలను పుట్టించవచ్చు. చిక్కుతీసే ఎన ఉంటే చిక్కెన. కలుపుదోకే ఎన దోకెన. చెక్కేది చెక్కెన. తిరిగేది తిరుగెన. చుట్టేది చుట్టెన. పిండేది పిండెన. నొక్కేది నొక్కెన. ఒలిచేది ఒలుపెన. కొలిచేది కొలుపెన. వేల ఉరువులు కొంగొత్తవి వచ్చినా ఈ ఎనతో వాటికి తెలుగుపేర్లను పెట్టవచ్చు. తెలుగు చేవగల నుడి. దానిని వాడుకొనే చేవ తెలిసుండాలి అంతే" అంటూ ముగించినాను.

## 8

"అన్నయ్యా, బోదన్ శౌరీలమ్మ, పిల్లలకు నేర్పిన రెండో చేర్పును గురించి చెప్పవా" అడిగినాడు చిన్నయ్య.

"నాకొక అరగలి(సందేహం) అన్నయ్యా,బోదన్ అనే పేరు

వినడానికి వింతగా ఉంటుంది కదా. బహుదాన్యపురం, పౌదన్యపురం అని చెక్కింపు(శాసనా)లలో ఉందట. ఈ సంసు(క్రతపు పేర్లు కాకుండా, దానికి తెలుగుకుదురు ఏదయినా ఉంటుందంటావా?" నడుమన దూరుతూ అడిగినాడు నారాయణ.

"తెలుసుకోవలసిన అడకనే అడిగినావు కానీ, దీనిని విడమరచి చెప్పాలంటే చాలాసేపు పడుతుంది. అయినా కుదింపుగా చెపుతాను విను. బారతనాడులో తొలిమినుకు(రుగ్వేదం) వెలువడిన నాటికే పలునుడులు ఉనికిలో ఉన్నాయి. తెనుగు(మూలద్రావిడం) వాటిలో ఒకటి. తొలిమినుకు మీద తెనుగు వెలుగులు పడిన ఆనవాళ్లు ఉన్నాయి. తెనుగు ఆనాటికే నాగరికనుడి. హరప్పావంటి పేటలను కట్టుకొన్న నుడి. ఎంతో ఎడంగా ఉన్న గ్రీకు, సుమేరియన్లతో కవరం (వ్యాపారం) సాగించిన నుడి. కవరం కోసం కడళ్లనే దాటిన నుడి. అంతగా ఎదిగి ఉన్నది కాబట్టే తొలిమినుకు మీదనే దీని వెలుగు పడింది. తొలిమినుకులో ఉన్న నుడి పేరు వైదికం లేదా చాందసం. చాలామంది పొరపాటుగా దానిని సంసుక్రుతం అనేస్తుంటారు. చాందసం,తెనుగు వంటి ఒకటిరెండు నుడుల కలయికతో తావుతావుకూ కొంగొత్త గొంతులు వెలువడినాయి. వీటిని ప్రాక్రుతాలు అన్నారు. ప్రాక్రుతాలన్నిటికీ పెనునుడి ఒకటి కావలసి వచ్చింది. అందుకనే అప్పటి తెలివరులు, చాందసనుడిని ఆనుగా చేసికొని, తెనుగునుండి ఎన్నో మాటలను కలుపుకొని సంసుక్రుతాన్ని కట్టినారు. సంస్కరించి కట్టిననుడి కాబట్టే దానికి సంసుక్రుతం అనే పేరు వచ్చింది. కడలినీ కప్పళ్లనీ ఎరుగని చాందసనుడికీ, తెనుగునుండి ఎన్నో మాటలను కలుపుకొన్న సంసుక్రుతానికీ ఎంతో వేరిమి ఉంది. తెనుగునుండి తెలుగు విడివడినాకనే సంసుక్రుతపు కట్టుబాటు జరిగింది. అందుకే తెలుగు ఆనవాళ్లు సంసుక్రుతంలో చాలా కనిపిస్తాయి. తరిపోకడలో తెలుగుమీద చీకటికమ్ముకొని, అన్ని మాటలూ సంసుక్రుతం నుండే పుట్టినాయి అనే అనిపింపు గట్టిపడిపోయింది. అటువంటి మాటలలో పోత,ఓడ, దోనె వంటివి ఉన్నాయి. ఇవన్నీ తెలుగునుండి వెళ్లినవి. కానీ మన నుడిగంటులలో మట్టుకు దిగుమతి అయినవిగా కనబడుతాయి. 'పోత' పుట్టుక గురించి అమరకోశంలో ఏ విడమరపూ లేదు. పోత తెలుగుమాట. దీనికి ముందు రూపు 'పొంత'. 'పొన్' అనే తెలుగుకుదురుకు కలయిక అని తెల్లం. పొందు,పొత్తు,పొంతకుండ,పొంగలి వంటి మాటలలో ఇది కనబడుతుంది. కొయ్యాకొయ్యా కలిసి ఏర్పడేది పొంత. దాని మరుపాడే పోత. పోతల మీద ఏరులను గడచి కడలిని చేరి ఓడలమీద దవ్వులకు చేరేవారు. ఓడలలో కప్పళ్లలో తెచ్చిన సరకును, పోతలమీదా పడవలమీదా లోతట్టుకు సాగించి కవరం చేసేవారు తెలుగువాళ్లు. అట్ల కవరం జరిగిన చోట్ల పేటలు ఏర్పడినాయి. వాటిపేర్లు కొన్ని 'పోత' తో మొదలయినాయి. పోతులూరు, పొందూరు, పోతనూరు, పొద్దటూరు, వంటివి అవి. బోదన కూడా అటువంటిదే. బట్టిప్రోలు చెక్కింపులో కూడా 'పోత' అనేపేరు తగులుతుంది. బోర్లించిన పోత అడపొడలో కొన్ని గుడుల పైకప్పులను కట్టుకొన్నాడు తెలుగువారు. ఇది తెలియక ఇప్పటి తెలివరులు వీటిని 'గజపృష్టం' అంటున్నారు. ఎంతో పాతదైన 'కపోత ఈశ్వర' గుడిపేరులో కూడా పోత ఉంది. ఇటువంటి తెలుగు మాటలు నూర్లు వేలు మరుగున పడిపోయినాయి. ఈనాటికి, తెలుగువాళ్లకు ఏమీ చేతకాదు అని ఇరుగుపొరుగు వారు చాటుతుంటే, అవును అది నిక్కమే అని మనం తలలూపుతున్నాం" అంటూ నారాయణ అడకకు మారాడినాను.

"అన్నయ్యా, ఆ రెండో చేర్పును చెప్పన్నయ్యా" బతిమిలాడినాడు చిన్నయ్య.

"చెపుతున్నా, ఆ చేర్పు 'ఏగి'. తెన్నాడులోని చోళనాడు తావున తెలుగువారు ఇప్పటికీ వాడుతున్న మాట ఇది. చోళనాడు తెలుగులో వాహనాన్ని 'ఏగి' అంటారు. 'ఏగు' అనే పనిపలుకు అన్నిచోట్లా వాడుకలో ఉన్నదే కదా. 'ఏగు' అంటే వెడలు, కదలు అని తెల్లం. ఏగేది ఏగి అయి ఉంటుంది. ఈ మాటను చేర్పుగా చేసికొని మనం కొత్త మాటలను పుట్టించవచ్చు. చూద్దాం రండి"

| | | | |
|---|---|---|---|
| 1. అద్దె+ఏగి | అద్దేగి | టాక్సీ | ............. |
| 2. కోయు+ఏగి | కోతేగి | హార్వెస్టర్ | ............. |
| 3. చదును+ఏగి | చదునేగి | రోడ్‌రోలర్ | ............. |
| 4. జల్ల+ఏగి | జల్లేగి | ట్రక్‌వెహికల్ | ............. |
| 5. తవ్వు+ఏగి | తవ్వేగి | ప్రొక్లెయినర్ | ............. |
| 6. తాను+ఏగి | తానేగి | ఆటోరిక్షా | |
| | | తానుగా ఏగేది. ఆటో=తనకుతాను | |
| 7. తూను+ఏగి | తూనేగి | హెలీకాప్టర్ | |
| | తూను=సాగు, ఎగురు; తూనీగ= ఎగిరేఈగ | | |
| 8. తేరు+ఏగి | తేరేగి | కార్ | |
| | కార్ అనేమాట చారియట్ నుండి పుట్టింది. చారియట్ అంటే తేరు. తేరు వంటి ఏగి తేరేగి. | | |
| 9. తొట్టి+ఏగి | తొట్టేగి | టాంకర్ | ............. |
| 10.తోయు+ఏగి | తోయేగి | డోజర్ | ............. |
| 11.దుక్కి+ఏగి | దుక్కేగి | ట్రాక్టర్ | |
| | | ట్రాక్=చాలు; దుక్కి=నాగటిచాలు | |
| 12.నీరు+అడుగు+ఏగి | నీరడుగేగి | సబ్‌మెరైన్ | |
| | | జలాంతర్గామి అంటున్నారు | |
| 13.నొగులు+ఏగి | నొగులేగి | ఆంబులెన్స్ | |
| | | నొగులు=డిసీజ్ | |
| 14.పట్టె+ఏగి | పట్టేగి | ట్రైన్ | |
| | | పట్టెలమీద వెళ్లేది | |
| 15.పాడె+ఏగి | పాడేగి | ....... | |
| | | శవయాత్ర వాహనం అంటున్నారు | |
| 16.పేరు+ఏగి | పేరేగి | బస్ | బస్ అనే |

మాట ఆమ్నీబస్ నుండి పుట్టింది. మందిని తీసుకొని వెళ్లేది అని తెల్లం. పేరు అంటే మందికి మరోమాట. ఎఱ్ఱాప్రెగడ ఈ మాటను వాడినారు. పేరును తీసుకొని వెళ్లేది.

| | | | |
|---|---|---|---|
| 17. పోరు+ఏగి | పోరేగి | వార్‌టాంకర్ | ............ |
| 18. మంట+ఏగి | మంటేగి | ఫైరింజన్ | |
| | | అగ్నిమాపక వాహనం అంటున్నారు. | |
| 19. మిన్ను+ఏగి | మిన్నేగి | రాకెట్ | |
| | | మిన్నుకు ఏగేది | |
| 20. సరకు+ఏగి | సరకేగి | లారీ | ............ |

"తమ్ముళ్లూ, పైన ఎన, ఏగి చేర్పులతో ఇచ్చిన మాటలలో కొన్ని నేను పుట్టించినవి కావు. బోదన్ బడిపిల్లలు పుట్టించినవి. ఆ పిల్లల పేర్లు నాకు తెలియదు. పిల్లలకూ వాళ్ల పంతులమ్మ అయిన శౌరీలమ్మకూ మనమందరమూ మప్పిదాలను చెప్పాలి" అన్నాను.

"మంచిమాట చెప్పినావు అన్నయ్యా. మరి శౌరీలమ్మ అప్పుడే ఈ మాటలను బయటపెట్టి ఉండవచ్చు కదా" అన్నాడు నారాయణ.

"శౌరీలమ్మ వాటిని బయటపెట్టాలనే అనుకొనింది. అప్పుడు కొన్ని నెలలపాటు నడుస్తున్నచరిత్ర రాలేదు. అమ్మనుడి ఇంకా అప్పటకి మొదలుకాలేదు. అందుకని తెలుగుకోసం నడుముకట్టుకొన్న తెలుగువెలుగు అనే నెలాకిక(మాసపత్రిక)కు పంపింది. అందులో అచ్చయినాయి". చెప్పినాను.

"నిక్కంగానే తెలుగు కోసం నడుము కట్టుకొన్న ఆకిక కదా అది" అన్నాడు చిన్నయ్య.

"కావచ్చు, ఆ నెలాకిక వాళ్లదే ఒక నాడాకిక(దినపత్రిక) కూడా ఉంది. అందులో ఒకసారి ఎలెక్ట్రసిటీ ట్రాన్స్‌ఫార్మర్‌కు నియంత్రిక అనే పేరును పుట్టించి వాడినారు. దానిని చదివి పారుపల్లి కోదండరామయ్య అనే ఆయన నాకు పలుకిచ్చి(ఫోనుచేసి)నారు. ఆయన మించిదుపు(ఎలెక్ట్రసిటీ డిపార్ట్‌మెంట్)లో వంచ మరమరి(చీఫ్ ఇంజినీర్)గా పనిచేసినవారు. ట్రాన్స్‌ఫార్మర్ అంటే నియంత్రించేది కాదనీ, మార్చేదనీ, దీనికొక తెలుగుపేరును చెప్పమనీ, ఆ ఆకికవాళ్లకు తెలియచేస్తాననీ అన్నారు. ఈర్చేది ఈర్పెన అయినపుడు, మార్చేది మార్పెన అవుతుంది. కాదూ కూడదూ అది నియంత్రిస్తుంది అని వాళ్లు అంటే నియంత్రికకు తెలుగుమాట అదుపెన అవుతుంది అని చెప్పినాను. పారుపల్లిగారు ఆ ఆకికకు ఇదంతా విడమరచి చెపుతూ ఒక కమ్మను రాసినారట. కమ్మ ఏమయిందో, నియంత్రిక అలాగే ఉంది. నన్నయ నుండి చిన్నయ వరకూ సాగిన సంస్కృత మాటలు చొప్పింత, కొన్నేళ్లపాటు ఆగింది. దానిని తెలుగు పేరోలగం(అకాదెమీ) వారు మరికొన్నేళ్లు సాగించి చాలించుకొన్నారు. ఇప్పుడు ఆ పనిని ఒక నాడాకిక తలకెత్తుకొని మోస్తున్నది. ఎన్నాళ్లు మోస్తుందో చూద్దాం" అంటూ ముగించినాను.

(తరువాయి వచ్చే సంచికలో...)



జాన్‌హోల్ట్

# పిల్లలు భాష ఎలా నేర్చుకొంటారు?

**నే**నూ నా మిత్రులూ ఒకసారి ఒక స్నేహితుడింటికి వెళ్ళాము. వాళ్ళింట్లో ఓ ఆరునెల్ల పాప ఉంది. ముచ్చటగా ఉండే ఆ పాపని మేమంతా ఎత్తుకొని ముద్దాడాం. ఇక మేము మాటల్లో పడిపోయాం. ఆ పాపకు మా మాటల్లో ఏం కన్పించిందో ఏమో మేం ఎవరం మాట్లాడితే వాళ్ళవైపుకు తిరిగేది. పరిశీలనగా చూచేది. తర్వాత కొంచెంసేపు తన బొమ్మని ఒళ్ళో పెట్టుకొని ఆడించేది. మళ్ళీ మా మాటల్ని వింటూ మావైపు చూచేది. మా మాటలు ఆ పాపకి అర్థంగావని మాకు బాగా తెలుసు. మరి ఆ పాప ఏం గమనిస్తున్నట్టు? మా నుంచి ఏం నేర్చుకొంటున్నట్టు? బహుశః మా ముఖ కవళికలు, ఒకరి మాటలకు మరొకరం ప్రతిస్పందించే తీరు, నవ్వడం, హావభావాలూ ఆ పిల్లకి ముచ్చటేసి వుండొచ్చు. మాటాడ్డం అంటే శబ్దాలు పలకడమేనా? భావాల్ని అందించడం, అందుకోవటం గదా! మాటలర్థం కాకున్నా ఆ పాపకు మా మాటల్లోని ఈ భావ వినిమయ క్రమంలో ఏదో తనక్కావల్సింది ఉన్నట్టుంది!

ఇలా పెద్దలు మాట్లాడుకొనేపుడు పిల్లలు ఎంత సేపైనా ఓపిగ్గా వింటుంటారు. మనం పిల్లలకి మాట్లాడ్డం నేర్పించాలనుకొంటే మనమూ వాళ్ళతో ముచ్చట్లాడాలి. ఈ మాటాడ్డం సహజంగా, ఆ పిల్లల ముచ్చటకు భంగం కలిగించకుండా ఉండాలి. మనం పెద్దలం మాట్లాడు కొనేపుడు పిల్లలు వింటూ ఉంటే విననివ్వాలి.

నాకు తెలిసిన మరో పాప ఉండేది. వాళ్ళమ్మ ఓ పండ్ల దుకాణం నడుపుతుండేది. తన ఏడాది వయస్సు గల పాపనూ దుకాణంలోకి తీసుకొస్తుండేది. తల్లి తన పనిలో తాను మునిగిపొయ్యేది.

ఆపాప ఏదో ఒకదానితో ఆడుకొంటూ ఏదో ఒకటి గొణుగుతూ ఉండేది. ఒకసారి నేనా పాపను పరిశీలనగా చూస్తుండగా ఉన్నట్టుండి బెంగోగో బెంగోగో! అని రాగాలు తీయసాగింది. కొంచెం సేపు రాగం ఆపెయ్యడం మళ్ళీ అదే రాగం తియ్యడం నేను ఎంతో సేపు ముచ్చటగా చూశాను.

మరో 8 నెలల పాప 'లీడీ లీడీ లీడీ లీడీ' అంటూ అదేపనిగా గొణగడం చూశాను. ఈ శబ్దాలు ఈ పిల్లలు ఎక్కడి నుంచి నేర్చుకొన్నారు? ఎవరిని అనుకరించి పలుకుతున్నారు? ఇవి అనుకరించి నేర్చుకొన్నవి కాదు. నాలుకని అంగిటకి తగిలించడం తియ్యడం లాంటి ఏదో చేష్ట చేస్తున్నప్పుడు ఉన్నట్టుండి అలాంటి ధ్వని వచ్చి వుంటుంది. అదే ఆటగా ఆ పిల్లలు ఆ ధ్వనులు చేస్తుంటారు.

దీన్నిబట్టి మనకేం తెలుస్తుంది? పిల్లలు మొదట అనుకరించి ధ్వనుల్ని నేర్చుకోరు. పసితనంలో వాళ్ళు ధ్వనుల్ని సృష్టించుకొంటారు. తయారుచేసుకొంటారు. కొత్త ధ్వనుల్ని కనుక్కొంటారు. తర్వాత మాత్రమే మన మాటల్ని అనుకరిస్తారు.

ఈ ధ్వనులకి అర్థం ఏమిటి? అర్థం మనకు తెలీక పోవచ్చుగానీ ఏవో అనుభూతులు, కోరికలు, అర్థాలు మాత్రం వాటిలో దాగి ఉన్నాయి. అంటే వాళ్ళు మాట్లాడ్డం కోసం ప్రయత్నిస్తున్నారన్న మాట. మాటాడ్డం నేర్చుకొంటున్నారన్న మాట.

ఒక కృత్యాన్నీ, ఆ కృత్యం చెయ్యడంలోని నైపుణ్యాన్ని మనం విడదీసి చూడలేం. అలాగే పిల్లలు కూడా భాషా నైపుణ్యాల్ని నేర్చుకొని తర్వాత భాష నేర్చుకోరు. మాట్లాడుతూనే వాళ్ళు మాట్లాడ్డం నేర్చుకొంటారు.

మనం మాట్లాడుతున్నప్పుడు ఆ మాటల వల్ల కొన్ని చర్యలు జరుగుతుండటం పిల్లలు గమనిస్తుంటారు. ఈ మాటలకీ చర్యలకీ సంబంధం ఏమిటో వాళ్ళకి తెలీదు. కానీ తామూ ఆ మాటల్లో భాగస్వాములు కావాలని పిల్లలకి కోరిక. తమ మాటల (ధ్వనుల) వల్లా ఇలా చర్యలు జరగాలని వాళ్ళ పట్టుదల. కానీ తమ మాటలకి అలాంటి శక్తి లేదని ఒకటి ఒకటన్నర సంవత్సరాల వయసు పిల్లలకి అర్థమైపోతుంది. తాము ఇస్తున్న సమాచారం అవతలి వ్యక్తికి అందడం లేదని తాము చాలా పనులు చెయ్యలేనట్టే మాట్లాడ్డం కూడా చెయ్య లేకపోతున్నామని రెండేళ్ళ పిల్లలు బాగా గుర్తించేస్తారు. మరోవైపు వాళ్ళ 'అవసరాలు' పెరుగుతుంటాయి. వాటన్నిటినీ వ్యక్తం చేసుకోవాలి. మాటలు తప్పనిసరి అవుతాయి.

ఓ కొత్త శబ్దం పలకాలంటే, గుర్తుంచుకోవాలంటే ఎంత కష్టమో మనం విదేశీ భాష నేర్చుకొనేప్పుడు చూస్తున్నాం. మన పెదాలు, నాలుక, దవడలు, గొంతు ఇలా స్వరయంత్రమంతా ఈ కొత్త భాష కనుగుణంగా చలించేందుకు నానా అవస్థలు పడతాయి.

కానీ ప్రతి బిడ్డా తనకవసరమైన, తన పరిసరాల్లోని భాషను నేర్చుకొంటుంది. కొన్ని సందర్భాల్లో రెండు భాషలు కూడా పిల్లలు నేర్చేసుకొంటున్నారు. ఇన్ని ధ్వనుల్ని, శబ్దాల్ని సమన్వయం చేసుకోవడం పెద్దలకే ఇంత కష్టమే, పిల్లలకెలా సాధ్యమవుతోంది?

**దీనికొకటే సమాధానం. ఓపిగ్గా ఏమాత్రం విసిగి పోకుండా పట్టుదలగా ప్రయత్నించడం వల్లనే ఇది సాధ్యమవుతోంది.** వేల పర్యాయాలు ధ్వనుల్ని, శబ్దాల్ని, పదాల్ని తన చుట్టూ ఉన్నవారి నుంచి విని పోల్చుకొని, తన ధ్వనుల్ని మాటల్ని ఇతరులకు సన్నిహితం చేసుకొంటూ వాళ్ళు భాష నేర్చుకొంటున్నారు. అన్నిటికన్నా ముఖ్యమైంది ఏమంటే ఎంతో బాగా మాట్లాడాలనుకొనే ప్రయత్నంలో ఎన్నో తప్పులు చేస్తూ, చేస్తూ వాళ్ళు నేర్చుకొంటున్నారు.

అలా గాదనుకోండి. మనమే ఈ మాటాడం అంతా నేర్పించేందుకు నడుం బిగించామనుకోండి. ఏం జరిగేది?




ఏం జరిగేదో 'బిలాల్ మాటల్లో విందామా?

వెంటనే మనం ఓ నిపుణుల కమిటీ వేసేవాళ్ళం. భాషా నైపుణ్యాల్ని వాళ్ళు విశ్లేషించేవారు. ఎన్నిరకాల నైపుణ్యాలుంటాయో లెక్క తేల్చేవారు.

పిల్లలు ఏ భాష నేర్చు కోవాలో ఆ భాషా పదాలు నేర్చుకోవాలంటే ముందు ధ్వనులు పలకడం రావాలి కదా! ఆ తర్వాత గదా మాటలు.

ఆ ధ్వనుల్ని మళ్ళీ సులభమైనవి, సర్వసామాన్య మైనవి అని విభజించేవాళ్ళు. అప్పుడు మనం ముందు సులభమైన ఈ ధ్వనులు నేర్పి ఆ తర్వాత కష్టమైనవి, అరుదైనవి నేర్పించే వాళ్ళం.

పిల్లలు గందరగోళ పడిపోయే ప్రమాదం ఉంది కాబట్టి ఇతర ధ్వనులేవీ వాళ్ళకి వినబడకుండా చేసేవాళ్ళం. సాధారణ సంభాషణల్ని వింటే బూతుపదాలు వచ్చే అవకాశం ఉంది కాబట్టి వాటికి వీలున్నంత దూరంగా ఉంచేవాళ్ళం. మనం నేర్పదల్చుకొన్న ధ్వనుల్ని మాత్రం బాగా మార్మారు వినబడేలా ఏర్పాట్లు చేసే వాళ్ళం.

ఆ తర్వాత గుణింతాలు అక్షరాల్ని పలకడం నేర్పేవాళ్ళం. అందుకోసం రకరకాల ధ్వనుల్ని కలిపి లిస్టు తయారు చేసుకొనేవాళ్ళం. వాటితో వచ్చే పదాలతో ఆ తర్వాత లిస్టులు తయారుచేసేవాళ్ళం. మరి పదాలు రాగానే సరిపోయిందా? వాటిని కలిపి వాక్యాలు తయారు చెయ్యాలిగా. అందుకోసం వ్యాకరణం ముందు ఎక్కించే వాళ్ళం. హమ్మయ్య వ్యవహారం ఇప్పటికి ఓ కొలిక్కి వచ్చింది, అనుకొని తర్వాత పనికి ఉపక్రమించేవాళ్ళం.

ఇంక చేయాల్సిందంతా డ్రిల్లింగు, అప్పుడప్పుడూ సమీక్షలు, మరిచిపొయ్యారో ఏమో తెలుసుకొనేందుకు వీలున్నన్ని సార్లు పరీక్షలు.

ఆహా! ఇప్పుడేమవుతుంది? ఏమయ్యేదేముంది తొంభై శాతం పిల్లలు ఈ గొడవ పడలేక, అడుగడుగునా వణికి పోలేక పారిపోతారు. (పారిపోయి ఎంచక్కా వాళ్ళింట్లో, పరిసరాల్లో, ఆటల్లో, పనుల్లో మాట్లాడ్డం వింటారు. హాయిగా ధారాళంగా మాట్లాడ్డం నేర్చేసు కొంటారు) లేకుంటే మూగ మొద్దుల్లా తయారవుతారు. ఇప్పుడు చెప్పండి,

పిల్లలు ఎలా నేర్చుకొంటారు? మనమెలా నేర్పాలనుకొంటున్నాం?

*జాన్ హోల్ట్ అమెరికాకు చెందిన గొప్ప విద్యావేత్త. అధ్యాపకులుగా, ఉపాధ్యాయులుగా పని చేశారు. పిల్లలు ఎలా నేర్చుకొంటారో, నేర్చుకోవడంలో ఎలా విఫలం అవుతారో పిల్లలను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ అనేక రచనలు చేశారు. సరిగ్గా నేర్చుకోడానికి నేటి విద్యావ్యవస్థ పని చేయదని తేల్చి చెప్పాడు. ఒక పత్రిక ప్రారంభించి పాఠశాల లేకుండా నేర్చుకోవాలనే ఉద్యమం నడిపాడు. 1923లో జన్మించిన హోల్ట్ 1985లో మరణించాడు.*

*ఈ వ్యాసం వియన్నార్ బుక్ వరల్డ్ ప్రచురించిన వ్యాస సంకలం నుండి గ్రహింపబడినది. ఈ సంకలనం, అనుసృజన వి. బాలసుబ్రహ్మణ్యం గారు.*

–వాచస్పతి

(గత సంచిక తరువాయి...)

# పదనిష్పాదనకళ 8

*The joy of coining new words!*

### అయిదో అధ్యాయం
### సంస్కృత పదప్రత్యయాల సహాయంతో క్రియాకల్పన పద్ధతులు

సంస్కృత పదాలకి ఇంచుక్ చేేే విధానం మనకందఱికీ కొద్దీ గొప్పో తెలుసు కనుక సవిస్తరంగా ఆ- జోలికిపోను. విశేష వివరణలు కావాల్సినవారు చిన్నయసూరి రచించిన బాలవ్యాకరణంలోని క్రియా పరిచ్ఛేదం చదవండి. ఐతే ప్రస్తుతం ఈ మార్గంలో కూడా అవసరమైన పదాల కల్పన జఱగడంలేదు. దీనికి సామాజిక కారణాలున్నాయి. **మన సమాజంలో సంస్కృత భాషా పరిజ్ఞానం ఎక్కువగా ఒక ప్రత్యేక సామాజిక జనాభాకే పరిమితం. మిగతా ప్రజలకి సంస్కృతంతో సంపర్కమెప్పుడూ లేదు.** ఇప్పుడు ఆ జనాభా ఆంగ్ల విద్యాపారీణమైంది. తత్ఫలితంగా మనం గతం నుంచి సాంస్కృతిక తెగతెంపులకి గుఱైన అపస్మారకపు చారిత్రికదశలో బతుకుతున్నామేమో ననిపిస్తుంది. మనం ఆంగ్ల పదాలకి దీటైన దేశిపదాల్ని పట్టుకోవడంలో విఫలమవుతున్న దశా పరిణామం గోచరిస్తోంది. ఇక్కడ కొంత ప్రదర్శించడం జఱుగుతోంది. ఈ ఒఱవడినే మిగతా పదాలకి సైతం అనువర్తించి ప్రయత్నించవచ్చు,

ఉదా:- పుస్తకం (book) - పుస్తకించు (booking) వీణ్ణి జేబుదొంగగా పుస్తకించండి. (నమోదు చెయ్యండి. Book him as a pickpocket)

మార్గం (route) - మార్గించు (routing) పేపాల్ ద్వారా ఈ చెల్లింపుని మార్గించాను (మార్గం కల్పించాను) = పేపాల్ పద్ధతిలో (మార్గంలో) ఈ చెల్లింపుని పంపించాను. (I routed this payment through Paypal)

'ఇంచుక్' ఉపయోగించి ప్రసిద్ధ సంస్కృత వ్యక్తుల/దేవతల పేర్లని కూడా క్రియాధాతువులుగా మార్చొచ్చు. అలాంటివి ఒకటి రెండు ఇప్పటికే సుప్రసిద్ధం. ఉదా : భీష్ముడు - భీష్మించుట, శివాలెత్తుట మొ.

మఱికొన్నింటి క్కూడా అవకాశముంది. కాని అలాంటి క్రియాధాతువులు అర్థం కావాలంటే వారి గుణగణాలు కొంచెమైనా తెలియాలి. చరిత్రలో కొందఱు వ్యక్తులు చేసిన పనులు వారి మనస్తత్త్వానికి అద్దంపట్టుతాయి. ఆ మనస్తత్త్వాన్ని అనుసరించి చేసే పనుల్ని వర్ణించడానికి వారి పేరుమీద క్రియాధాతువుల్ని కల్పించవచ్చు. ఉదా :

విక్రమార్కించు = పట్టువదలకపోవు, జయచంద్రించు =స్వదేశీయులకు ద్రోహం చేసి విదేశీయులకు తోడ్పడు, కుంభకర్ణించు= లోకోత్తరంగా నిద్రపోవు మొదలైనవి.

మన పూర్వీకులు కేవలం సంస్కృత క్రియాధాతువులనే తెలుగులోకి తేలేదు. వారు సంస్కృత నామవాచకాల నెన్నిటినో కూడా తెలుగు క్రియాధాతువులుగా పరివర్తించారని గమనించాలి.

**ఈ క్రిందిపదాలు పరిశీలించండి :**

అంకురం - అంకురించు; అంజలి - అంజలించు; అంతరము - అంతరించు; అనుకూలం - అనుకూలించు; అలసం (ఆలస్యం) - అలసించు; అసహ్యం - అసహ్యించుకొను; ఆశ - ఆశించు, ఆర్భటి - ఆర్భటించు; కటాక్షం - కటాక్షించు; కబళం - కబళించు ; కరుణ - కరుణించు; కష్టం - కష్టించు; కుసుమం - కుసుమించు; గోచరం - గోచరించు; గౌరవం - గౌరవించు; జన్మ - జన్మించు ; చిత్రం - చిత్రించు; తటస్థము - తటస్థించు; తామసం - తామసించు; తీవ్రం - తీవరించు; నిర్మూలం - నిర్మూలించు; నీరసం - నీరసించు; పరమపదం - పరమపదించు; పరిపాటి - పాటించు; ప్రగల్భాలు - ప్రగల్భించు; ప్రతికూలం - ప్రతికూలించు; ప్రతిబింబం - ప్రతిబింబించు; ప్రపంచము - ప్రపంచించు; పురాణం - పురాణించు; బద్ధకం - బద్ధకించు; మూర్ఛుడు - మూర్ఛించు; యోగం - యోగించు; వల్లి (ఉపనిషత్తులలోని శీక్షావల్లి, ఆనందవల్లి మొదలైన అధ్యాయాలలోని మంత్రాల పఠనం) - వల్లించు; విగ్రహం (పోట్లాట) - విగ్రహించు; విషమం - విషమించు; విహ్వలము - విహ్వలించు శృంగారం - శృంగారించు; శుష్కం - శుష్కించు; సమీపం - సమీపించు; సాహసం - సాహసించు; స్వాగతం - స్వాగతించు; హేమం - హేమించు మొ॥

ఇవేవీ సంస్కృతంలో క్రియలుగా వాడరు. కానీ తెలుగుపూర్వీకులు సాహసించారు. వీటిల్లో నామవాచకాలే కాక అనుకూలం, గోచరం, విషమం, విహ్వలం, అసహ్యం, సమీపం లాంటి విశేషణాలు కూడా ఉన్నాయనేది అవధేయం. దుర దృష్టవశాత్తూ ఆ చొఱవ ఈ తరంలో లోపించి పదసృష్టి ఆగిపోయింది. ప్రయత్నించాలే గానీ ఇప్పుడు కూడా ఈ బాటలో పదాల్ని నిష్పాదించే అవకాశం ఇతోఽధికంగా ఉంది.

1. **ఇలాంటి పదాల్ని క్రియలుగా మార్చేటప్పుడు సర్వ సాధారణంగా చివఱ 'ఈకరించు' అని చేఱుస్తారు.** అలా కాకుండా నేరుగా వట్టి 'ఇంచుక్' చేర్చడం ద్వారా కూడా క్రియాధాతువుల్ని నిష్పాదించే వీలుందని పై ఉదాహరణల ద్వారా తెలుసుకోవచ్చు.

**నామవాచకాల్ని క్రియాధాతువులుగా మార్చడం : ఎందుకు ? ఏమిటి ? ఎలా ?**

ఒక నామవాచకాన్ని క్రియాధాతువుగా మారుస్తున్నామంటే అలా ఎందుకు మారుస్తున్నామో మనలో ఒక స్పష్టమైన అవగాహన ఉండాలి. అసలు అలా మార్చే అవసరం దానంతటఅది కలగాలి. అలా మార్చడం ద్వారా మనం ఏ విధమైన కొత్త అర్థాన్నీ, వ్యంగ్యధ్వనినీ ఉద్దేశిస్తున్నామో ముందు మనకొక అవగాహన ఉండాలి. సరైన లక్ష్యశుద్ధి లేకుండా ఊరికే ప్రతి నామవాచకాన్ని క్రియాధాతువుగా మార్చడం వల్ల వచ్చిపడే అదనపు అభివ్యక్తి సౌలభ్యమేమీ లేదు.

1. సాధారణంగా ఒక పదబంధం (phrase)తో గానీ, శబ్దపల్లవం (idiom) తో గానీ బారుబారుగా చేసే వ్యక్తీకరణలను ఒక్కపదంగా కుదించడం కోసం మారుస్తారు.

ఉదా :- తెలుగులోకి అనువదించాడు = తెనిగీకరించాడు. ఘనపదార్థంలా గట్టిగా మారింది = ఘనీభవించింది.

9. కొన్నిసార్లు రచనలకి శీర్షికలుగా సమాసాల్ని పెట్టాల్సి

వస్తుంది. రచనాశీర్షికలు బారుబారుగా ఉండడం బావుండదు గనుకా, క్లుప్తంగా వ్రాయాలంటే సమాస ఘటన తప్పదు గనుకా, ఆ సమాసాల్లో పదబంధాలూ, శబ్దపల్లవాలూ ఇమడవు గనుకా, ఒక పదాన్ని క్రియాధాతువుగా మార్చి దాని భావార్థకాన్ని (noun form) ఒక అవయవంగా సమాసంలో చొప్పిస్తారు.

ఉదా- రెండు దేశాలకీ మధ్య మళ్ళీ స్నేహం కలపడం అని శీర్షిక పెట్టాల్సి ఉందనుకోండి. ఇఋదేశాల పునర్ మైత్రీకరణ అని పెట్టొచ్చు .

3. సదరు నామవాచకం తన అర్థం ద్వారా సూచించే వ్యక్తిగానో, వస్తువుగానో, పదార్థంగానో, లక్షణంగానో మార్చడాన్ని, లేదా మారడాన్ని తెలియజేయడం కోసం క్రియాధాతువుగా మారుస్తారు.

ఉదా:- దైవం = దేవుడు, దైవీకరించు = దేవుణ్ణి చేసి పూజించు, పిండం = ముద్ద, పిండీకరించు = ముద్దగా చేయు, హేమం = బంగారం హేమీకరించు = బంగారుమయంగా చేయు, కఠినం = గట్టి, కఠినీకరించు = కఠినత్వమనే లక్షణాన్ని కలిగించు/ సంతరించుకొను

ఉద్యానం - తోట, ఉద్యానీకరించు = తోటలాగా మార్చు ఉద్యానీకరణ - Landscaping (హరితీకరణ అని కూడా అనొచ్చు)

8. ఒక వస్తువుతో పోల్చడానికి ఆ వస్తువుని క్రియాధాతువుగా మారుస్తారు.

పర్వతం = కొండ (ఇక్కడ పర్వతం పోల్చబడే వస్తువు), పర్వతీకరించు = పర్వతంలా పెద్దదీ, గొప్పదీ చేసి మాట్లాడు, తృణం = గడ్డిపోచ (ఇక్కడ తృణం పోల్చబడే వస్తువు), తృణీకరించు =గడ్డిపోచతో పోలుస్తూ దానిలా (తక్కువగా) చూచు.

9. దేన్నయినా/ ఎవటినైనా ఒకచోట ఉంచడం/ పెట్టడం అనే అర్థంలో క్రియాధాతువుగా మారుస్తారు.

వశం = అదుపు, వశీకరించు = అదుపులో పెట్టు, ఉన్నతం = ఎత్తు, ఉన్నతీకరించు= ఎత్తులో / ఎత్తుగా పెట్టు (to elevate, to promote)

దూరం = దవ్వు, దూరీకరించు = దూరంగా పెట్టు

**ఈకరించు**

ఈకరించు అని చేర్చి నామవాచకాల్ని క్రియాపదాలుగా మార్చిన కొన్ని పూర్వోదాహరణలు ఈ క్రింద.

ఆంధ్రము = తెలుగుభాష - ఆంధ్రీకరించు, వక్రము = వంకర - వక్రీకరించు, విద్యుత్ = Electricity - విద్యుదీకరించు, పట్టణము = Urban area = పట్టణీకరించు (to urbanise) క్రమబద్ధము = regular - క్రమబద్ధీకరించు (to regularise) విపులము = వివరము - విపులీకరించు (to elaborate) విశదము = తేటతెల్లము - విశదీకరించు (to elucidate) అధునా = ఇప్పుడు, ఈ సమయము - ఆధునీకరించు (to modernize) ప్రమాణము =Stanadard - ప్రమాణీకరించు (to standardize) క్రోడము = ఒడి - క్రోడీకరించు (ఒళ్ళో పెట్టుకున్నట్లుగా ఒకచోట చేర్చుకోవడం) వాజము = ఠెక్కు/ వేగం - వాజీకరణం (వేగాన్ని పెంచే ఔషధం) సరళం = తేలిక - సరళీకరణం (simplification/ liberalization) పరాయి = alien; పరాయీకరించు = పరాయిగా చేయు (alienate) పరాయీకరణ = alieanation మొ॥ కానీ అన్ని పదాలకీ 'ఈకరించు' చేర్చడం సాధ్యం కాదు, ముఖ్యంగా ఆకారాంత, ఉకారాంత, యకారాంత శబ్దాలకి !

వివరణ :- ఉకారాంత శబ్దాలంటే పదం చివఱ 'ఉ/ ఊ' అని అంతమయ్యేవి.

ఉదా :- జిజ్ఞాసువు, పటువు, మధువు మొ॥వి.

1. వీటి చివఱి అచ్చుని దీర్ఘం చేసి కరించు అని చేర్చాలి.

అప్పుడు ఇలాంటివి - జిజ్ఞాసూ + కరించు, పిపాసూ + కరించు, జంతూ + కరించు, గురూ + కరించు, పటూ + కరించు, మధూ + కరించు అనే విధంగా మారతాయి.

ఆకారాంత శబ్దాలంటే పదం చివఱ 'ఆ' అనే ఉచ్చారణతో పలికేవి. ఉదా ఉదా:- లతా, ప్రక్రియా, శాఖా, రేఖా మొ॥వి.

.యకారాంతాలంటే పదం చివఱి 'య' అనే అక్షరం గలవి. ఉదా :- సమయం, వాఙ్మయం, కార్యం మొ॥వి.

9. ఆకారాంత, యకారాంతాలకి చివఱ 'ఆపించు'అని చేర్చి వాటిని క్రియాధాతువులుగా పరివర్తించవచ్చు. ఉదా:

ప్రక్రియ = (n) process ప్రక్రియాపించు - (U) to process ఉదా :- ఆంధ్రాలో ఆహారాన్ని ప్రక్రియాపించే పరిశ్రమలు హెచ్చు. (Food-processing units abound in Andhra)

3. ఒకసారి ఇలా ఒక కొత్త క్రియాధాతువుని నిష్పాదించినాక, దాని నుంచి ఉద్భవించే విస్తారమైన పదకుటుంబం ఇలా ఉంటుంది.

ప్రక్రియాపన = (n) processing ప్రక్రియాపకం = processor (ఉదా:- పదప్రక్రియాపకం = Word-processor; ప్రక్రియాపక పరిశ్రమ = processing industry) ప్రక్రియాపితం = processed (ఉదా:- ప్రక్రియాపిత ఆహారం = processed food) ప్రక్రియాపకుడు = process maker ప్రక్రియాపనీయం = processable, processing-worthy ప్రక్రియాపనీయత = processability ఇదే విధంగా

సమయం = (n) time సమయాపించు = (U) సమయాన్ని ఏర్పఱచు to set a time, to schedule something as to occur at a patricular time. సమయాపన (n) ఉదా :- ఈ టపాని వచ్చే వారానికి సమయాపించాను - have scheduled this post for the next week.

శాఖ = (n) a branch శాఖాపించు = (U) శాఖగా ఏర్పాటు చేయు, శాఖగా ఏర్పాటగు to set up a branch, to branch out శాఖాపన (n) = branching out ఉదా :- ఆ వ్యాపారం ఆంధ్రా అంతటా శాఖాపించింది (శాఖలుగా విస్తరించింది) - The business branched out all over Andhra.

4. 'ఈకరించు' చేర్చాల్సిన అన్నిచోట్లా మఱొక అర్థంలో కావాలనుకున్నప్పుడు 'ఆపించు' అని చేర్చవచ్చు.

ఉదా :- సామాన్యీకరించు అనేది to generalize అనే అర్థంలో వాడబడుతోంది. ఇది సామాన్య శబ్దానికి ఈకరించు అని చేర్చడం ద్వారా ఏర్పడింది. కానీ ఒక సందర్భంలో అదే సామాన్యశబ్దాన్ని ఉపయోగించి మనం ఇంకో అర్థంలో ఒక కొత్త క్రియాధాతువుని నిష్పాదించాలనుకున్నాం. అప్పుడు

సామాన్యాపించు - (v) to reduce someone or something to common level ; to apply something commonly to all. సామాన్యాపన (n) - ఇవి నేనిచ్చిన అర్థాలు.

5 . ఆకారాంతశబ్దాల్ని క్రియాధాతువులుగా మార్చడానికి దుకృఞ్

(కరించు) ధాతువుని నేరుగా చేర్చవచ్చు. ఈకరించు అవసరం లేదు.

ఉదా :- శాఖాకరించు (శాఖాకరణ), రేఖాకరించు (రేఖాకరణ), బాధాకరించు (బాధాకరణ) మొ॥

6. ఇకారాంత/ ఈకారాంత శబ్దాల విషయంలో కష్టమే లేదు. నేరుగా ఈకరించు అని చేర్చవచ్చు.

7. ఉకారాంత శబ్దాల విషయంలో వాటి చివరి ఉకారాన్ని దీర్ఘం చేసి ఆ తరువాత డుకృఞ్ ధాతువునీ, ఇంచుక్ నీ చేర్చాలి.

1. ఉదాహరణకు :- అణువు = (n) atom అణు + కృ + ఇంచుక్ = అణూ + కృ + ఇంచుక్ = అణూకరించు = (v) to atomise

దీని పదకుటుంబం ఇలా ఉంటుంది.

అణూకరణ = (n) atomization అణుకారి/ అణూకర్త = (n) atomizer (స్త్రీలింగం – అణూకారిణి) అణూకృతం/ అణూకారితం = (past participle) atomized అణూకరణీయం = (adj) atomizable వ్యతిరేకార్థకం – అనణూకరణీయం = (adj) non-atomizable అణూకరణీయత = (n) atomizability

2. పటువు = (adj) hard, strong, powerful, capable పటూకరించు = (v) to harden, to strengthen, to empower, to enable. to capacitate పటూకరణ = (n) hardening పటూకారి/ పటూకర్త = (n) hardener (స్త్రీలింగం – పటూకారిణి) పటూకృతం/ పటూకారితం = (past participle) hardened పటూకరణీయం = hardenable

వ్యతిరేకార్థకం – అపటూకరణీయం = (adj) un-hardenable పటూకరణీయత = (n) hardenability

3. మృదువు = soft, delicate, sensitive మృదూకరించు = to soften, to sensitive మృదూకరణ = (nl) softening మృదూకారి/ మృదూకర్త = (n) softener (స్త్రీలింగం – మృదూకారిణి) మృదూకృతం / మృదూకారితం – (past participle) softened మృదూకరణీయం – softenable వ్యతిరేకార్థకం – అమృదూకరణీయం = (adj) un-softenable మృదూకరణీయత = (n) softenability

4. హలంత శబ్దాల్ని ఇలా సకర్మక క్రియాధాతువులుగా మార్చేటప్పుడు ఆ శబ్దాలకి డుకృఞ్ (కరించు) ధాతువు నేరుగా వచ్చి చేఱుతుంది.

బలాత్ = బలంతో; బలాత్కరించు = ఒత్తిడిచేయు సత్ = పండితుడు ; సత్కరించు = బాగా తెలిసినవాడనే గౌరవాన్ని చూపించు, సమ్మానించు, తిరస్ = వెనక్కి ; తిరస్కరించు = త్రిప్పిపంపు సాక్షాత్ = కట్టెదుట; సాక్షాత్కరించు = ఎట్టెదుట చూపించు, ఛీత్ = ఛీ; ఛీత్కరించు = ఛీకొట్టు

భవించు/ ఈభవించు

5. భవించు/ ఈభవించు అని చేర్చి నామవాచకాల్ని క్రియాపదాలుగా మార్చిన కొన్ని పూర్వోదాహరణలు ఈ క్రింద. భవించు అంటే అవ్వడం/ కావడం/ ఉండడం. ఉదా: మందం = నెమ్మది, మెల్లన; మందీభవించు = నెమ్మదించు, అంతర్ = లోపల ; అంతర్భవించు = లోపల భాగంగా ఉండు, అప్రమేయంగా (తనంత తానే) ఉండు. To underlie. శీతలం = చల్లనిది; శీతలీభవించు = చల్లబడు. ఉష్ణం = వేడి; ఉద్దీభవించు = వేడెక్కు ద్రవం = నీటివంటి పదార్థం; ద్రవీభవించు = నీటిలా పల్చగా ప్రవహించే తత్త్వాన్ని సంతరించుకొను

6. ఈ విధంగా నిష్పాదించిన క్రియాధాతువుల నుంచి ఉద్భవించే విస్తారమైన పదకుటుంబం ఇలా ఉంటుంది.

ద్రవం = (n) liquid ద్రవీభవించు = (v) to get liquefied = ద్రవంగా మారు ద్రవీభవనం = (n) liquefication = ద్రవంగా మారడం ద్రవీభావి = (adj) liquefier = ద్రవంగా మారే స్వభావం గలది (స్త్రీలింగం ద్రవీభావిని), ద్రవీభూతం = (past participle) liquefied = ద్రవంగా మారినటువంటిది (పుల్లింగం ద్రవీభూతుడు) ద్రవీభవనీయం = (adj) liquefiable, వ్యతిరేకార్థకం = అద్రవీభవనీయం/ అద్రవనీయం = (adj) non-liquefiable

7. హలంత శబ్దాల్ని ఇలా అకర్మక క్రియాధాతువులుగా మార్చేటప్పుడు – ఆ శబ్దాలకి భూ (భవించు) ధాతువు నేరుగా చేఱుతుంది. ఉదా :

ఆరాత్ = దగ్గఱ, ఆరాత్ + భవించు = ఆరాద్భవించు = దగ్గఱ అగు

సరిత్ = నది, సరిత్ + భవించు సరిద్భవించు = నదిలా మారు

**అభ్యాసకార్యములు**

ఈ క్రింది పదాల్ని క్రియాధాతువులుగా మార్చి వాక్యరూపంలో ఉదాహరణలివ్వండి :

1. విఫలం 2. జయప్రదం 3. ప్రముఖం 4. ప్రతినాయకుడు 5. మానవుడు 6. పశువు 7. ఆస్తికుడు 8. మృత్యువు 9. సాధువు 10. కార్యం 11. సత్యం 12. సేతువు 13. వాఙ్మయం 14. ఐతిహాసికం (చారిత్రికం) 15. గ్రామ్యం 16. వితథం (అబద్ధం) 17. అధ్యాయం 18. సౌమ్యం 19. ధర్మం 20. తత్త్వం (philosophy) 21. సులభం 22. చిహ్నం 23. తేజస్/ తేజో 24. ఓజస్/ ఓజో (బలం) 25. మధువు 26. మరువు (మరుభూమి = ఎడారి) 27. హిమం 28. ప్రచురం 29. శ్వేతం (తెలుపు) 30. ధూసరం (grey) 31. అరుణం (ఎఱుపు) 32. లోహితం (ఎఱుపు) 33. పాటలం (గులాబీరంగు) 34. హరితం (ఆకుపచ్చ) 35. శ్యామలం (నలుపు) 36. గౌరం (పసుపు) 37. శ్యావం (brown) 38. సుగంధం 39. నిర్జలం (నీళ్ళు లేనిది) 40. దరిద్రుడు 41. సంపన్నుడు. 42. విపణి. 43. సాయుధుడు 44. నిరాయుధుడు 45. నిఘంటువు 46. కోశం 47. వర్ణక్రమం (alphabetical order) 48. క్రమం (order) 49. పద్ధతి (order) 50. వాహిని (channel). 51. పంజరం.

ఈ క్రింది ఆంగ్ల క్రియాధాతువులకి సరిసాటి అయిన తెలుగు–సంస్కృత పదాలు ఎంచుకొని క్రియాధాతువులుగా మార్చండి :

సూచన– ఉదా :– to represent – ఒకతికి/ ఒకదానికి ప్రతినిధిగా ఉండు ప్రతినిధి + ఇల్లుక్ = ప్రతినిధిల్లు. సూచన–2 : దీనికే ఇంచుక్ చేర్చి ప్రతినిధించు To delegate (ప్రతినిధిగా పంపు) అనే అర్థంలో ఇంకో క్రియా ధాతువుని సైతం నిష్పాదించవచ్చు. ఉదా :– ఐ.రా.స. సమావేశాలకి మా తరఫున ఇద్దఱిని ప్రతినిధించాం.

అంటే ఆ ఆంగ్ల క్రియాధాతువుకి ఏ ముఖ్యమైన తెలుగుపదంతో అర్థం చెప్పుకుంటావో దాన్నే కొత్త క్రియాధాతువుగా

**తరువాయి 41వ పుటలో.......**

డా।। పి.శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

# 'ఈ చదువులు మాకొద్దు'

**భూగోళంలో అడవులు, బీళ్ళు, నీళ్ళు; ఈ సహజవనరులే అధికశాతం. సంపద సృష్టించటం అనే పేరిట మనం పెంచిన ఆస్తులు తక్కువే. కాని అవి చేస్తున్న హాని ఎప్పుడో హద్దులు దాటిపోయింది. ఈ సహజ వనరులలో ఉత్పత్తులు సేకరించుకుని పొట్టపోసుకునే అభాగ్యులను మనం తరిమేస్తున్నాం. ఇప్పుడు జరుగుతున్న వినాశం అదుపులోకి రావాలంటే, రెండు డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గాలంటే, మనం పారిశ్రామిక యుగం ముందు దశకు పోవాలని/ చేరాలని ఒప్పందాలు, చట్టాలు, లక్ష్యాలు మొత్తుకుంటున్నాయి.ఆ లక్ష్యాలు అందుకోవాలంటే ఆ అభాగ్యుల జీవన విధానం నుండి నేర్చుకోవటవే ముక్తి మార్గం. ఆ దారి స్పష్టంగా కనిపిస్తున్నా,ఇంతకాలం పెదదారి పట్టిన మనబుద్ధులు, చదువులు మారటం లేదు. ఆస్తి మీది మమకారంతో పాటు పేరు, పదవి, కొలువు, గుర్తింపు తాపత్రయం కొంతైనా వదులుకుంటేనే కాని అది సాధ్యం కాదు.'సమాజం దిగబెరుకుతుంటే, సాహిత్యం ఎగబెరకదు'(కొ.కు).మన కవిత్వం మేడిపండు-మనదరిద్రం రాచపుండు'అంటూ చిరకాలంగా హెచ్చరిస్తున్నా,మనం ఇంకా వేళ్ళు చీక్కుంటూ, ఎముకముక్క కొరుక్కుంటూ మన చదువులూ, అది సృష్టించే ఉద్యోగాలు, మేధావులు, సాహిత్యగాళ్ళ చుట్టూ తిరుగుతున్నాం.**

**కొత్త రూపాలలో పాత చదువులు.**

పారిస్‌లోని ఇనాల్కో లో ఆచార్యుడు డానియల్, హైదరబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని దళిత ఆదివాసీ అధ్యయన కేంద్రంతో కలిసి, 'కొండకోనలలో తెలుగు గిరిజనులు' చెంచు పాటలు 'గిరిగంజ గిరిమల్లెలు'ఫ్రెంచ్‌లోకి అనువదించటానికి ఒప్పందం చేసుకున్నారు. ఆ ఒప్పందకాలం పొడిగింపుకు ఆయన వెళ్ళినపుడు, నన్నూ తీసుకోని వెళ్లారు. అక్కడ నుంచి ఆ ప్రాంగణంలోగల సెంటర్ ఫర్ ఈ-లెర్నింగ్‌లో భాషాశాస్త్రవేత్త జంధ్యాల ప్రభాకరరావుగారిని కలిశాం.

'ప్రతి చోటా ఇండిజినస్/మూలవాసుల మీద ఏం చేస్తున్నారు అని అడుగుతున్నారు; మీరేమన్నా సాయం చేయగలరా!' అని ఆయన అడిగారు.అంతకుముందే తెలిసిన మానవశాస్త్రశాఖలో విశ్రాంత ఆచార్యుడు శివప్రసాద్ అక్కడే ఉన్నారు..

ఈ మూలవాసుల జ్ఞానం, ఆయా స్థల కాలాలు ,వలసలతో ముడిపడి ఉంటుంది.కాబట్టి వారు తిరిగే స్థలాల పేర్లు, సంప్రదాయ సరిహద్దులు, వలసపోయే దారులు, అనుమతులు, పంపకాలు,తగవులు తీర్చుకునే ఏర్పాట్లు వీటిని చూపించటానికి, ఒక జాగ్రఫీ నిపుణుని సహకారం కావాలి అని నేను ప్రతిపాదించిన వెంటనే ,సెంటర్ ఫర్ రీజనల్ స్టడీస్ లో ఆచార్యులు అరవింద్ సుసర్లను ఒప్పించారు.మేం పదిసార్లు పైగా కలిసి ఒక డిప్లొమా కోర్స్ ప్రవేశపెట్టటానికి పాఠ్యక్రమం తయారు చేసాం. ఇంతలో నేడు 'శక్తి'లో నా బాధ్యతలు పంచుకుంటున్న ఉపగ్రహ అధ్యయనంలో యువ శాస్త్రవేత్త అల్లూరి వరుణ్ మాతో కలిసారు. అతడు విశాఖజిల్లా తీరంలో జాలర్లతో,నల్లమల అడవులలో చెంచులతో తిరిగి వారి దేశకాలాలను అర్థం చేసుకున్నాడు. మేమంతా రాతపని మొదలెట్టే సరికి కరోనా అడ్డుతగిలింది. అయినా ఎవరి పని వారుచేసుకుంటూ ముందుకు వెళుతుంటే, చెంచులకు వీటిమీద దీర్ఘకాలం శిక్షణ ఇచ్చే కార్యక్రమం వచ్చింది.ఇంతలో ఈ చట్టాలు, విధివిధానాలను పక్కనపెట్టి, పోలవరం ప్రాజెక్ట్ కింద మునిగిపోతున్న గ్రామాలను కూల్చివేసి బలవంతంగా తరలింపును నిలిపివేస్తూ, మా పిటిషన్ పై, హై కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యాజ్యం, ముందు ముందు ఈ చట్టాల అమలుపై మరింత స్పష్టత తీసుకుని రావచ్చు.

**ఆచరణలోకి తేవలసిన అధ్యయనాలు, చదువులు.**

గ్రామనామాల అధ్యయనానికి కేతు విశ్వనాథరెడ్డి గారి కడపజిల్లా ఊళ్ళ పేర్ల మీద చేసిన కృషి భూమిక. ఆయన కథారచయిత. అరసంలో విశాలాంధ్ర ప్రచురణలలో కీలక పాత్ర వహిస్తున్నారు. కాని **'పోడు మాజన్మ హక్కు అని ఉద్యమాలు నిర్వహించిన వామపక్షాలు గిరిజనుల జ్ఞానం మీద ఆధారపడిన హక్కుల సమగ్ర గుర్తింపుకు కాక, పోడు భూములకు పట్టాలిప్పించే పనికి పరిమితమైనారు.** విశ్వవిద్యాలయాలలో మానవ శాస్త్ర శాఖ తన విద్యార్థులను నెల రోజులపాటు మూలవాసులమీద క్షేత్ర కృషి చేయిస్తుంది కాని, ఇంతవరకు ఎక్కడా ఈ వైపు దృష్టి సారించలేదు. ఇటువంటి పరిస్థితిలో కొన్ని స్వచ్ఛంద సంస్థలవత్తిడితో ప్రభుత్వం అరకొరగా ఈ మూలవాసుల జ్ఞానాన్ని వారి హక్కులను గుర్తించే ప్రయత్నం చేస్తుంది.

**కొత్త చదువులు - స్వానుభవాలతో రచనలు. కవితలలో స్పందనలు - ప్రశ్నించటం మరిచి పోయిన పిల్లలు.**

కాని నూటికి నూరు శాతం ఫలితాలు సాధించటంలో మునిగి పోయిన ఉద్యోగులు, స్వానుభవాలు తప్ప, సంస్కృతి పట్ల ఆసక్తిలేని వారి రచనల ప్రభావం గిరిజనులలో తమ సంస్కృతిని గుర్తు తెచ్చుకునే ప్రయత్నాన్ని అణచి వేసింది.(కొన్ని కలలు, మెలకువలు - చిన వీరభద్రుడు. ఎమెస్కో) ఈ పోకడల పరిణామాలకు బాధపడుతున్న ఒక అధ్యాపకుని వేదన, ఈ చదువులు అడవిపిల్లలను మరబొమ్మలుగా మార్చిన తీరును చిత్రిస్తుంది.' గిరిజనపిల్లల్లో ఉండే పట్టుదలను ప్రిన్సిపాల్ channelise చేయగలిగాడు. అయితే ఈ పిల్లల్లో సృజన సామర్థ్యాలను పెంచటంలో జరిగిన కృషి పెద్దగా ఏమీలేదు. **పిల్లలు ఎంత మెటీరియల్ ఇచ్చినా చదివి పారేస్తారు తప్ప స్వయంగా ఆలోచించరు.ఫలితాల సాధన అనే మహత్తర లక్ష్యం వారిముందు ఉండటం చేత విద్యార్థుల creativity ని ఆలోచించే వ్యవధిని వారు తీసుకోపోలేక పోయారు.**

పిల్లలు ప్రశ్నించటం మరిచి పోయారు. జ్ఞాపకం ఉండటమే జ్ఞానం అనే స్థితికి చేరుకున్నారు. తరగతిలో పాఠం వింటున్న పిల్లలకు ప్రశ్నలు పుట్టటం లేదంటే వారి thinking faculties ఆగిపోయాయని ఒకవేళ ప్రశ్నించమని ప్రోత్సహించినా ఏం అడగాలో తెలీని పరిస్థితిలోకి పిల్లల మెదళ్ళు మూసుకుపోయాయి.రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో ఫలితాలు సాధించిన కళాశాల సాధించిన దేమిటి? గిరిజన

విద్యార్థులను వారి అభ్యసన పద్ధతులను జాగ్రత్తగా గమనిస్తే మనకొక సంగతి అవగతమౌతుంది.ఈ పిల్లల భాషాసామర్థ్యాలు కనిష్ట స్థాయిలో ఉన్నాయి.తమదికానిభాషలో వీళ్ళు విద్యనేర్చుకుంటున్నారు. మాతృభాష ప్రభావం ఈ పిల్లల మాధ్యమ భాషమీద బలంగా పడుతున్నది. మాతృభాషలో ఉండే కల్పనలు విద్యాభాషమీద ఉండటంతో ఈ భాష పిల్లలకు క్లిష్టంగా మారింది.ఈ క్లిష్టత వారిలో న్యూనతకు కారణమౌతున్నది'.(కారేపల్లి కబుర్లు 2012 పుట 39-40 ) ఇంత బాధపడిన ఈ అధ్యాపకుడు 'లంబాడి గేయసాహిత్యం' చదివి కొన్ని పలుకుబడులైనా పాఠం చెప్పేటప్పుడు వాడుతుంటే పిల్లలు కొంతైనా అల్లుకుపోయేవారు. ముందుమాట 'ఏ టీచర్స్ డైరీ'లో కూడా 'విద్యార్థుల భాషాసాంస్కృతిక సామాజిక నేపథ్యాల పట్ల అధ్యాపకులకు అవగాహన ఉండాలి , వారి పూర్వ జ్ఞాన పరిశీలన చేసి అంచనా వేయాలి' అంటూ చిలక పలుకులు వల్లించారు. జిల్లాలో జరిగే సైన్స్ ఫెయిర్‌లలో గాని, వార్షికోత్సవాలలో గాని గిరిజనుల ప్రతిభలను ప్రదర్శించే కార్యక్రమాలను ప్రోత్సహించలేదు. పిల్లలు వాళ్ళ ఆట పాటలేవో వాళ్ళు ఆడుకునేవారు. వాటిని ఎవరూ పట్టించుకోలేదు.

**ప్రభుత్వం చెక్కిన బొమ్మలు-మూసుకున్న దారులు..**

పల్లెప్రజలు, ముఖ్యంగా గిరిజనులు, 'చట్టాలకు, ప్రభుత్వానికి కట్టుబడి ఉండే సమాజంగా పరిణామం పొందుతున్నారు. ప్రభుత్వ కేటాయింపులపైనే ఆధారపడే తెగలుగా, శతాబ్దాలుగా ఉత్పత్తి రంగంలో నిలదొక్కుకున్న ఒక సమాజం, దయారహితంగా ఆ రంగం నుండి బహిష్కరింపబడి, ఎస్టేట్‌లలో బానిసలుగా కాని, ప్రభుత్వరంగం అట్టడుగుపొరల్లో గుమస్తాగా గాని రూపాంతరం చెందుతున్నారు' (కొండదొరసాని.సాహిత్య అకాడెమీ2011 పుట13)అంటూ ముందుమాటలో విచారపడుతూ వారు తమదైన కొత్తమార్గం వెతుక్కోవాలని ఉద్బోధిస్తారు.

**దిద్దుబాటు చర్యలు -**

అభివృద్ధి వికటించి పర్యావరణం ఘోరంగా దెబ్బతినటంతో ప్రపంచమంతా దిద్దుబాటు చర్యలు మొదలైనాయి. 2003లో వచ్చిన జీవవైవిధ్య చట్టం వనరులమీద సంప్రదాయ జ్ఞానానికి పట్టం కట్టింది. అప్పటివరకు ఆక్రమణ దారుగా చూసిన ప్రభుత్వం, అడవిలో ఆదివాసుల వాడుకలను గుర్తించటానికి 2006లో అటవీ హక్కుల గుర్తింపు చట్టం తెచ్చింది. ఇందుకోసం ఆయా స్థలాల పేర్లతో సంప్రదాయ గ్రామపటం గీసి, అక్కడి ఉమ్మడి వ్యక్తిగత వాడుకలు పేర్కొని దరఖాస్తుకు జతచేయాలి అని నిర్దేశించింది.

కాని చదువుకున్న, ఉద్యోగం చేసే గిరిజనుల, అది అమలు చేసే అధికారుల మెదళ్ళు మూసుకుపోయాయి. వారికి గిరిజన సంస్కృతి యొక్క వ్యక్త రూపాలు స్థలాల పేర్లు, మెట్టలు, బసలు, బాసలు, కొత్తలు గుర్తుచేసే జ్ఞాపకాలు, సామెతలు పలుకుబడులు తట్టటం మానేసాయి. తలో దారిగా తూతూ మంత్రంగా వీటి అమలు జరుగుతుంది. జీవవైవిధ్య చట్టం ప్రకారం బీల, తంపర భూముల రక్షణకోసం ఉధృతంగా ఉద్యమం జరిగింది. ఎంతో సాహిత్యం వచ్చింది. కానీ వీటి నమోదు మాత్రం అంతంతగా సాగుతుంది. అందువల్లనేనేమో 'విప్లవాల సంగతి అటుంచి చిన్న చిన్న సంస్కరణలను కూడా సాహిత్యం చెయ్యలేదు( పుట 96) అని కొ.కు నిర్వేదం చెందాడు. సాహిత్యం, ముఖ్యంగా సాహిత్య విమర్శ ఆలోచన రగిలించాలి. మునుముందుకు నడిపించాలి అనే ఆశ అడియాసగా మారుతున్న తరుణంలో సహజవనరులపై ఆధార పడిన బతుకుతెరువుల మీద కృషి, పాతదే అయినా కొత్తరూపాలలో కొత్త ఆశలు కల్పిస్తున్నది..

అయితే దళితులు, ఆదివాసీలు, బహుజనులు ఈ కృషిలో పాలుపంచుకున్నప్పుడే ఈ కృషి సఫలమౌతుంది. దానికి ఇంతకాలం చదివిన చదువుల, కొలువుల డొల్లతనం అర్థం కావాలి. ఈ చదువులు మాకొద్దు అంటూ వాళ్ళు మూలాలు వెతుక్కోవాలి.

**నానీలు**

## సమరసతా నానీలు

నీలోని
నీవు కూడా నేనను
'భావం సమరసం'
ఇంటి పేరు
ఒక్కటయితే చాలు!
నా కులమని
సంబరమెందుకు?
కులవివక్షతలకి
విరుగుడు
విద్వేషమా?
సమన్వయమా?
అంబేద్కర్
అనుసరణీయుడే!
అనుచరుల
అడుగుజాడలే!?
మనువాదం లేదు
మనుషులమే
రాజ్యాంగమే

మనకు నేటి స్మృతి
కొంచెపుబుద్ధితోనే
కొట్లాటలు
సమరసభావముతో
సమైక్యత
కులపొత్తు
వివాహం వరకు!
కులాలపొత్తు
సమత్వం కొరకు!
అహం వీడితే
అందరు మనవారే
అయినా 'నేను'
విడువలేక పోతున్నం
అనుబంధాలు
పల్లెటూరిలో....
నగరంలోనేమో
బంధనాలు.....
కలిసి నడుద్దామన్నది

మన వేదం
విడగొట్టటమే
కొందరికి మోదం
సమత్వం
సాధించాలనుకుంటే
సంఘర్షణ కాదు
సమన్వయం దారి
కులాల కొట్లాటలన్ని
ఒక్కరి వల్లే
ఆ ఒక్కరు "నేను"తో
సహజీవులే
వృత్తిని బట్టి
పుట్టింది..కులము
ప్రవృత్తిని బట్టి
ఉంటుంది..గౌరవము
విడగొట్టటమే
కొందరి సిద్ధాంతం
వేలెత్తామా!?

మళ్ళీ రాద్ధాంతం
మహనీయులకి
కులం వెతకటం
ఆధునిక
యుగలక్షణం..
పూర్వీకులు
జ్ఞానానికి విలువనిస్తే
అనాగరికుల్ని
చేసింది చరిత్ర
మేధావులై
కులగజ్జి రుద్దటమే
నేటి ఆధునిక
డెమోక్రసీ....
పక్కవాడు తొక్కేయటం
పాతమాట
అంతకన్నా ప్రమాదం
ఆత్మన్యూనత
ఆత్మన్యూనత

ఒక్కరినే బంధిస్తుంది
అహంభావం
అందర్నీ కాల్చుతుంది
'నేను' 'ఎక్కువ'
అనుకున్నావా!
నీ ఎదుగుదల
నీవే అడ్డుకున్నట్లు!
సమతా హృదయం
సాధించాలంటే
సమరస
టానిక్ తాగాల్సిందే
సమాజవృక్షం
బలపడాలంటే
గుండెవేర్లని
సమరసంతో తడపాలి

– సాకి
9949394688

ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి
98481 23655

# పడమటిగాలితో నివురు తొలగిన తెలుగు భాషా సాహిత్య సంపద 11

తెలుగు భాషా సాహిత్యం తరతరాలుగా తరగని సంపదగా వర్ధిల్లుతుంది. ఉన్న సాహిత్యం అంతా తాళపత్రాల మీదో, బూర్జ పత్రాల మీదో రాగిరేకుల మీదో ఉందే తప్ప అచ్చుకాలేదు. అచ్చులోకి రాలేదు. దినదినాభివృద్ధి చెందవలసిన విజ్ఞాన సంపద అంతా బూజుపట్టి, చెదలు పట్టి, బూడిద పాలయిందే తప్ప తరతరాలకు తరాల నిధిగా నిలవలేదు. అటువంటి పరిస్థితుల్లో పాశ్చాత్యులు మన దేశానికి రావడం వ్యాపారం చేయడం ఒక ఎత్తయితే, మరో వైపు మన సాహిత్యం పునరుద్ధరణ గావించడం మరో ఎత్తయింది. క్షీణదశలోని సాహిత్య సంపదను లక్షణంగా ముద్రించి తరతరాలకు అందించిన పాశ్చాత్య దేశవాసులు ఎందరో ఉన్నారు.

1658లో డచ్ వారు ఆంధ్రప్రదేశ్ లోని పాలకొల్లు, జగన్నాయకపురం, కాకినాడ, మచిలీపట్నం, విశాఖపట్నం, భీమునిపట్నం మొదలయిన ప్రాంతాల్లో వారు గిడ్డంగులను ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేశారు. వారి వాణిజ్యం వ్యాపారలావాదేవీలు సరిగా లేనందువల్ల, డచ్ వారి స్థావరాలన్నీ ఇంగ్లీషు వారే కైవసం చేసుకున్నారు. ఫ్రెంచ్ వారు 1669 నాటికి తెలంగాణ ప్రాంతంలో వ్యాపారాభివృద్ధి చేసుకున్నారు. గోల్కొండ నవాబు నుంచి ఎగుమతి పన్నులేకుండా ఫర్మానా సంపాదించారు. మచిలీపట్నంలో 1693 నాటికి ఫ్రెంచ్ పేటనే నిర్మించి ఒక గిడ్డంగిని కూడా ఏర్పాటు చేశారు. వీరి గిడ్డంగులు యానాం, నరసాపురం, రాజమండ్రి, గుంటూరు జిల్లాలోని నిజాంపట్నంలో నిర్మించారు. ఫ్రెంచ్ వారి పలుకుబడి వల్ల తెలుగు భాష, సాహిత్యంలో ఆయా భాషాపదాలు చోటు చేసుకున్నాయి. కనత్తూరి రంగ కవి రచించిన ఆనందరంగరాట్ఛందము, దిట్టకవి కృతమైన రంగరాయ చరిత్రము, చత్రాతి లక్ష్మి నరసకవి రచించిన పద్మనాభ యుద్ధము మొదలయిన గ్రంథాల్లో ఫ్రెంచ్ వారి ప్రస్తావన, వారి పరిస్థితి, స్థితిగతులు వ్యాపారాలు కన్పిస్తాయి.

వీరి తర్వాత ఎక్కువకాలం పాలించినవారు ఇంగ్లీషువారు. వీరి కాలంలోనే వ్యాపారంతోపాటు సాహిత్య సంపద వెలుగులోకి వచ్చింది. దీనితోపాటు విద్య, వైద్యాలయాలవృద్ధి బాగా కనిపిస్తుంది. విద్యతో గ్రంథ ప్రచురణ కూడా బాగా చోటుచేసుకుంది. దీనికో కారణం ఉంది. పాశ్చాత్య దేశాలు అంచెలంచెలుగా భారత భూభాగంలో అడుగుపెట్టి దేశమంతా వ్యాపించారు. అలా వచ్చిన వారికి స్థానిక భాష ఓ పెద్ద సమస్య. అందుకోసం ఆనాటి సివిల్ సర్వెంట్లు అరబ్బీ, పారశీకం, హిందూస్తానీ, సంస్కృతం, హిందీ, బెంగాలి, ఒరియా, మరాఠీ, గుజరాతి,తెలుగు, కన్నడం, తమిళం, మలయాళం అనే పదమూడు భాషలతోపాటు ఆనాటి వ్యావహారిక పదజాలం నేర్చుకోవలసిన అవసరం ఏర్పడింది. ఈ భాషలన్నింటిలో వ్యాకరణాలు, నిఘంటువులు, పదకోశాలు ప్రాంతాల వారీగా తయారు చేయడం మొదలు పెట్టారు. ఇతర భాషల్లో వ్యాకరణాలు, నిఘంటువులు మొదలయినవి సిద్ధం చేసిన పాశ్చాత్యులు చాలా మందే ఉన్నారు. వారిలో పారశీకం-రిచర్డ్సన్, సంస్కృతం - కోల్ బ్రూక్, ఎల్లిస్, సదర్ లాండ్, మెక్ నాటన్, మొయనీర్ విలియమ్స్ హిందుస్థానీ, డాక్టర్ గిల్ క్రిస్ట్, బెంగాలి - డాక్టర్ విలియం కేరీ, ప్రొఫెసర్ హీటన్, తమిళం - బేషి (1728) రోట్లర్, ఆండర్సన్, తెలుగు-కాంబెల్, మారిస్, బ్రౌన్, మలయాళం - బెయిలీ, గుండర్ట్ కన్నడం - కిట్టెల్, మెక్కిరల్, రోల్ఫ్, మరాఠి - మేజర్ మోల్స్ వర్త్, ఒరియా - మేస్తర్ సట్టన్, గుజరాతి - డ్రమ్మండ్ మొదలయిన వారున్నారు. తొలినాళ్ళలో మనకు అందుబాటులో ఉన్న తెలుగు నిఘంటువులు.

విలియం బ్రౌన్-ఎ వొకాబులరి ఆఫ్ జంటూఅండ్ ఇంగ్లీష్ మద్రాసు 1818, కాంబెల్, ఎ.డి- ఎ డిక్షనరీ ఆఫ్ తెలుగు లాంగ్వేజ్, మద్రాసు-1821, మోరిస్, జె.సి- ఎ డిక్షనరీ ఇంగ్లీషు - తెలుగు - మద్రాసు -1835, నికొలస్, జె- ఎ వొకాబులరి ఆఫ్ ఇంగ్లీష్ అండ్ తెలుగు, మద్రాసు -1841 బ్రౌన్, సి.పి - ఎ డిక్షనరి, తెలుగు అండ్ ఇంగ్లీషు, మద్రాసు - 1853, పెర్సివల్ (రెవ)సి - తెలుగు - ఇంగ్లీష్ డిక్షనరి మద్రాసు - 1862, హేలర్, పి- తెలుగు నిఘంటువు కంటైనింగ్ తెలుగు ఇంగ్లీషు అండ్ ఇంగ్లీషు - తెలుగు రాజమండ్రి 1900, మొదలయినవి ఎన్నో ఉన్నాయి. దేశీయులయిన వారు కూర్చిన నిఘంటువులు కూడా బాగానే ఉన్నాయి. రామకృష్ణ శాస్త్రులు - వొకాబులరి యిన్ ఇంగ్లీష్ అండ్ తెలుగు, మద్రాసు-1841 వీరాస్వామి మొదలియార్: ది బిల్డర్ వొకాబులరి యిన్ ఇంగ్లీష్ అండ్ తెలుగు - మద్రాసు - 1841, శంకరనారాయణ, పి - ఎ స్కాలర్ ఇంగ్లీషు తెలుగు డిక్షనరి, మద్రాసు - 1804,- తెలుగు - ఇంగ్లీషు డిక్షనరి, మద్రాసు-1900 మొదలయిన వాటితోపాటు తెలుగు - తెలుగు శబ్దకోశాలలో శబ్దరత్నాకరం, శబ్దార్థ చంద్రిక, సూర్యారాయాంధ్ర నిఘంటువు,వావిళ్ళవారి నిఘంటువు, ఆంధ్ర వాచస్పత్యము, మొదలయిన వాటితోపాటు తెలుగు, ఉరుదు, హిందీ, మరాఠి, ఒరియా నిఘంటువులు ఇంగ్లీషు ప్రాతిపదికగా వచ్చాయి.

19వ శతాబ్ది ప్రథమ పాదంలో దేశవ్యాప్తంగా కోశవ్యాకరణాలు, సాహిత్య గ్రంథాల ముద్రణ విరివిగా జరిగాయి. దీనికి బెంగాల్‌లోని సిరంపూరు కేంద్ర బిందువయింది. బెంగాలి భాషతోపాటు పలుభాషా గ్రంథాలు, నిఘంటువులు, వ్యాకరణాలు ముద్రించి భారతదేశంతోపాటు చైనా, జపాన్ తదితర దేశాలకు ముద్రించిన గ్రంథాలు సరఫరా చేసిన ఖ్యాతి రెవరెండ్ **విలియం కేరి**(17.8.1761 -9.6.1834)కే దక్కుతుంది. విలియం కేరీ: విలియం కేరీ ఇంగ్లండ్‌లోని పాలెర్ స్పరీ అనే గ్రామంలో ఎడ్మండ్ కేరీ, ఎలిజబెత్ దంపతులకు 1761 ఆగష్టు 17న జన్మించాడు. తండ్రి పల్లెటూరి పాఠశాల ఉపాధ్యాయుడు. కొంతకాలం నూలు వ్యాపారం, వస్త్ర



విలియం కేరి

వ్యాపారం చేశాడు. విలియం కేరీ ప్రారంభంలో తండ్రి వద్దే చదువుకుని అనంతరం ఉన్నత విద్యపూర్తి చేశాడు. ఈ కాలంలోనే ఫ్రెంచ్, హిబ్రూ, లాటిన్, జర్మన్, అరబిక్, సంస్కృతం తదితర భాషలను నేర్చుకున్నాడు. ప్రారంభంలో బతుకు తెరువుకోసం చర్మకార వృత్తి చేశాడు. 1781లో డోరతిని వివాహం చేసుకున్నాడు. పెళ్ళయేనాటికి డోరతి నిరక్షరాస్యురాలు. వైవాహిక జీవితంలో 7గురు పిల్లలు పుట్టారు. అందులో యిద్దరు ఆడపిల్లలు బాల్యంలోనే చనిపోయారు. 1789 నాటికి ఒక సంఘానికి దైవబోధకుడయాడు. డేనిష్ మిషన్ పక్షాన భారత దేశానికి 1793 నాటికి కలకత్తా వచ్చాడు. కలకత్తాకు ఉత్తరంగా ఉన్న బండేల్ అనే పోర్చుగీసు స్థావరం అనుకూలంగా ఉంటుందని ఎంచుకున్నాడు. అక్కడ డాక్టర్ తామస్ అనే ఉపాధ్యాయుడితోను రాంబస్ అనే అనువాదకుడితోను పరిచయం అయింది. దేశం విడిచి వచ్చినందువల్ల, కొత్త ప్రదేశం అయినందువల్ల తెచ్చుకున్న డబ్బు అయిపోతున్నందువల్ల ఆర్థికంగా కొంత బాధ ఏర్పడింది. అందువల్ల ఉద్యోగం కోసం ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో ఉడ్నే అనే బెంగాలీయుడి సహాయంతో మాల్దా సమీపంలోని ముద్నబాటి అనే గ్రామంలో నీలిమందు కర్మాగారంలో చిన్న ఉద్యోగం లభించింది. అది కేరీకి ఎంతో మేలయింది. సామాన్య ప్రజలతో సన్నిహితంగా ఉన్నందువల్ల బెంగాలి భాష త్వరగా నేర్చుకునే అవకాశం కలిగింది. భాష నేర్చిన అనంతరం తాను వచ్చిన సంస్థయిన లండన్ మిషనరి సొసైటీకి లేఖరాస్తూ స్థానిక భాషల్లో బైబిలు, వ్యాకరణాలు, భారతీయ భాషా గ్రంథాలు ముద్రించ వలసిన అవసరం ఉందని తెలియజేశాడు. కేరీ లేఖ ఆధారంగా లండన్ మిషనరీ సొసైటీ కేరీకి తోడుగా జాషువ మార్షమన్, విలియం వార్డ్‌లను ఎంపిక చేసి కలకత్తాకు పంపించారు. మార్షమన్ భాషా శాస్త్రవేత్తగా, అనువాదకునిగా, సంపాదకునిగా, పుస్తక విక్రేతగా ముఖ్యంగా ముద్రణలో అనుభవమున్న వాడు. విలియం వార్డు అతి సామాన్యమైన వడ్రంగి కుటుంబానికి చెందినవాడు. ఐతే ముద్రణలో బాగా అనుభవముంది. అందువల్ల భారత దేశానికి మిషనరీగా, ప్రెస్ సూపరింటెండెంట్ గా గ్రంథముద్రణ చేయాలనే సంకల్పంతో వచ్చాడు.

మార్షమన్, వార్డులు భారత దేశానికి వచ్చేసరికి శ్రీరంగ పట్టణం బ్రిటీషువారు కైవసం చేసుకుని దాదాపు సంవత్సరం అయింది. ఆ కారణంగా బ్రిటీష్ వారి రహస్యాలు బయటకు చేరకుండా ఉండేందుకు దేశమంతా కట్టుదిట్టం చేశారు. ఈ కారణం వల్ల ముద్రణకుగాని, అచ్చు యంత్రస్థాపనకుగాని అనుమతి లభించలేదు. అదేకాలంలో సిరంపూరు డేనుల ఆధీనంలో ఉంది. కేరీకూడా డేనులకు సంబంధించిన వాడే కాబట్టి సిరంపూర్‌లో పాఠశాల స్థాపనకు, ప్రెస్ నిర్మాణానికి గవర్నరు అనుమతి లభించింది. ఆ వెంటనే 1800 ప్రాంతంలో పాఠశాల స్థాపించారు. పరిసర గ్రామాల నుంచి పిల్లలకు ఉచిత విద్యాబోధన ప్రారంభం చేశారు. మరికొంతకాలానికి బోర్డింగ్ పాఠశాల ప్రారంభం అయింది. ఇది ప్రస్తుతం క్రైస్తవవేదాంత విద్యకు కేంద్రమయిన సిరంపూరు విశ్వవిద్యాలయంగా ఎదిగింది. దానికి తోడు 1801 నాటికి సిరంపూర్ ప్రెస్ స్థాపనకూడా జరిగింది. 1801 ఫిబ్రవరి 7 నాటికి బెంగాలి భాషలో కొత్త నిబంధన అచ్చయింది. ఇదేవారు ప్రచురించిన ప్రథమ ముద్రణ.

సిరంపూర్‌లో 1801 నుంచి 1832 వరకూ 47 భాషల్లో ముద్రణ జరిగింది. 40 భాషల్లో పోత అక్షరాలు తయారు చేసి భారత దేశమంతటికీ సరఫరా చేశారు. సిరంపూర్ మిషన్ ప్రెస్ ప్రింటింగ్‌లో అనుభవమున్న మార్షమన్, వార్డుల సహకారంతోపాటు స్థానికంగా ఉన్న గంగాకిషోర్ భట్టాచార్య సహాయం ఎంతయినా ఉందని వారి లేఖల్లో ప్రస్తావించారు. Katheine Smith Diehl రాసిన Early Indian Imprints page 64లో స్పష్టంగా ఉంది.

The Tenth momoir respecting the translations (1834) say that printing had been done at Serampore in forty seven lenguages, for above forty of which types had been cast at Sermpore. Serampore had also become the source of supply for entire country in the matter of types and Presses were started every where. 1801 నుంచి 1832 వరకు బైబిళ్ళు, వ్యాకరణాలు, నిఘంటువులు,రామాయణం మొదలయినవి 47 భాషల్లో రెండు లక్షల 12 వేల గ్రంథాల ముద్రణ జరిగింది. ఐతే కేవలం బైబిలుకు సంబంధించినవి మాత్రం 33 భాషల్లో జరిగింది. సంస్కృతము హిందీ, బ్రిజ్ భాషా, మరాఠా, బెంగాలి, ఒడియా, తెలింగా, కర్నాటా, పుష్టీ, పంజాబి, కాశ్మీరి, అస్సామి, బర్మా, పాలి, చైనీస్, ఖాసి, బిర్ కనీరా, ఉదయపురా, మార్వా, జయపూర, కున్‌కురా, తముళ్, సింగాలిస్, ఆర్మినియా, మాల్షివియన్, గుజరాతి, భోషి, సింధ్, వుచ్, నేపాల, మలయా, హిందుస్తానీ, పర్షియన్ భాషల్లో ముద్రణ జరిగింది. ఇదే కాలంలో నిఘంటు నిర్మాణం ముద్రణ కూడా జరిగింది. బెంగాలి, సంస్కృతం, మరాఠి భాషల్లో ముద్రించిన నిఘంటువులు నేటికీ కేరీ గ్రంథాలయం, సిరంపూరులో ఉన్నాయి. 1815 నాటికి కేరీ 7 భాషల్లో వ్యాకరణాలు రచించి ముద్రించాడు. 1. సంస్కృతం 2. చైనా 3. బర్మా 4. బెంగాలి 5. మరాఠా 6. పంజాబి, 7. తెలుగు. తెలుగు వ్యాకరణం 1814లో ముద్రణ జరిగింది. ఈ ప్రతి ప్రస్తుతం నేషనల్ లైబ్రరీ కలకత్తాలో

ఉంది. కేరీ స్థానికులయిన పండితులతో ఆయా వ్యాకరణాలు రూపొందించాడు.

ప్రతిభాషా వ్యాకరణం పీఠికలో ఆయా ప్రాంతీయ సహాయకులను, రచయితలను ప్రత్యేకంగా ఉటంక్కించాడు. కొన్ని సందర్భాల్లో సహాయకుల పేర్లు ఉదహరించని చోట్ల Native Pundits, Learned pundits, Learned Munshies, Native assistants అని మాత్రమే పేర్కొన్నాడు. **తెలుగు వ్యాకరణం 1814లో అచ్చయింది. ఇందులో తెలుగు సంస్కృత జన్యమనే వాదించాడు.** దీనికి తోడు తెలుగు వ్యాకరణ రచనకు సహాయపడిన పండితుల్లో సుబ్బశాస్త్రి (Subba Shastree) అతని సోదరుడు నాగేశ్వరశాస్త్రి (Nageshwar Sastree) సహాయం మరువలేనిదన్నాడు. పైగా వారు జ్ఞానంగల వ్యాకరణవేత్తలని కితాబు యిచ్చాడు.

ఇంతవరకు బాగానే ఉంది. 1812 మార్చి 12వ తేది సిరంపూర్ ప్రెస్ అగ్నిప్రమాదానికి గురయింది. ఈ అగ్ని ప్రమాదంలో 14 భాషల్లోని పోత అక్షరాలు, 12 వందల రీముల కాగితం, ఎన్నో రాత ప్రతులు దగ్ధం అయ్యాయి. ఈ అగ్ని ప్రమాదంలో కొంతవరకు కాలినా మిగిలిన భాగమయిన బెంగాలి రామాయణం, బహుభాషా సమానార్థకపద నిఘంటువు (Polyglot dictionary) మాత్రం దక్కాయి. ఇవి నేటికీ సిరంపూరు కేరీ గ్రంథాలయంలో అముద్రితంగానే ఉన్నాయి.

కేరీ తయారు చేసిన బహు భాషా సమానార్థక పద నిఘంటువు (Polyglot dictionary) కొంత చర్చించవలసిన అవసరం ఉంది. బహుభాషా నిఘంటువు తయారు చేయడానికి ఏదో ఒక భాషను మూలంగా స్వీకరించి యితర భాషలలోని సమానార్థక అర్థం, సరయిన అర్థం వచ్చేలా తయారు చేసే ప్రక్రియను బహుభాషా సమానార్థక పద నిఘంటు నిర్మాణం అంటారు. ప్రపంచంలో తొలి బహుభాషా సమానార్థక పద నిఘంటువు కార్డినల్ ఫ్రాన్సిస్కో (Cardiral Fransisco) నిర్వాహకత్వంలో 1522వ సంవత్సరం స్పెయిన్‌లో ఆరు సంపుటాలుగా అచ్చయింది. ఇది బైబిలు సంబంధి పాతనిబంధన హిబ్రూ, గ్రీకు భాషల్లోను, కొత్త నిబంధన గ్రీకు లాటిన్ భాషల్లోనూ తయారయింది. సిరంపూరులో ఉన్న సమానార్థక పద నిఘంటువు 13 భారతీయ భాషల్లో సంస్కృతాన్ని మూల భాషగా గ్రహించి తయారు చేశాడు. దీనికి యూనివర్సల్ డిక్షనరీ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజస్ అని పేరుపెట్టాడు. (Universal dictionary of Indian Languages) బహుబాషా సమానార్థక పదనిఘంటువు చేతితో తయారయిన కాగితం (hand made paper) పసుపు రంగులో దళసరిగా ఉంది. కాగితం, క్రిమిద్రష్టం కాకుండా క్రిమి సంహారక రసాయనాలతో ఆరబెట్టి భద్రం చేశారు. కాగితానికి ఒక వైపు మాత్రమే నల్లని సిరాతో రాసి ఉంది. పదమూడు భాషలు వేర్వేరు గళ్ళలో రాసి ఉన్నాయి. మొదటి పుటలో సంస్కృతంతోపాటు మిగిలిన భాషల పేర్లు బెంగాలి లిపిలో ఉన్నాయి. తరువాత పుటల్లో వరస క్రమంలో 1 నుండి 13 వరకు అంకెలు వేశారు. ప్రతి పుటకు 6నుండి 8 పంక్తులున్నాయి. ముఖ పత్రం లేదు. కాగితం పొడవు 52 సెం.మీ., వెడల్పు 20 సెం.మీ. మొత్తం పుటలు 312, పదాల సంఖ్య 2184. ఇందులో ముగ్గురిచేతి రాతలున్నాయి. ఒకటి కేరీది కావచ్చని ఆనాటి గ్రంథాలయాధికారి సునీల్ కుమార్ చటర్జీ (1976 ప్రాంతంలో) చెప్పారు. నిఘంటువు అంతా బెంగాలి లిపిలోనే ఉంది. చదివి అర్థం చెప్పిన ఆనాటి సహాయ గ్రంథాలయాధికారి అనిల్ దాస్ కి కృతజ్ఞతలు. కొన్ని పుటల్లో కాలిన మచ్చలున్నాయి. ఇది పూర్తయే నాటికి హిబ్రూ, గ్రీకు పదాలు చేర్చాలనే తలంపు ఉందని ఒక లేఖలో కేరీ రాశాడు. ఈ గ్రంథంలోని 13 భాషల వివరాలు. సంస్కృతం, కాశ్మీరి,పంజాబి జలంధర్, మధ్య ప్రదేశ్ భాష, పర్వతి భాష, మైథిలి, బెంగాలి, ఒరియా, మరాఠీ, గుజరాతి, తెలుగు, కన్నడం, తమిళం.

**ఇది గనక అప్పుడు ముద్రించి నట్టయితే ప్రపంచంలో బహుభాషా సమానార్థక పదనిఘంటువు ముద్రించిన ఖ్యాతి విలియం కేరీకి, ముద్రించిన దేశంగా భారత దేశానికి దక్కేది.** ●

---

## స్పందన

"అమ్మనుడి" గత పది నెలలుగా ప్రచురిస్తున్న ధారావాహిక "పడమటి గాలితో నివురు తొలగిన తెలుగుభాషా సాహిత్య సంపద" వ్యాసం- ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారిగారు అద్భుతంగా రాస్తున్నారు. ప్రతీ మాసం తప్పక చదువదగినది. తెలుగు భాష, సాహిత్యాల ఘనమైన చరిత్రను వెలికితీసి అందిస్తున్నందుకు రచయితకు కృతజ్ఞతలు.

–ఆచార్య అవుటి జగదీష్, హైదరాబాద్

---

**కవిత**

## హోళీ –హోళికా

హోళీ హోళికా
దుర్గుణాల ప్రతీతి (ప్రతీక )
అరి షడ్వర్గాల కూడిక
అంతఃశత్రువుల మాలిక
ఆ కామ క్రోధ మోహ మద మాత్సర్యాల కలయిక
అంతం చేయాలి ఆ మన్మథుని ఇక
ఆ ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి ముందుగా
ఆమని ఆగమనానికి నాందిగా
ఆలోకించి ఆడాలి మనమందరమిక
ఆ సప్త వర్ణ శోభిత చన్దనమిక
ఆస్వాదించి ఆశ్లేషించాలిక
ఆహ్వానించి ఆహ్లాదపడాలిక
అదియే అదియే హోళిక
అవధి లేదు మన ఆనందానికిక
అందరం జరపాలి వేడుకగా
ఆబాల గోపాలం వాడుకగా

గుడికందుల ప్రకాశం
9550894025

ఈమని శివనాగిరెడ్డి
98485 98446

## అడుగుజాడలు ఆనవాళ్లు-8

# నా అద్దంకి - ధర్మవరం యాత్ర

**నేను** అప్పటికే సగం ప్రయాణంలో ఉన్నా. ఎందుకైనా మంచిదని విద్వాన్ జ్యోతిచంద్రమౌళిగారికి ఫోన్ చేశా. ఆయన వెంటనే స్పందించి 'సార్ ఇప్పుడు ఉదయం 4:30గం అవుతుంది. మీరు ఆరుగంటలకు రండి. మనం 7.00 గంటలకల్లా ధర్మవరం వెళదాం. తరువాత అద్దంకి వచ్చి టిఫినుతిని, అద్దంకిలోని చారిత్రక కట్టడాలు, శిల్పాలు, శాసనాలను చూద్దా'మన్నారు. నేను అప్పుడే చిలకలూరిపేట దాటి మార్టూరు చేరువలో ఉన్నాను. ఈ సారి అద్దంకీ, ధర్మవరం, మణికేశ్వరం, కుదిరితే దర్శి వెళతామని అనుకొంటున్నా. ఇంతలో మేదరమెట్ల బోర్డు కనిపించి, అటు నుంచి ఇటు తిరిగి అద్దంకిబాట పట్టామోలేదో ఊళ్లో వాలిపోయి మళ్లీ చంద్రమౌళిగారికి ఫోన్ చేస్తే, రాంనగరు సెంటరుకు రండి నేను ఐదునిముషాల్లో అక్కడుంటానన్నారు. ఆయన వచ్చిన తరువాత మసకచీకట్లోనే, కారులో ప్రకాశం జిల్లా మ్యాపు తెరచి, పోవాల్సిన ఊళ్లను ఒక సారి చూచుకొన్నాం.పొట్టి శ్రీరాములు సెంటర్లో అల్లంచాయ్‌తాగి మంచి ఉత్సాహంతో బయలుదేరాం. తెల్లటిగుడ్డలో నల్లటి చంద్రమౌళిగారు మెరిసిపోతున్నారు. మాచర్ల చెన్నకేశవుని వెండి మీసాలను పోలిన తన తెల్లటి మీసాలను సవరించుకొంటూ మురిసిపోతున్నారు. ఆయన తిరుపతి ప్రాచ్య కళాశాలలో ప్రాచ్యభాషలో మాస్టర్సు డిగ్రీ చేశారు.తెలుగు సాహిత్యంలో పీ.హెచ్.డీ. చేశారు. సాహిత్యాభిలాషతోపాటు, చరిత్రపై మమకారం పెంచుకొన్నారు. తిరిగేకాలు ఊరుకోదన్న సామెతను నిజం చేస్తూ, ప్రకాశం జిల్లా అంతాగాలించి, చరిత్ర పరిశోధకులుగా ప్రసిద్ధులయ్యారు. 2004లో అద్దంకి చరిత్ర, 2008లో ప్రకాశం జిల్లా దర్శనీయ స్థలాలు, 2019లో కొణిదెన చరిత్ర శాసనాలు, 2020లో ప్రకాశంజిల్లా ప్రాచీన చరిత్ర అంతకు ముందే ఆంధ్రప్రదేశ్‌లో బౌద్ధక్షేత్రాలు అన్న పుస్తకాల్ని రాసి, తాను విన్నంత, కన్నంతను ఉన్నంతలో నలుగురికీ పంచి పెట్టారు. 'ధర్మవరంలో ఇనుప యుగపు సమాధులు నాశనమవుతున్నాయి. మీరొచ్చారంటే వాటిని ఎలాగైనా కాపాడుకోవచ్చు' అని నిన్నటి రోజునే నాకు ఫోను చేసినప్పుడు, వారసత్వ సంపద పరిరక్షణ పట్ల ఆయన ఎంత ఉబలాట పడుతున్నాడో అర్థమైంది. ఇదిగో వచ్చేస్తున్నానని ఊరించి, అనుకొన్నట్లుగానే అద్దంకి చేరిన నన్ను చూచి ఆయన ఎంత సంబరపడిపోయాడో. ధర్మవరం వైపు వెళుతున్నాం. సినీనటులు, ఆం.ప్ర. సాంస్కృతిక మండలి అధ్యక్షులుగా పని చేసిన ధర్మవరం సుబ్రహ్మణ్యంగారు, ఆరోజుల్లో నన్ను ఆయన ఆఫీసుకు పిలిపించుకొని, ధర్మవరం గురించిన చారిత్రకతను చర్చించుకొన్నాం. అద్దంకిలో ఎర్రాప్రగడ విగ్రహం ప్రతిష్ఠాపన సందర్భంగా నన్ను రమ్మన్నారు. ఆ తరువాత ధర్మవరం వెళదామన్నారు.ఆయనలేడు. అయినా ఆయన మాటలు వినబడుతూనే ఉన్నాయి. ఇంతలో ధర్మవరం చేరుకొన్నాం. చంద్రమౌళిగారు ముందుగా జైన దేవాలయానికి వెళదామన్నాను కాదు, విధ్వంసానికి గురౌతున్న ఇనుపయుగపు ఆనవాళ్ళను చూద్దామన్నాను. ఊరికి దక్షిణంగా మూడు కిలోమీటర్ల దూరంలోగల పాండవులమెట్ట అని పిలుచుకొనే ఒక కొండదగ్గర కారుదిగి, అప్పటికే కొన్ని వందల లారీల మట్టిని తోడుకెళ్లటంవల్ల ఏర్పడిన గుంటలగుండా నడుస్తున్నాం. బృహత్శిలాయుగమని పిలువబడే ఇనుపయుగపు సమాధుల్ని కూడా, కోరపళ్ళ బకెట్టుతో నిర్ధాక్షిణ్యంగా ఎత్తి అవతల పారేసిన జేసీబీ కంటే, దాన్ని నడిపిన డ్రైవర్ కంటే చరిత్రమీద ఏమాత్రం అవగాహనలేని రోడ్డు కాంట్రాక్టరు, ఆ ఇంజనీర్లమీద కోపంవచ్చింది. చెల్లాచెదురుగా పడిఉన్న నలుపు-ఎరుపు మట్టిపాత్రలు, ఎముకల ముక్కలు, అస్తవ్యస్థంగా విసిరివేయబడిన సమాధులచుట్టూ ఉండే గుండ్రటి బండరాళ్ళు విధ్వంసానికి గురై, రక్షించేవారు లేరా, ఇటురారా అని మౌనపోరాటం చేస్తున్నాయి. కొండవాలుమీద అక్కడొకటి, ఇక్కడొకటి పది-పదిహేను గుండ్రంగా రాళ్లతో అమర్చిన సమాధులు మాసంగతేమిటిటంటూ దీనంగా చూస్తున్నాయి. 'సార్, పైకి తరువాత వెళ్లచ్చు. నిట్టనిలువుగా జరాసంధుడిని భీముడు చీల్చినట్లు, ఈ సమాధిని జేసీబీ ఎలా భీభత్సంగా సగానికి సగం తెగ్గొట్టిందో చూడండి.' అన్నారు చంద్రమౌళిగారు. చనిపోయిన వ్యక్తి పుర్రె, ఎముకలగూడు, అతడు బతికుండంగా వాడిన కుండ, అన్నీ సగానికి తెగిపోయి ఉన్నాయి. కళ్ళముందే చరిత్రకు గర్భస్రావం జరుగుతుంటే జీవచ్ఛవంలా నిస్సత్తుతో నిలబడ్డామే తప్ప నేనుగానీ, చంద్రమౌళిగారు గానీ,మాతోపాటు వచ్చిన మరో ఔత్సాహిక పురావస్తు పరిశోధకుడు కడియాల వెంకటేశ్వరరావుగారు గానీ ఏమీ చేయలేకపోయాం. ఎలాగైనా ఈ విధ్వంసాన్ని ఆపమని చంద్రమౌళిగారిని కోరుకొని, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లమన్నాను. ముగ్గురమూ కలసి అక్కడున్న సమాధులన్నంటినీ పరిశీలించి, పదిలపరచాల్సిన అవసరాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళాలని అనుకున్నాం. కొండవాలుపైన ఆరు అడుగుల పొడవు, 3అడుగుల వెడల్పు, 3 అడుగుల ఎత్తు గుంటలో చనిపోయిన వారి అస్తికలను, వారి పనిముట్లు, పాత్రలను వారితోపాటే పాతిపెట్టి, మట్టితోపూడ్చి, ఏవిధంగానూ, హానిజరుగకుండా భద్రపరచి, చుట్టుగుండ్రంగా రాళ్లను పాతి, కట్టడ కళకు ప్రాణంపోశారు క్రీ.పూ.1000నాటి మానవులు.

ఒకచారిత్రక ప్రదేశాన్ని చూడబోతున్నామన్న ఆనందం కాస్తా చెదురుమదురుగా, చెల్లాచెదురుగా ఆనవాళ్లు కోల్పోతూ, చెరిగిపోతున్న తెలుగు వారి సంతకాలైన ఇనుపయుగపు సమాధుల్ని చూడగానే ఆవిరైపోయింది. నిరుత్సాహంతోనే ముగ్గురమూ, ధర్మవరంలో తూర్పుదిక్కున పొలాల్లోఉన్న శిధిల భీమేశ్వరాలయంపైపు వెళ్లాం.



సగంపడిపోయిన 12వందల ఏళ్ల ఆలయాన్ని చూచి విలపించాలో లేక సమీప పట్టణాల్లో ఆంబరాన్నంటే అధునాతన భవంతుల్ని చూచి ముచ్చట పడిపోవాలో తెలియక తికమక పడుతున్ననాకు, ఒకచిన్న ఆలయం గోడకు వారగా అనించిన పార్శ్వనాథ విగ్రహం, భీమేశ్వరాలయం ముందుగోడ పక్కనున్న మహిషాసురమర్ధని విగ్రహం, ఆలయంలోపల శివుడు కొలువై ఉన్నాడని చెప్పకనే చెబుతున్న ఓపికలేక ఒత్తిగిల్లిన నందివిగ్రహాలు కొంత ఊరటనిచ్చాయి.

అంతలో చంద్రమౌళిగారందుకొని, ఈ ఆలయంముందు పొలందున్నుతుంటే 24జైనతీర్థంకరులను అందంగా చెక్కిన జైన శిల్పం బయల్పడగా దాన్ని హైదరాబాదు స్టేట్ మ్యూజియానికి తరలించుకెళ్లారని చెప్పాడు. అంతేకాదు వేంగిచాళుక్య రాజైన గుణగ విజయాదిత్యుని సైన్యాధ్యక్షుడు అద్దంకి పండరంగడు, ఈధర్మవరంలోనున్న తన గురువైన ఆదిత్యభట్టుకు కొంతభూమిని దానం చేసినట్లు క్రీ.శ.850ఏళ్లనాటి



కడియరాజు శాసనం వల్ల తెలుస్తుందనికూడా చెప్పాడు. అయితే ఈ భీమేశ్వరాలయం, చాళుక్యభీముని కాలంలో నిర్మించబడి ఉంటుంది. తరువాత పంగరంగని మునిమనుమడైన దుగ్గరాజు, ఈ ప్రాంత పాలకుడుగా, రెండో అమ్మరాజు కాలంలో ధర్మవరంలో కటకాభరణ జినాలయాన్ని నిర్మించినట్లు, ఆలయ నిర్వహణకు మలియంపూడి గ్రామాన్ని అమ్మరాజు చేత దానం చేయించిన శాసనాధారాలు ధర్మవరంలోనే ఉన్నాయి. ధర్మవరానికి జినధర్మవరమనే మరోపేరు కూడా ఉంది. అయితే, ధర్మవరంలోని పండరంగని శాసనం తెలుగుభాషాపరంగా ప్రాధాన్యతను సంతరించుకొందని కూడ చంద్రమౌళిగారు చెప్పారు.ఇక అక్కణ్ణించి కారెక్కి ఊళ్ళోఉన్న సీతారామాలయంలోకెళ్లాం. చాళుక్యభీముడు క్రీ.శ.897లో వేయించిన శాసనాన్ని, ఆలయంలోని భిన్నమైన వర్ధమానమహావీర, అమ్మవారు, చెన్నకేశవ విగ్రహాలను చూశాం. ఒకప్పుడు రాజపోషణలో, జైన,శైవ మతసామరస్య కేంద్రంగా భాసిల్లిన ధర్మవరం, ఆ తరువాత, కొణిదెనచోళులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర పాలకుల ఆదరణ చవిచూచింది. గోల్కొండ పాలకుడు ఇబ్రహీం కుతుబ్‌షా అధీనంలోకొచ్చిన ధర్మవరం వద్ద మరో గ్రామాన్ని నిర్మించి, అప్పటివరకూఉన్న, ధర్మవరంఅన్న పేరునుకాదని, అతని సేనాని ఎకలస్‌ఖాన్, తనపేరిట ఎకలసపురమనే కొత్తపేరు పెట్టాడు. ఆ సంగతిని తెలియజేసే శాసనం రామాలయంముందు నిలబెట్టిఉంది. అందులో అతడు గ్రామంలో కల్పించిన వసతులు, నీటి పారుదల సౌకర్యం, పంటలకు గిట్టుబాటుధరలను నిర్ణయించి, ప్రజల అభిమానాన్ని సంపాదించిన వివరాలున్నాయి.

ధర్మవరాన్ని గురించి ముగించేముందు ఇప్పటికీ జనంనోళ్లలో నానుతున్న కాటమరాజు కథలు, పల్లికొండ, యలమంచి వెళుతూ ధర్మవరంలో ఆగి, కొలిచిన స్వామి భీమేశ్వరుడా చెన్నకేశవుడా అనే ఆలోచనలో పడ్డాను.

అప్పటికే ఉదయం 9.30అవుతుంది. మనపని మనం చేసుకొంటుంటే ఆకలి తన పనిగా నిశ్శబ్ద సంకేతాలిచ్చింది. ధర్మవరంనుంచి 20 నిమిషాల్లో అద్దంకి చేరుకొని వేయిస్థంభాల గుడిదగ్గర ఒక హోటల్లో టిఫిన్‌చేస్తూ,చూడాల్సిన వాటిగురించి ముచ్చటించుకున్నాం.

అద్దంకి అనగానే మనకు



పండరంగడు, అతడి శాసనం గుర్తుకొస్తాయి. అద్దంకి అనగానే అప్పుడెప్పుడో కాకతీయ సామ్రాజ్య పతనానంతరం, ఆత్మగౌరవంతో పుట్టుకొచ్చిన స్వతంత్రపాలకులైన రెడ్డిరాజులు గుర్తుకొచ్చారు. ప్రజల్ని పరపీడననుంచి కాపాడి స్వేచ్ఛావాయువుల్ని పీల్చే అవకాశాన్నిచ్చి, అద్దంకిని రాజధానిగా తీర్చిదిద్ది రెడ్డిరాజ్యానికి పురుడుపోసిన నేపథ్యం గుర్తుకొచ్చింది. గుండ్లకమ్మ తీరంలో కమ్మని పంటపొలాలనడుమ, ఎత్తైన కోటసౌధాలు, చూడచక్కటి ఉద్యానవనాలు, కవులు, కళాకారులతో భూతలస్వర్గాన్ని తలపించింది అద్దంకి అన్న సాహితీ వర్ణనలన్నీ కళ్లముందు కదలాడాయి. అద్దంకి మహానగరంలో ప్రోలయవేముడు నిర్మించిన నగరీశ్వర, కమఠేశ్వర, గణపతి ఆలయాలను చూడాలనుకొన్నాం. ఇంతలో చంద్రమౌళిగారు అందుకొని ఒక సమకాలీన గ్రంథంలో అద్దంకి నగరవర్ణనలను వినిపించిన తరువాత, ఆసక్తికరమైన సంగతిని చెప్పారు. అదేమిటంటే అద్దంకి నగరంలో

వారవనితలు తమ వెంట్రుకలనే చీకటిలో కలసిన మంగళకర రాత్రి కలవారు. నుదురు అనే చంద్రరేఖతో ప్రకాశించే విదియ వంటివారు. కనుబొమలనే లతల సొబగుల లాస్యం యొక్క మనోహర రంగస్థలం వంటివారు. కళ్ళనే చేపలతో కలసియున్న మన్మథ పతాకవంటివారు. అధరమనే బంధూకపుష్ప విలాసంతో విభ్రమ మందిన శరత్కాలం వంటివారు. శంఖాల్లాంటి అందమైన కంఠాలు కలిగినవారు. చక్రవాక పక్షి జంటల వలె ఉన్న స్థనాలతో శృంగారమనే బావి వంటివారట. వింటుంటే నేనుకూడా మదన క్రీడోత్సాహ పీడితుణ్ణై, మట్టెవాడలో మంచనశర్మ, టిట్టిభశెట్టి వారకాంతలకోసం పడ్డ తిప్పల్ని గుర్తుకు చేసుకున్నాను. టిఫిన్ ముగిసింది. ఇక అద్దంకి నగర పర్యటనకు బయలుదేరాం! చంద్రమౌళిగారే మా టూర్ గైడ్.

ముందుగా రెడ్డిరాజులు కులదైవంగా భావించి పూజించుకున్న నందికంత పోతరాజనే కఠారికి (ఆయుధం) అద్దంకికిగల అనుబంధం, ఆపైన ఆకత్తి అద్దంకినుంచి కొండవీడుకు రాజధానితో తరలిపోయినవైనం, అతరువాత పెదకోమటి వేముడు, వెలమ ప్రభువు సింగభూపాలునికి మధ్య జరిగిన పోరులో చేయిజారి, మళ్ళీ శ్రీనాధుడు, కొండవీడుకు చేర్చిన వైనం చరిత్ర జ్ఞాపకాల్ని ప్రవహింపజేసింది. ఒకసారి ప్రోలయవేముడు, తమ్ముడు మల్లారెడ్డితో కలసి శ్రీశైలయాత్ర ముగించుకొనుచుండగా, శత్రువులదాడినుంచి మోటుపల్లిని రక్షించటానికి మల్లారెడ్డి, అద్దంకిని రక్షించటానికి ప్రోలయవేమారెడ్డి, అద్దంకికి చేరుకున్నప్పుడు, వారి తల్లి అన్నమ్మ, నందికంతపోతరాజు కఠారిని, కోటతూర్పుభాగంలో నిలిపి పూజించిన పోతురాజుగండిని చూద్దామని బయలుదేరిన మాకు నిరాశే మిగిలింది. మట్టికోటగోడ కేవలం దిబ్బలా మిగిలింది. అదికూడా ఒక పంతులమ్మగారు కొని కాపాడుతుందిగాబట్టి పోతురాజుగండి, అదుగో ఆపెద్ద బిల్డింగ్ కిందే ఉండేదని చంద్రమౌళిగారు చూపించారు. ఇలా చారిత్రక ఆనవాళ్లు ఒక్కొక్కటీ చెరిగిపోతుంటే గుండె తరుక్కుపోతుంది.

తరువాత రెడ్డిరాజులు నిర్మించిన పాత (అగస్తీశ్వర) శివాలయం, లోపల సప్తమాతృక శిల్పం, ఇంకా అనేక విరిగిన విగ్రహాలను చూశాం. బాగా పేరుమోసిన అద్దంకి పోలేరమ్మ ఆలయం కొత్తకొత్త రంగుల్తో పొంగిపోతూ, ప్రాచీనతకు పాతరేసిన సంగతిని మరచిపోయినట్లుంది. తరువాత అద్దంకిలో రెడ్డిరాజుల కాలంలోనే నిర్మించిన గణపతి ఆలయాన్ని చూశాం. అద్దంకి పరిసర గ్రామాల రైతులు ఆరోజు ఆలయంచుట్టూ తమ అరకల్ని తిప్పి, ఏరువాక పున్నమిని జరుపుకుంటున్న తీరు మళ్లీనాకు మావూళ్లో ఏరువాక తిరునాళ్లను గుర్తుకుచేసింది. విశాల ప్రాంగణం కుంచించుకుపోయి, ఆధ్యాత్మిక పరిమళాలు ప్రసరించిన చోట అంగళ్లు రాజ్యమేలుతున్నాయి. రెడ్డిరాజుల కాలపు వీరభద్రాలయం కూడా కొత్తరూపుతో పాతదనాన్ని పోగొట్టుకుంది. ఆ తరువాత కాలంలో తాతాచార్యులు నిర్మించాడంటున్న లక్ష్మీ నరసింహాలయం, మాధవస్వామి ఆలయాల్ని చూచి, గత వైభవప్రాభవాలు ఇంతగా నిర్లక్ష్యానికి గురికావాలా అన్న ప్రశ్న మమ్మల్ని



వేధించసాగింది. మధ్యాహ్నం 1.00గంట అవుతుంది. చంద్రమౌళిగారు ఒక పూటకూళ్లమ్మ ఇంటికి తీసుకెళ్ళి అన్నంతినిపించారు. ధర్మవరం సుబ్రహ్మణ్యంగారికి నేనిచ్చిన వాగ్దానం

గుర్తుకొచ్చి, అద్దంకి వేయిస్థంభాల గుడిముందు ప్రతిష్ఠించిన ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱన విగ్రహానికి నమస్కరించుకున్నాను. అద్దంకిలోని 6వజార్జి చక్రవర్తి – విక్టోరియారాణి శిల్పాలు, 1850 నాటి తాలూకా ఆఫీసు, 1933 నాటి పోలీస్ స్టేషన్, ఆస్పత్రి, సబ్‌జైళ్లను చూచి, అవి వెదజల్లే పాత వాసన పరిమళాల్ని ఆస్వాదించాను. **అయితే, ఎప్పుడో 800 ఏళ్లక్రితం నిర్మించిన వేయిస్థంభాలగుడి రోడ్డుకంటే 3అడుగుల గుంటలో ఉంది. వాస్తు కళా విన్యాసానికి మారుపేరైన వినాయకుడిగుడిని అంగళ్లు మింగేస్తున్న తీరు మనసును కలచివేసింది. పాత శివాలయంలో చారిత్రక శాసనానికి సున్నంగొట్టి అక్షరాలు కనిపించకుండా చేయటం మరింత బాధను కలిగించింది.** ఒకనాటి పౌరుషానికి ప్రతీకగా ఉన్న కోటదిబ్బ దిగులుగా మూలుగుతుండటం నన్ను మరింత కృంగదీసింది. నీలిమందు తయారీ తొట్లు, గుట్టు చప్పుడు కాకుండా మాయమవటం తట్టుకోలేని నిజం. ఇన్ని బాధలమధ్య, **వేంగీ చాళుక్యరాజు గుణగ విజయాదిత్యుని సేనాని అద్దంకి పండరంగడు తరువోజ వృత్తంలో వేయించిన క్రీ.శ.848నాటి శాసనం నా మదిలో మెదిలి కొంత ఊరట, తెలుగు సాహిత్య చరిత్రకు పట్టంగట్టిన విషయం గుర్తుకొచ్చి మరికొంత ఉపశమనమూ కలిగాయి.**

హోసూరు తావు
నవల

అగరం వసంత్
094883 30209



**5**

"సవరెయ్యి పొద్దులా తాయప్పమాస్టర్ని పోలీసులు అరెస్టు చేసిరంటా" అనే సుద్ది వూరువూరంతా మాట్లాడతా వుండారు. జనం గుంపులు గుంపులుగా జగిళ్లతావ గుడితావ చేరిండారు. ఇంకొందరు పోలీస్‌స్టేషన్‌కి పోయేకి సురువు అవతా వుండారు. నేనూ కాకన్నా తాతకూడా ఆవులు మేపేకని కావలి పక్కకు కదలి పోతిమి.

"ఏల తాతా తాయప్పమాస్టర్ని పోలీసులు అరెస్టు చేసింది" అంటా అడిగితిని.

"తరతరాలనింకా మన తావుల్లా వుండే ఇస్కూలుల్లా తెలుగు తల్లి ప్రార్థన పాడేది వాడిక. ఈనడమ కొత్తగా సర్కారువాళ్లు తెలుగుతల్లి ప్రార్థనకి బదులుగా తమిళతల్లి ప్రార్థన పాడాలని రూలేసిరంట, దాన్ని ఎదిరిచ్చి తెలుగుసంఘమోళ్లు ఆర్భాటము చేస్తా వుండిరంట. ఆపొద్దు బుదవారము సంత కదా, ఈ విషయము సంతలాని జనాలకి తెలిసి గలాటాలు సురువు అయ్యి, అంగళ్లపైన వుండే తమిళబోర్డుల్ని పీకేసి, పోలీసులపైన రాళ్లేసిరంట. ఓసూరులా వుండే పోలీసుల చేతిలా గలటాలు అదుపు చేసేకి కాకుండా ధర్మపురినింకా పోలీసుల్ని పిలిసిరంట. వాళ్లు వచ్చే దోవలా జీపుకు ఆక్సిడెంట్ అయి దాంట్లో కొందరు పోలీసులు సచ్చిపోయిరంట. ఆ కోపమో ఇంగే కోపమో తెల్లేదు, తెలుగుమాస్టర్లని, తెలుగుసంఘమోళ్లని అరెస్టులు చేసి కేసులు పెడతా వుండారు" అనె.

నేను తమిళనాడులా వుండాను అనె సొరణ (స్పృహ) నాకు అబుడు కదా తట్టె.

"మన తావు తెలుగుతావు, పల్లెలంతా తెలుగు. ఇప్పటికీ చానా పల్లెల్లా ఒగే ఒగ తమిళ కడప కూడా లేదు. అట్లాతప్పుడు ఆంధ్రాలా కదా వుండాల్సింది. ఏల తమిళనాడులా వుండాము" అని అడిగితిని.

"ఇపుటి తమిళనాడు, ఆంధ్రా, కర్నాటక ఇట్లా దక్షిణభారత దేశమంతా అపుడు మద్రాస్‌స్టేట్‌లానే వుండె. అట్లాతబుడు మన తావులా తెలుగు ఓ వెలుగు వెలిగె. తాటి ఆకుల పొత్తాలు, పట్టుబట్టా నెమలిపించం రాతల్లా మెరసి నిలిచె. ఇండ్లు, ఆస్తి పాస్తులు, పూర్వ సమాచారాలు, కొండల చరిత్ర అంతా తెలుగే, ఇంగ్లీషువాని కాలంలా సేలం జిల్లాలో మన తావు వుండె. అబుడు ఇంగ్లీషు సర్కారు వేసిన (ముద్రించిన) కాసుల్లా (నాణ్యాలు) తెలుగు-ఇంగ్లీషు రెండు బాసలు మాత్రమే వుండె. మనకి స్వాతంత్ర్యము వచ్చిన కొన్నేండ్లకి, మాకు వేరే తెలుగురాష్ట్రము కావాలని తెలుగన్నలు పోరాటము సురువు చేసిరి. దేశములా వుండే తెలుగుతావుల్లా అంతా కూడా గలాటాలు జాస్తి ఆయె. బళ్లారి, బరంపురము, మన ఓసూరులాను ఇంగా జాస్తిగా గలాటాలు ఆయె. దేశనాయకుడైన రాజాజీ పుట్టింది, పెరిగింది మన తొరపల్లిలానే, మన తాలూకాలానే. అట్లా నాయకుణ్ణి ఎదురించి పోరాడితిమి. ఎందరో జైలుకి పోయిరి, మన తావుల్లా వుండే నూరారు పంచాయితీలలా ఓసూరు ఆంధ్రాకి చేరాలనే తీర్మానాలు చేసిరి. అబుడు నాయట్ల వయసు చిన్నోళ్లంతా చేరి ఆంధ్రా వచ్చిస్తావుందని పండగ చేసుకొంటిమి. మదరాసు సర్కారు కూడా, ఇది ఆంధ్రాకి చేరే తావే అని మత్తిగిరి కేటిల్‌పారంలా వుండే గొడ్డు గోదానంతా మద్రాసుకి సాగిచ్చిరి. అందాతలికే ఏమాయెనో మన ఓసూరు లేకుండానే ఆంధ్రరాష్ట్రము వచ్చిడిసె.'రాజాజి చావాల... ఓసూరు ఆంధ్రాలా చేరాల' అని ఓసూరు వీదుల్లా పెద్ద పెద్ద అక్షరాలు రాసి కొందరు తిరగా గలాటాలు సురువుచేసిరి.

అబుడు సర్కారోళ్లు పటాస్కర్ కమిషన్ వేసిరి. వాళ్లు కొన్నాళ్లకి తమ రిపోర్టును సర్కారుకి ఇచ్చిరి. దాంట్లో, ఓసూరులా శానా పెద్ద గుంపుగా తెలుగువాళ్లు, ఆమీట కన్నడమువాళ్లు, కడగా తమిళులు వుండారు. ఇది మూడు బాసలు వుండే తావు, అని వుండే విషయాన్ని చెప్పకుండా ఏదేదో చెప్పిరి. ఆమీట సర్కారోళ్లు మెల్లిమెల్లిగా తెలుగు ఆర్భాటాన్ని అణచిరి" కాకన్న తాత బాధగా అనె.

కాకన్న బాధని చూసి ఎండలకి కూడా బాగా మండినట్లుంది. బండలు పగిలే మాదిరిగా ఎండలు కాస్తా వుండాయి. నా ఒంట్లోనింకా చెమట చుక్కలు కారి నేలని నానపతా వుండాయి.

"నీ తావు గురించి అసలు విషయము ఏమని ఇపుడు తెలిసెనా ప్పా" గుట్టన్న అంటా వుండాడు.

"ఆంధ్రరాష్ట్రము వచ్చినపుడు మిగిలిన మద్రాసు రాష్ట్రములా, అదే ఇబుడు తమిళనాడులా వెయ్యారు తెలుగు ఇస్కూళ్లు వుండె. ఇబుడయి నూర్లకి దిగిండాయి. ఆంధ్రాలా తెలుగుని ఇంగ్లీషు మింగతా వుంటే, బయట వుండే తెలుగు తావుల్లాని తెలుగుని తమిళము, కన్నడము, మరాటి, ఒరియా బాసలు మింగేస్తా వుండాయి. అది

తెలుసుకోప్పా" అని చెట్టు నా చెవిలా చెప్పతా వుంది.

"తేటతెలుగు మాటలు అంటే మాకు చానా ఇష్టము. దాన్నింకానే మేమూ ఇంతకాలం పలికితిమి. మా బిడ్డలు కూడా అదే చేస్తారు. కాని మీరేల ఇట్ల చేసిరి. మీ బిడ్డలు ఏల తెలుగు బాసకి దూరమైరి" గువ్వమ్మలు గూటిపైనింకా అంటా వుండాయి.

వాళ్లు అనేదంతా నేను వింటా వుండాను. ఇంగా ఎంత వినాల్సి వుందో. ఈ కండ్లలా ఎంత చూడాల్సి వుందో. యోచన చేస్తా వుండా... ఆ యోచనలా అమ్మ గేణానికి వచ్చె.

"మాపుసారి వచ్చేతబుడు చేనుతాకి పోయి కట్టెలు తేప్పా" అని అమ్మ చెప్పిన మాట అట్లే తట్టె. ఇదే మాట కాకన్న తాతకి చెప్పి, నేను చేను తాకి పోతావుండా...

"బూలోకములా మనిషిగా పుట్టినంక వాని బాస వాడు చదవతా, వాని పని వాడు చేస్తా, వాని బతుకు వాడు బతికేకి అయ్యే లేదా? ఏలిట్ల, ఏడ తప్పు జరిగె, ఎవరు తప్పు చేసిరి, ఎవరో... ఏడో.. చేసిన తప్పుకి మాకు శిక్షనా? మాకు బాధలా" అనుకొంటా కట్టెలు ఏరి మోపు కడతా వుండా.

"తాయప్ప మాస్టర్నే కాదు, ఇంగా చానా జనము మాస్టర్లని, తెలుగు సంఘమోళ్లని జైలులా పెట్టి పోలీసులు బాగా కొట్టిండారంట, ఇది చానా అన్యాయమని వీళ్లంతా చేరి ఆంధ్రా సి.యం. తావుకి పోయి మా పరంగా ఒగ మాట మాట్లాడండ అని అనిరంట. దానికి ఆ పెద్దమనిషి మీరు తమిళనాడులా చేరిపోతిరి, అట్లాతబుడు మీరే అన్ని సరుసుకొని పోవాల, అది తెలుసుకోకుండా ఈడికి ఎగేసుకొని వస్తిరా, అని ఉమిసెనంటా, మనోళ్లకి పోలీసులు కొట్టిన వేటుల కన్నా ఆయప్ప మాటలు చానా జోరుగా తగిలి తలతిరిగెనంటా" అని పెద్దోళ్లు మానునీడలా మాట్లాడతా వుండారు. వాళ్ల మాటలు వింటానే నాకు అదో మాదిరిగా అయిపోయె. ఉసూరని ఆడే రవంతసేపు కూకొనేస్తిని.

"శ్రీలంక తమిళుల గురించి, మన దేశంలాని, దేశాను దేశాలలాని తమిళుల గురించి తమిళసర్కారు కేంద్రసర్కారుని మూడు చెరువుల నీళ్లు తాపతా వుందే, అట్లాతబుడు తెలుగుసర్కారు మా గురించి ఒగ మాట మాట్లాడేకి ఏల కాలే" అంటా గోపన్న అనిన మాటల్ని గేణము చేస్తా కాకమ్మ పక్క చూస్తిని.

"ఒగ్గట్టు లేని జాతిరా మీది, మీ జాతికి నా జూటీ కొట్టా" అంటా నన్ని ఉమిసె.

మొదలే సుస్తు అయింటిని. ఆయమ్మ అట్ల ఉమిసేతలికి కళతప్పి కిందకి పడిపోతిని.

"ఉండావా... పోయేసిండావారా" అంటా చీమక్క దోమక్క వచ్చి నన్ని కరిచిరి. అబుడు నేను కండ్లు తీస్తిని. మెల్లిగా లేచి కట్టెల మోపును తలపైన పెట్టుకొని ఇంటిదావ పడితిని.

"చింతలేని బతుకునా జీవాలది" ఆవుల్ని అదిలిస్తా మీసాల మామ అంటా వుండాడు.

"బూలోకములా చింత చేసే జీవి మనిషి ఒగడే. ఆ చింతే మనిషిని జీవాలనింకా తనీ (వేరు) చేసె" బోగొప్పగా బెగ్గిలన్న అనె.

"ఊ... ఊ.. ఆ చింతే మనిషిని మనిషిగా చూడకుండా చేసె. కులమతాలు పుట్టిచ్చి కొట్టుకొని చచ్చే మాదిరిగా చేసె" మేకల్ని తోలతా కిట్టన్న అనె.

"ఏలిట్ల చింతన చేసిరి, ఎవరీ చింతన చేసిరి" సీరామన్న అడిగె.

"ఒళ్లు వూనము కాకుండా బతికేకి, ఓసిగా (ఊరకే) నక్కేకి, కొందరు నాయాళ్లు కలిసి ఇట్లా చింత చేసిరి" సాకన్న చెప్పె.

"సత్యమైన మాట చెప్పితివినా... ఈ గుట్టు తెలీక, తెలిసినా తెలియనట్ల జనం నాటకం ఆడతా వుండారు" గట్టిగా అనె బొట్టన్న.

"ఈ బూలోకములా మనిషి మనిషిగా బతకాలంటే ఇంగెందరు చావాల? ఇంగేమి చేయాల?" గుండప్ప గంట కొట్టినట్ల అంటా వుండాడు.

గుండప్ప దణిని (ధ్వని) రంగన్న విననట్ల వుండాడు. "చింతా చేసిన ఇబుడే సిద్ధించు పరమపదవి" అని అంటా వుండాడు. అందరు అనిన మాటల్ని వినుకొంటా కట్టెలమోపు తెచ్చి జగిలిమింద వేస్తిని. యోచన పైన యోచన చేస్తా గుడితాకి పోయి మెట్లమింద కూకొంటిని.

"ఆ ఇస్కూలు, తెలుగు ఇస్కూలు. కోదండరామయ్య కాలములా కట్టింది. ఆ మేస్టరు, ఈ మేస్టరుకే కాదు మన తావులా చానా తెలుగు మేస్టర్లకి గవర్నమెంటు ఉద్యోగాలు వచ్చింది అబుడే. అంతేల, ఈ పొద్దు మన తావు రైతులు నీళ్లకి కొదవ లేకుండా పంటలు పండిస్తా వుండారంటే దానికి కారణము కోదండరామయ్య. కెలవరిపల్లి డ్యాం కట్టింది ఆయప్ప కాలములనే. ఓసూరులోని ఆంధ్ర సాంస్కృతిక భవనాన్ని కట్టించింది ఆయప్పే" అంటా గొప్పగా చెప్పతా వుండాడు చూడన్న.

''రాయలను ఆశ్రయించిన తొలి తెలుగుకవి ఎవరు? కృష్ణదేవరాయల కుటుంబము, మహాత్మాగాంధీ ఈ బుక్కులన్నీ ఆయప్ప రాసిండె. అంతేకాదు రాయల యుద్ధవిజయము, పరిపాలన, సాహిత్యపోషణ, వంశము, భక్తి, దేవాలయ కైంకర్యాలు, జానకీపతి శతకము, అచ్యుతరాయ శతకాలు రాసిండె. కాని ఆయన పోయినంక అవి బుక్కులుగా లెక్కకి రాలే" బాదపడతా అనె కెంపన్న.

"ఓసూరు తావు ఆంధ్రాలా చేరాలని కంకణము కట్టుకొని తిరిగి, ఈ సమాచారాన్ని ఆంధ్రా పెద్దలతావ చెప్పి చానా తిరిగె. చానా బాదపడె. కాని తమిళనాడులానే నిలచిపోయె మన ఓసూరు. అట్లా తబుడు తను చేస్తా వుండిన సర్కారిమేస్టరు పనికి రాజీనామా ఇచ్చి మన తావునింకా ఎమ్మెల్యేగా నిలచి గెలచి అబుటి తమిళనాడు చట్టసభలా తెలుగువాణిని వినిపించి తెలుగు కోసరము పాటుపడె, ఆంధ్రాలా వావిలాల గోపాలయ్యకి మన కోదండరామయ్యకి చానా బందముంది. అది ఏమప్పా అంటే బాసాబందము, బాసాసేవ, నిండుతనము, నిరాడంబరము... ఇది మన అందరికి ఆదర్శమే.

ఈ ఆదర్శమే మన ఎమ్మెల్యే వెంకటసామన్నని తమిళనాడు చట్టసభలా తెలుగుమాట వినిపించే మాదిరి చేసె. మన తావు ఇంగో ఎమ్మెల్యే రాజారెడ్డిగారిని తెలుగుదండోరా వేపిచ్చి, తెలుగుకు జై కొట్టేలా చేసె. అట్లే ఆమీట ఎమ్మెల్యే అయిన గోపీనాథ్ ను తమిళనాడు చట్టసభలా తెలుగుతల్లి మీద ప్రమాణం చేసి చరిత్రకి ఎక్కే మాదిరిగా చేసె. ఇదే అభిమానమే ఎందరో తెలుగు అభిమానుల్ని తయారు చేసి ఇబుడికీ ఈడ తెలుగుకు జై కొట్టే మాదిరిగా చేసె" అని వీరముగా లేచె ఈరన్న.

అబ్బబ్బ ఎట్లా వాడప్ప మా కోదండరామయ్య. అందరూ కాలములా కలిసిపోతారు. ఈయన ఏమప్పా కాలమునే తనదిగా చేసుకొనిండాడు. "అది కోదండరామయ్య కాలము" అని జనం అంటా వుండారే. ఎట్లా ఘనమైన బతుకు ఆయనది. బతుకంటే ఇది కదా...

కుక్కా బతుకుతుంది, నక్కా బతుకుతుంది. మనిషీ బతుకుతాడు. ఏమి ఫలము. వీడు ఎబుడు చస్తాడ్రా అని అనిపించుకొని బతికేది ఏమిటికి? అది ఒగ బతుకేనా... ఇట్లా వాళ్లు బతికేది ఏమిటికి.. గతికేది ఏమిటికి.. యోచన చేయండ.

"మండలి వెంకట కృష్ణారావుగారు మొదటి తెలుగు ప్రపంచ మహాసభల్ని ఏర్పాటు చేసింటే దాంట్లో కలుసుకొనె. 1984 జూన్ 4న హైదరాబాద్ కార్యాలయములా ఫోను ఎత్తుకొని "తెలుగు.. తెలుగు" అనే మాట అంటా కోదండరామయ్య కన్నుమూసిరంట. వేలవేల తెలుగుజనం మనతావు తెలుగుజనం చేరి ఓసూరులా మన్ను చేసిరంట. మన్నులా నింకా వచ్చిన మనిషి తిరగా మన్నులాకే చేరిపాయె". బోబుద్ధి వుండేవోళ్లు, బుద్ధిలేని వాళ్ల మాటలు వినుకొని ఒగొగ మెట్టు గుడిమెట్టు దిగతా ఇంట్లోకి పోతిని.

ఇంగా ఎక్కాల్సిన మెట్లు ఎన్నుండాయో!నక్కాల్సింది (తినాల్సింది) ఎంతుందో! పెద్దోళ్లు చెప్పేది, చిన్నోళ్లు చేసేది. మంచి విన్నపము, చెడ్డ బుద్ధి, ఇస్కూలు పాఠాలు, వీది గుణపాటాలు, నన్ను సాకిన బావురపిల్లి, బాలాబిక్షం పెట్టిన పులి, కతలు చెప్పిన శెనిగి నక్క, వెతలు విన్న బుడిగి నక్క, కష్టం విలువ కొలిచిన కాకన్న, నష్టం విలువ తనలా నింపుకొన్న నాగన్న, కాసుల వేటని... కసాయి మాటని, వింటా నేను, కంటా నేను, కాలంలా కలిసి కదలి పోతావుండాను. అబుడు నన్ను చూసి నగి (నవ్వి) రమ్మని పిలిచె ఇస్కూలు, సర్కారి ఇస్కూలు. రామ్‌ప్రకాష్ విజయలక్ష్మి హైయర్ సెకండరి ఇస్కూలు ఈ ఇస్కూలులా పదోక్లాసు నాది.

ఇస్కూలు బయట లోపల తెలుగు వినబడతా, కనబడతా వుంది. పచ్చని తెలుగుతోటలా మా ఇస్కూలు, తోట చుట్టూరా తన గమ్ములని గుమ్మరిస్తా నిలచిండే కన్నడమ్మ. తోటలా ఆడాడ అరవ మొలకలు.

అయితే ఏమి? తోట మాదే. తోట అంతా మేమే. మాదే పెద్ద గుంపు. పదో క్లాసులా నాది ఆ పొద్దు మొదలు దినము. ఇస్కూలు బెల్లు కొడతానే పోయి గ్రౌండ్లా నిలుచుకుంటిని.

"ఎవ్వని చే జనించు..." తెలుగుతల్లి ప్రార్థన పాడినంక "నీరారుం కడలుడుత్త" తమిళతల్లి ప్రార్థన పాడినంక క్లాసుకి పోతిని.

మొదలు పిరియడ్ తెలుగు. చంద్రశేకర మాస్టరు వచ్చి తెలుగు పద్యము రాగము తీస్తా వుంటే.. మేమంతా కిసిక్ మిసిక్ (సైలెంట్‌గా) అనుకుండా వింటిమి. తెలుగుపద్యము గనత కనుగొంటిమి.

మా ఓసూరు తావులా ఊరికొగరు పద్యాలు రాసేవాళ్లు వీదికొగరు పద్యాలు పాడేవాళ్లు వుండారు.

నేను పెద్దవాడుగా అవుతా వుండాను.

మా ఓసూరు పెద్దదవుతా వుంది.

ప్యాక్టరీలకని చేనులిచ్చిన మాతావు రైతులు మాత్రం దినదినానికి చిన్నోళ్లై పోతావుండారు.

పాలు అమ్మతా ఒగరు. కూరాకు అమ్ముతా ఇంగొగరు. ఒగనాడు వూరిని సాకిన రైతులు, దేశానికి అన్నం పెట్టిన రైతులు. ఇబుడు అన్నానికి అలస్తా వుండారు.

ప్యాక్టరీలకి పనికి వచ్చిన దిగువసీమ వాళ్లు పెద్దోళ్లై దర్జాగా గాడీల్లా (టూ వీలర్స్) తిరగతా వుండారు.

ఇది కాలానికి తగినట్ల కోలాట కాదు. కాలంలా ఇదే కాలంలా మా కాలంలానే కుతంత్రాలు పన్నిన కొందరు కంత్రీల ఆట ఇది.

"రేయ్ చిన్నా ఈ తమిళాయమ్మ ఏమో అడగతా వుంది, నువ్వు వచ్చి అర్థం చెప్పు" అమ్మ అంటా వుంది.

ప్యాక్టరీలలా పనిచేసేకి వచ్చిండే తమిళులు మా వూరి చుట్టూ ఇండ్లలా బాడిగకు దిగిండారు. కొందరు చిల్లర అంగళ్లు పెట్టిండారు.

మా ఇంట్లో తమిళము మాట్లాడేకి ఎవరికీ వచ్చేలేదు. నేను పదోతరగతి చదవతా వుండా పెద్ద ఇస్కూలులా. దాన్నింకా నాకు తమిళము వస్తుందని అమ్మకి నమ్మకము.

ఎట్లో బాదపడి ఆయమ్మ కందిబ్యాళ్లు అడగతా వుందని అమ్మకి చెప్పితిని కాని నాకు మాత్రం తమిళం ఏం తెలుసు? ఎట్ల తెలుసు?

ఇంట్లో మాట్లాడేది తెలుగు, వీదిలా మాట్లాడేది తెలుగు, ఆడేది తెలుగు ఆట, పాడేది తెలుగు పాట, చూసేది తెలుగు సినిమా.

మా ఇంటి పక్కలా తమిళాయన చిల్లర అంగడి పెట్టిండాడు. ఆయప్పకి సరుకుల పేర్లు తెలుగుపేర్లు నేర్పేకి పోయి నేను తమిళం నేర్చుకొంటిని. కాని ఆ అప్ప ఒక తెలుగుమాటనూ నేర్చుకోలే. వాడు గుగ్గు నేను గొప్ప అని ఆపొద్దు అనుకొంటిని. వాడు కాదు నేను గుగ్గు అని తెలుసుకొనేకి నాకు చాన్నాళ్లు కాలే.

ఆపొద్దు మట్టమద్దేనము మబ్బులు ముసురుకొనిండాయి. ఆకాశములా పొద్దప్పని జాడ కానము (లేదు). పడీపడనట్ల వానచినుకులు. మమ్మలందర్ని కలస్తా కలపతా చల్లనిగాలి. గాలికి లేనిది, ఎండకు లేనిది, నేలకి, నిప్పుకి లేనిది మనిషికి మాత్రమే వుండేది, అదేమని మీకందరికీ తెలుసు కదా! అది మా క్లాసులా కొందరి చిన్నోళ్లకి చానానే వుందని ఈ నడమే నాకు తెలుస్తా వుంది. అబుడు కిష్ణారెడ్డి మాస్టరు చరిత్రపాటము చెప్పేకి క్లాసులాకి వచ్చిరి.

"ఈ పొద్దు నేను పాఠాలు చెప్పేలే. మీరే మీ మనసుని కదలించిన లేదా మీరు దిగులు (భయం) పడిన విషయము గురించి నాలుగు మాటలు రాయండా" అనిరి.

మేమంతా పెన్ను పేపరు ఎత్తుకొని రాసి, ఒగొగరే మేము రాసింది చదవతా వుండాము.

మల్లిగాడు వచ్చి తాను రాసింది చదివె.

"నేను మొన్న మన ఓసూరు బస్టాండులా బస్సుకని నిలుచుకొని వుంటిని. అదెబుడు వచ్చేసెనో పెద్దపులి వచ్చి నా పక్కలా నిలుచుకొని వుండె. దాన్ని చూసి నాకు దిగులాయె".

"ఆహా! ఏమి రాస్తివిరా, ఓసూరు బస్టాండు, ముందర మాదిరిగానా వుంది. ఎబుడు చూసినా వేయారుమంది జనం నూరారూ బస్సులు నిండిపోయి వుంటుంది. అట్లా జాగాకి వచ్చిన పులి నిన్ను కరిచి నోట్లో వేసుకోకుండా నిన్నే చూస్తా వుందా. అయినా ఇపుడు అడవుల్లానే పులులు లేవు కదరా, అట్లాతబుడు అదెట్ల ఆడికి వచ్చె. నీ రాతని చూస్తే నాకు నగువస్తుందిరా" అంటా నగిరి సారు.

మేము అంతా నగినగి పెట్టేస్తిమి. అందాతలికే పీను (ప్యూన్) ఒగ పేపరుకట్ట తెచ్చి మాస్టరికి ఇచ్చిరి.

"వచ్చే ఆయితారము మన ఆంధ్ర సాంస్కృతిక సమితిలా శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేకము జరుగుతుందంటా, అందరు పొండా" అని చెప్పి పోయిరి సారు.

ఆయితారము పొద్దినే నేను నా సావాసగాళ్ల జతలా సమితికి పోతిని. ఓసూరుకి గుండెకాయ అట్లా జాగాలా వుంటుంది సమితి భవనము. సమితికి పోయే దోవ పొడువునా బేనర్లు కట్టిండారు.



కోదండరామయ్య కాలము నింకా, ఈపొద్దు వరకు తెలుగు కళలకి, నాటకాలకి, కతలకి, కవితలకి, పాటలకి, పద్యాలకి తెలుగు ఉద్యమాలకి ఇది పుట్టినిల్లుగా వుంది.

సమితి గేటు దాటి లోవలికి పోతిని. అబిటికే ఆడ కోదండరామయ్య విగ్రహానికి పెద్దోళ్లు పువ్వులు వేసి మొక్కుతా వుండారు. నేనూ అట్లే చేసి హాలులాకి పోతిని. జనం నిండిపోయి వుండారు.

శ్రీకృష్ణదేవరాయలుగా బాగలూరు బాలక్రిష్ణప్పగారు, అల్లసాని పెద్దనగా కలువకుంట నారాయణ పిళ్లెగారు, రామరాజు భూషణుడుగా నాగప్రసాద్ మేస్టరు, దూర్జటిగా అలసపల్లి చంద్రారెడ్డి, అయ్యల రాజు రామబద్రుడుగా సత్యనారాయణా చారి, మాదయ్యగారి మల్లనగా బారందూరు ఎస్.టి.రాజు మేస్టరు, పింగళి సూరనగా పాతమత్తిగిరి సుబ్రమణ్యం, రామకృష్ణ కవిగా దేవిశెట్టిపల్లి మునిరాజు గార్లు వేషాలు వేసిండారు.

సమితి అధ్యక్షులు లక్ష్మీనారాయణయ్య మరియు కార్యదర్శి అన్నయప్ప మేస్టరు వేదిక మీదకి వచ్చి శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేకాన్ని దీపము వెలిగించి ఆరంబము చేసిరి.

ఒగొగ ఘట్టాన్ని రక్తి కట్టిస్తా వాళ్లు పద్యాలు పాడతా మాటలు మాట్లాడతా వుంటే చూసే కండ్లకి వినే చెవులకి ఈ జన్మకిది చాలు అనిపిచ్చె.

ఆమీట రవంతసేపు తెలుగు సంఘము వాళ్లు అదే వేదిక మీద మీటింగు పెట్టిరి.

"తెలుగుమేస్టర్ల పోస్టులు బర్తీ చేస్తా లేరు" ముగళూరు రామస్వామిరెడ్డి గారు మాట్లాడిరి.

"బస్సుల్లా, బస్టాండుల్లా, తెలుగుపేర్లు తుడిచి తమిళపేర్లు రాస్తా వుండారు. దీన్ని ఖండించి వచ్చే శుక్రవారము నాడు పోరాటము చేయాల, మీరంతా తప్పకుండా రావాల" అగ్గొండపల్లి సత్యనారాయణ రెడ్డిగారు చెప్పిరి. తెలుగుబాస తొందర్లే కాదు రైతుల తొందర్ల గురించి వడ్డపల్లి చిన్నగుట్టప్పగారు మాట్లాడిరి. కిష్ణగిరి జిల్లా తెలుగు రచయితల సంఘము నింకా మాట్లాడిన అగ్గరారం నారాయణన్న మాటలు జోరుగా వినబడతా వుంటే నాగొండపల్లి కిష్ణన్న మాటలు చిన్నగా వినబడతా వుండాయి.

మాటలు ఎట్ల వినబడినా దాని భావము మాత్రము ఒగటే. తెలుగుకు అన్యాయం జరగతా వుంది దాన్ని ఎదురించి పోరాడాల, మనము అనుకొనింది సాదీయాలనేదే అందరి మాట.

"ఇటు చూసినా తెలుగే అటు చూసినా తెలుగే ఎటు చూసినా తెలుగే... తెలుగు వినబడాల... తెలుగు కనబడాల... జోరుగా కిర్లతా తెలుగుసంఘమోళ్లు ఎం.జి. రోడ్డులా పోతా వుండారు. నేనూ నా సావాసగాళ్ల జతలా చేరి ఇంగా జోరుగా కిర్లతా పోతా వుండాను.

నేతాజిరోడ్డు దాటి ధర్మాసుపత్రి దాటి తాలూకా ఆఫీసు కంటా పోతిమి. ఆడ రవంతసేపు నిలిస్తిమి. తెలుగు సంఘమోళ్లు పై అధికారులకి వినతి పత్రాలు ఇచ్చిరి.

ఆమీట నెలకి ఆర్భాటము చేసిన ఫలితము అందరికి అందె. అంటే బస్సుల పైనా, బస్టాండులా తెలుగులా పేర్లు గవర్నమెంటు

వాళ్లు రాసిరి.

తెలుగుకోసం ఉద్యమించిన గడ్డ, తెలుగు ఉద్యమాల గడ్డ మా ఓసూరంటే అది అతిశయోక్తి కాదు.

నేను పదోక్లాసు ఫస్టుక్లాసులా పాసైంది మాత్రము మా వీది వాళ్లకి అతిశయోక్తి గానే వుంది. ఏలంటే నేను ఎబుడు చూసినా చేనుకి, చెట్టుకి తిరగతానే వుంటిని. ఇంగ ఇస్కూలుకి చక్కరు కొట్టి (దుమ్మా కొట్టి) తెలుగు పోరాటాలకి, తెలుగు సినిమాలు చూసేకి పోతా వున్నింది వాళ్లకి బాగా తెలుసు.

"పదిపనులు చేసేవాడు పదకొండో పని చేస్తాడు. నువ్వు సరిరా" అని రామన్న నన్ను మెచ్చుకొనె. అమ్మ నన్ను తబ్బుకొని చానా ఆనందము పడె.

వీళ్ల మెచ్చుకోలుని మెడమింద వేసుకొని పదకొండో క్లాసుకి చేరితిని. కానీ ఆడ అసలుకత సురువాయ. ఏలంటే పదికి పైన క్లాసులు తెలుగులా చదివేకి మాస్కూల్లాలే. దాన్నింక ఇంగ్లీషు మీడియంకి చేరిండాను. రెండేండ్లు ఇంగ్లీషు చదువుల్లా మునిగి తేలి కడకి పెయిలై ఇంట్లో సోడ మొకము పెడితిని.

"నువ్వు పెద్ద చదువులు చదివి ఉద్యోగము చేసి, మమ్మల్ని సాక్కుంటే పోనీ పోయి సేద్యమే చేయి పోప్పా" ఇంట్లో అబ్బా అమ్మా అంటా వుండారు.

చదువా, సేద్యమా నా ముందర రెండు విషయాలు వచ్చి నిలిచిండాయి. నేను అవిటిల్ని (వాటిని) చూసి అంటిని "సేద్యము చేస్తా చదువుతా..." అని. "అదీ చూస్తాము" అని అనె. చూడాల్సింది మీరు కాదు. నేనే మిమ్మల్ని చూస్తానని నా పని నేను చేస్తా పోతిని.

చేనుతావ కానతావ, ఇంట్లో, వీదిలా, బయిల్లా ఇట్ల ఏడపడితే ఆడ చదివితిని, కానీ నాకు ఆ ఇంగ్లీషు చదువులు బుర్రకి ఎక్కలే.

మనకి స్వాతంత్రము వచ్చి ఇన్నేండ్లు అయినా వాని బాస, వాని బతుకు, వాని బుద్దులు, సుద్దులు అంటేనే ఇష్టము. ఇది చాలదని వాని మతము వూర్లాచేరి వూరి అస్థిత్వాన్ని ప్రశ్నిస్తా వుంది. అంతా కర్మ కర్మ. ఈ బుక్కులు వొద్దు ఆ చదువు వొద్దు అని ఆ బుక్కుల్ని పారేస్తిని.

"ఆ బుక్కులు పారేస్తే పారేస్తివి కాని ఇందా" అంటా కొన్ని బుక్కులు నా చేతికి ఇచ్చె నా సావాసగాడు శివన్న. నా కండ్లని నేనే నమ్మలేదు. అవి పన్నెండోక్లాసు తెలుగు బుక్కులు.

"తిరుతణ్ణి జిల్లాలా మా సొంతమోళ్లు వుండారు. ఆడనింకా తెప్పిస్తిని, బాగా చదివి పరీక్షలు రాయిరా" అని చెప్పి పాయె.

ఆ ఏడాదే తెలుగులా పరీక్షలు రాస్తిని. పాసైతిని. కాలేజీకి చేరేదాంట్లో బెంగళూరు, సేలం, తిరుపతి ఇట్లా తిరగతా వుండా.

"రేయ్! నువ్వు ఇంగెట్లో కాలేజికి చేరతావు, తెలుగు మీటింగులకి, పోరాటాలకి వచ్చేకి అయ్యేలే. ఈపొద్దు మన ఆర్.వి.స్కూలు పెద్ద గ్రవుండలా ధర్మపురిజిల్లా తెలుగు మహాసభలు సురువు అవతా వుండాయి. సి.నా.రె. గారు, సినిమా యాక్టరు అక్కినేని నాగేశ్వరరావు గారు, రోజాగారు వస్తా వుండారంట పోదాము" అనె శివన్న. నేను సరే అంటిని.

మేము పోయేతలికే పెద్దగా వేసిండే స్టేజి ముందర సుమారుగా ఐదువేల జనం వుండారు. నా సావాసగాళ్లు కొత్తగొండపల్లి రాజగోపాల్, క్రిష్ణమూర్తి, వేణుగోపాల్, రవీంద్ర, మురళి, మురుగేష్, ఉమేశ్ రెడ్డి, మురుగేషన్‌ని కూడ ఆడ కలుసుకొంటిని.

ఆ మీటింగులా మాట్లాడిన అక్కినేనిగారు, సి.నా.రె.గారు "మీ తమిళనాడుని ఏలతా వుండే కరుణానిధిగారు మాకు బాగా తెలుసు. ఆయప్ప తావ మీ తొందర్లు చెప్పి అవి తీరుస్తాము" అనిరి. చప్పట్లు కొడతా మేమంతా పొంగిపోతిమి.

"కోదండరామయ్య కాలమునింకా ఆంధ్రానింకా ఎందరు మినిస్టర్లు, సినిమా వాళ్లురాలే. వచ్చినవాళ్లంతా ఇట్లే మాట్లాడిరి. అయినా మనకి చేసిందేమీ లేదు" వెంటుకలు నరసిండే తాత అంటావుండాడు.

(తరువాయి వచ్చే సంచికలో...)

---

**27వ పుట తరువాయి .......**

పరివర్తించాలన్నమాట. పై మచ్చులో ప్రతినిధి అలాంటి ముఖ్యమైన పదం.

1. to abbreviate (ప్రత్యాహారముగా కల్పించు) 2. to abdicate–పద (పదవీ) త్యాగము చేయు 3. to abet – నేఱము చేయుటకై సహాయము చేయు 4. to abridge – క్లుప్తముగా చేయు 5. to abrogate – చట్టమును/ శాసనమును/ నిబంధనను/ ఒప్పందమును రద్దుచేయు (పదం ముందు అ గానీ వి గానీ వాడండి) 6. to accelerate – వేగిరం చేయు, వేగవంతం చేయు, శీఘ్రతరం చేయు 7. acclimatize – ఒక వాతావరణానికి అలవాటు చేయు/ అలవాటుపడు 8. to accommodate – విడిది ఇచ్చు 9. to conceptualize – మనసులో ఒక పరిభావనని/ భావనని ఏర్పఱచుకొను 10. to complicate – సంక్లిష్టం చేయు 11. to condescend – ఇతరుల కంటే సర్వోత్తముడైనట్లు ప్రవర్తించు 12. to conscript – బలవంతంగా సైన్యంలో చేర్చుకొను, సైనికుడుగా చేసుకొను 13. to countersign – ఒకఱు ఇప్పటికే సంతకం చేసిన పత్రం మీద తాను మళ్లీ సంతకం చేయు (పదానికి ముందు ప్రతి అనే ఉపసర్గ చేర్చండి) 14. to debilitate – అశక్తం చేయు 15. to de-glacialize – హిమానీనదాలు లేకుండా చేయడం/ లేకుండా అవడం (అ–హిమానీ అనే పదాన్ని వాడండి)

ఈ క్రింది క్రియాధాతువులకి పదకుటుంబాల్ని నిష్పాదించండి:

1. వర్గీకరించు 2. సులభీకరించు 3. జటిలీకరించు 4. వలసీకరించు 5. పత్రీకరించు 6. విశదీకరించు 7. నిగూఢీ కరించు (to mystify) 8. వాహినీకరించు (to channelize) 9. నవలీకరించి (నవలగా వ్రాయు) 10. కవనీకరించు (ఒక ఆలోచనను కవిత్వంగా మార్చి చెప్పు) 11. తద్భవించు (సంస్కృతశబ్దం కాకపోయినా వినికిడికీ, వ్యాకరణ కార్యాలకీ ఆ విధంగా ప్రవర్తించు : ఉదాహరణకు సేకరణ అనే పదం) 12. వ్యాసీకరించు (ఒక ఆలోచనను వ్యాసరూపంలో రచించి వ్యక్తం చేయు) 13. చిత్రీకరించు (to shoot) 14. క్రియాపించు (క్రియగా మార్చి వ్యక్తం చేయు) 15. సమీకరించు 16. తరూకరించు (పూర్వం ఇది, ప్రస్తుతం ఇది, పరం ఇది అని ఒకదాని కింద ఒకటి సూచిస్తూ ఒక చెట్టులాంటి పటాన్ని గీచు) 17. తటస్థీకరించు (to neutralize) 18. ప్రతీకరించు (పగ తీర్చుకొను) 19. శుద్ధీకరించు (to purify) 20. పవిత్రీకరించు.

(తరువాయి వచ్చే సంచికలో...)

కన్నడ మూలం: డా.చంద్రప్ప సొబటి; తెలుగుసేత: రంగనాథ రామచంద్రరావు
90597 79289



# కొయ్యబొమ్మలాట కళాకారుడు గొంబెగౌడర రామనగౌడ ఆత్మకథ

**3**

### కిరాయిబండి చివరి ప్రయాణం

ఆ సంవత్సరం ఆటకు వచ్చిన సంభావన పెరిగింది.

అయితే నా బండి కిరాయి మాత్రం పెరగనేలేదు.

ఉద్దేశపూర్వకంగా పెంచలేదని కాదు. పెంచాలనే చర్చ మేళంలో జరిగింది. ఆటకు వస్తున్న సంభావన చూసి రోజు కిరాయి వంద రూపాయలు కావచ్చుని, కనీసం ఎనభై అయినా కావచ్చుని ఆశగా ఎదురుచూడసాగాను.

అయితే నా ఆశను షావుకారిగారి బస్సులు మింగేశాయి.

అప్పుడప్పుడే పల్లెపల్లెకూ షావుకారుగారి బస్సులు రావటం మొదలయ్యాయి.

మేళంవారు ఎద్దుల బండిలో కార్యక్రమాలకు వచ్చిపోవడం కన్నా బస్సులో వెళ్ళిరావటమే సౌకర్యంగా ఉంటుందని అన్నారు. ఎందుకంటే అప్పటికే మేళంలోని కొందరు సభ్యులు బస్సులలో వచ్చిపోయేవారు. దాంతో మేము ఏమీ మాట్లాడలేదు. మాట్లాడలేదని అనటంకన్నా మా నోట మాటలే రాలేదని చెప్పాలి.

నేను మౌనంగా నాన్న ముఖం చూశాను. ఏమైనా చెబుతారేమోనని ఎదురుచూశాను. ఆయన కూడా షావుకారు బస్సులో వెళ్ళిరావటమే మంచిదని అన్నారు. అది నాన్న నుంచి ఊహించిన జవాబే. అందువల్ల నాన్నపట్ల ఎలాంటి కోపం రాలేదు. నాన్న ఎన్నడూ స్వార్థంతో నిర్ణయాలు తీసుకున్నవారు కాదు.

కిరాయికి బండి వద్దన్న రోజున నేను శికారిపుర తాలూకాలోని ఓ గ్రామంలో ఉన్నాను.

ఉదయం ఆట కావటం వల్ల తొందరగా ముగిసింది.

ఎద్దుల బండిలో బొమ్మలు పెట్టెలను వేసుకున్నాను.

ఎన్నడూ భారంగా అనిపించని ఆ పెట్టెలు ఆ రోజు ఎందుకనో భారంగా అనిపించాయి.

వాటిని ఎత్తి బండిలో పెట్టడానికి మేళంవారి సహాయం తీసుకోవాలని అనిపించింది.

వాళ్ళవైపు చూశాను.

వాళ్ళంతా డబ్బులు పంచుకోవడంలో మునిగివున్నారు.

నేను ఆ రోజు కిరాయి విషయానికి పోనేలేదు.

రోజుకు యాభై, అరవై సంపాదించేవాడిని.

ఈ రోజ ముగిసిందికదా అని దుఃఖం కలుగుతోంది.

ఆగకుండా కన్నీళ్ళు బుగ్గల మీదుగా జారిపోతున్నాయి.

నా దుఃఖాన్ని ఎవరికీ చూపించుకోవాలని అనిపించలేదు.

ఆ దుఃఖంలో ఎద్దులబండి కట్టుకుని ఊరివైపు ప్రయాణమయ్యాను. ఇది కళా జీవితపు ఎద్దులబండి చివరి ప్రయాణమని దారిపొడుగునా అనిపించింది. నా అంతట నేను ఏడుస్తున్నాను. ఇది బండిలో నా వెనుక కూర్చున్న వారు అది గమనించలేదు. గమనించినా వారికి అర్థం కాలేదని అనుకుంటాను. బహుశా అందుకే నా సంకటం, దుఃఖంలో వాళ్లు భాగం వహించలేదు. నన్ను ఓదార్చటానికి ప్రయత్నించలేదు.

ఆ రోజు నేను దారిలో ఎద్దులను కొట్టలేదు.

కసరలేదు.

అదిలించలేదు.

బండి ఎప్పటిలా రోజుకన్నా కాస్త ఆలస్యంగా వచ్చి ఊరు చేరింది.

అవి తెల్లటి ఎద్దులు.

మా ఇంట్లో తెల్లఎద్దులనే బండికి కట్టాలనే నియమం ఉంది.

ఎద్దుల మెడలకు పెద్దపెద్ద కంచు బిళ్ళలున్న పట్టీలను అలంకారంగా కట్టాం.

మా బండి ఊళ్ళోకి వెళ్ళడమే ఒక వినోదం. బండి ఊళ్ళోకి వెళితే చాలు! జనం మా బండినే చూసేవారు. మేము ఎవరో పరిచయం చేసుకోవటానికి ముందే మా ఎద్దులబండి మా రాకను పరిచయం చేసేసేది. అలాంటి ఎద్దులకు ఒక్కోసారి మేత దొరికేదికాదు. ఊరి జనాన్ని అడిగితే తెలిసినవారు ఇచ్చేవారు. ఒక్కో ఊళ్ళో కుళ్ళిన, తడిసిన మేతను ఇచ్చేవారు. ఆ రోజున నాకు చాలా దుఃఖం కలిగేది. మేము భోంచేసి, వాటిని ఉపవాసం పెడుతున్నామని కుమిలిపోయేవాళ్ళం. పల్లెలలో కొంతమంది పోకిరీలు ఉంటారు. ఎద్దుల మెడలోని పట్టీలకున్న కంచు వస్తువులనురాళ్ళతో కొట్టడం, కంచు బిళ్ళలను విరగ్గొట్టడంలాంటి చిదుగుపనులు చేసేవారు. అప్పుడు చాల కోపం వచ్చేది.

గ్రామాలకు ఎద్దులబండిలో పోయి ఆట ప్రదర్శించటం ఎంతో సంబరంగా ఉండేది.

ఈ రోజు ఆ సంగతులను గుర్తుచేసుకుంటే ఎంతో దుఃఖం కలిగింది.

ఇంటికి రాగానే ఎద్దుల మెడలను కాడిమాను నుంచి విడిపించి, గాడిపాయ దగ్గర కట్టి మేత వేశాను.

కొద్దిసేపటి తరువాత వాటి ఒళ్ళు కడగటానికి పూనుకున్నాను.

రాయితో ఒళ్ళు రుద్దాను.

అప్పుడు దుఃఖం పొంగుకు వచ్చింది.




ఒక ఎద్దును కరుచుకుని ఏడ్చేశాను.

నా బాధ దానికి అర్థమైందేమో?

పెద్దముక్కుపుటాల నుంచి వేడి ఊర్పులను వదులుతూ నా ఒళ్ళు నాకింది.

అది 'నువ్వు ఏడ్వకు' అని ఓదార్చినట్టు అనిపించింది.

ఇన్ని సంవత్సరాలు నా కళా జీవితపు బండిని నడిపించినందుకు ఎద్దుల కాళ్ళకు సాష్టాంగ నమస్కారం చేశాను.

మరింత మేత వేసి, బండి నుంచి బొమ్మలు దించుతున్న అన్నదమ్ములకు సహాయం చేయడం కోసం బండివైపు భారమైన అడుగులు వేశాను.

### షావుకారు బస్సుల హమాలిగా...

1980 దశకంలో పల్లెపల్లెకూ షావుకారు బస్సులు వచ్చాయి.

అప్పుడు ఎద్దుల బండి వద్దన్నారు.

అయినా మేళంతోపాటు ఆట ప్రదర్శన కోసం పల్లెలకు వెళ్ళడం మానలేదు.

ఇలా వెళ్ళడం మొదలుపెట్టినపుడు జీతం ఏమీ ఇవ్వలేదు.

కేవలం భోజనం, చాయ్ ఖర్చులు చూసుకునేవారు.

అయ్యో, నువ్వు జీతం తీసుకునే కళాకరుడివి కావాలంటే ఇంకా చాలాకాలం పడుతుందని అనేవారు.

అలా పని చేయడం మొదలుపెట్టాను.

మూడునాలుగు రోజులు వెళ్ళివుండాలి.

అప్పుడు షావుకారు బస్సుల మీద బొమ్మల పెట్టెలు, 'అట్ట'కు (వేదికకు) కావలసిన సామానులను, వాయిద్యాలను బస్సుపైకి చేరవేసేటటువంటి– దించవలసినటువంటి పని; అలాగే బస్సు ఆగిన చోటి నుంచి ఆట ఆడించే స్థలానికి వీటన్నిటిని మోసుకెళ్ళే పని నాకు అప్పగించారు. ఆ పనికి రోజుకు 20 రూపాయలు కూలీ నిర్ణయించారు.

అప్పుడు సంతోషపడ్డాను. ఎద్దులు, బండి లేకుండానే ఇరవై రూపాయ సంపాదన అన్నది గొప్ప విషయంగా అనిపించింది.

ఆ నాటి కాలంలో షావుకారు బస్సులకు ఎవరైనా హమాలి పని చేయొచ్చు. ఇప్పుడు లేదనుకోండి. ఈ రోజు జనం అన్నిటిని తామే చేయాలంటారు. స్వార్థపూరితమైన బతుకు ఈనాటిది. ఈ స్వార్థం ఇంకొకరిని బతకడానికి వదలదు.

మా నాన్నగారి మేళంలో వయసు దాటిన కళాకారులు ఉండేవారు. ఒక విధంగా ఇది నాకు మంచే చేసింది. వయస్సు దాటినవారు ఉన్న కారణంగా హమాలి పని దొరికింది. ఆ పనిని చాలా సంతోషంతో చేస్తుండేవాడిని. గతంలో ఎద్దులబండిలో ఎత్తి పెడుతున్న బొమ్మల పెట్టెలను ఇప్పుడ బస్సు మీదికి ఎక్కించడం., దించడం ఆరంభించాను.

ఒకట్రెండు వారాలు కష్టమనిపించింది.

తరువాత అలవాటుపడ్డాను.

ఆ సందర్భంలో నేను చాలా శ్రమపడ్డాను. ఆ శ్రమ జీవితానికి అర్థాన్ని తెలిపింది.

కిరాయి బండి వద్దన్నప్పుడు ఆ సమయంలో నాకు ఏమనిపించిందో తెలియదు.

అయితే ఎందుకో మా కొయ్యబొమ్మ ఆటలు ఆడటం, ప్రదర్శించడం నేర్చుకోవాలని మనస్సులో దృఢంగా నిర్ణయించుకున్నాను.

పొలం దున్నేటప్పుడు, ఎద్దులను మేపుతున్నప్పుడు పాటలు పాడుతూ ఉండేవాడిని.

సాయంకాలం పొలం నుంచి బండి తోలుకుని ఇంటికి తిరిగొస్తున్నప్పుడు మరింత బిగ్గరగా పాటలు పాడుతుండేవాడిని.

పాటలు విసుగొస్తే కథ చెప్పేవాడిని.

నేల తల్లే వేదికగా, చెట్లు, చేమలు, పుట్టలు, పురుగులు ప్రేక్షకులుగా భావించి కథలు చెప్పేవాడిని.

కథ అంటే ఆ ఆటలో వచ్చే డైలాగ్స్ చెప్పేవాడిని.

ఖాళీగా ఉన్నప్పుడు 'అడుగులు' వేస్తూ పాటు పాడేవాడిని, డైలాగులు చెప్పేవాడిని. .

ఇంట్లోనూ అడుగులు వేస్తూ పాటలు పాడేవాడిని.

నేను అలా చేయడం చూసి మా తల్లితండ్రులు మురిసిపోయేవారు.

అదిచూసి నేను పదే పదే 'అడుగులు' వేసేవాడిని.

నేను అడుగులు తప్పుగా వేసినపుడు, నాన్న సరిదిద్దేవారు.

అంతేకాకుండా నాకు అర్థం కావటానికి నా చేయి పట్టుకుని నృత్యం చేస్తున్నట్టు 'అడుగులు' వేస్తూ చూపించేవారు.

నా ఆసక్తిని గమనించిన నాన్న ఈ మధ్యన ఆటలో నాకు చిన్నచిన్న పాత్రలు ఇవ్వడం మొదలుపెట్టాడు.

అందుకు పది, పదిహేను రూపాయలు సంభావనగా ఇవ్వసాగారు.

కూలీ డబ్బులు, ఆటకు వచ్చిన సంభావన కలిసి మొత్తం ముప్పయి నుంచి ముప్పయి అయిదు రూపాయల వరకు అందేవి.

అయినా నాకు ఎందుకో సంతృప్తి కలిగేది కాదు.

కారణం ఇతర కళాకారుల్లా నేను కూడా నూరు, నూటాయాభై తీసుకునే కళాకారుడిని కావాన్నదే నా పట్టుదల.

ఇది కళాకారులకు ఉన్న సహజమైన కోరిక అనుకుంటాను.

ప్రతిఒక్క ప్రతిభావంతుడు, బుద్ధివంతుడు అయిన కళాకారుడు మేళం సభ్యులతో సమాన స్థాయిలో బతకడానికే ఇష్టపడుతాడు. అది తప్పుకాదు. ఇతర కళాకారుల్లా అంటే ఉత్తమ కళకారుడు కావటానికి శ్రమించాలి.

శ్రమ పడకుండానే డబ్బు రావాలనుకోవటం తప్పు.

అలా డబ్బు తీసుకోవాలి అనుకోవటం తప్పు.

అలాంటి భావన కళాకారుడికి ఉండకూడదు!

**మేము పాపులం ...**

నాన్న నా కోసం చిన్నచిన్న పాత్రలు ఇస్తున్న సమయంలో హఠాత్తుగా ఇద్దరు కళాకారులు మా మేళం వదిలి వేరే మేళంలో చేరారు. ఎందుకు మేళం వదిలిపోయారో కారణం తెలియదు. అప్పుడు నాకు అంత అవగాహన లేదు. అవగాహనా శక్తి ఉన్నప్పటికి నాన్న ఉన్న కారణంగా నేను తెలుసుకోవటానికి ప్రయత్నించేవాడిని కాను.

అలా మేళం నుంచి బయటికి వెళ్ళిన మా అల్లుడు హనుమప్ప కూడా సొంతగా మరో మేళం కట్టుకున్నాడు.

ఇద్దరు కళాకారులు వెళ్ళిపోవటంతో మా మేళంలో సంఖ్య తగ్గిపోయింది.

ప్రజాభిమానం పొందిన ఒక మేళం హఠాత్తుగా ఆగిపోయిందంటే ఆ మేళం నాయకుడికి అది పెద్ద అవమానం. అలాంటి అవమానాన్ని ఆ సమయంలో మేము అనుభవించాము. చుట్టుపక్కలున్న గ్రామాల్లో చాలామంది కళాకారులున్నారు. అప్పట్లో కళాకారులకు కొరత లేకపోయినా, ఇంటిగౌరవం పొడవుతుందని, వంశగౌరవం పోతుందని నాన్న భోజనం చేయకుండా కూర్చున్నారు.

ఆయన మౌనాన్ని చూసి నేను, మా అన్న వీరన్న గౌడ 'మేము ఆట ఆడుతాం' అని ధైర్యం చెప్పాం. అయినా మా నాన్నకు సంతృప్తి కలగలేదు. ఎందుకంటే ఆయన స్థాయిలో కళా ప్రదర్శన చేయడం మా వల్ల కాదని ఆయనకు తెలుసు. మూడునాలుగు రోజులు ఆట ఆగిపోయింది. అంటే 'ఇళెవు' (తాంబూలం తీసుకోవటం) వదిలేశాం.

దీనివల్ల నాకు, మా అన్నయ్యకు బాధ కలిగింది. దాంతో మేము ఈ కళలో పూర్తిగా నిమగ్నమయ్యాం. ఆ సమయనికే ఆట గురించి మాకు తగినంత జ్ఞానం ఉంది. అదే పరిసరాల్లో పుట్టిపెరిగిన వాళ్ళం కావటం వల్ల, నేర్పించవలసిన అవసరం లేకపోయినా నాన్న అప్పుడు చిన్న ప్రమాణంలో తర్ఫీదు ఇచ్చారు. అంతేకాకుండా నాలుగైదేళ్ళ నుంచి నేను వారి వెంబడి వెళుతుండటం వల్ల వందలాది ప్రదర్శనలు చూశాను. చిన్నచిన్న పాత్రలు చేశాను. కథలు తెలుసు. డైలాగులూ చాలా వరకు గుర్తున్నాయి. కావల్సింది ధైర్యం. అభ్యాసం అంతే. ఇక మా అన్నయ్య ఎస్.ఎస్.ఎల్.సి. చదువుతున్నాడు. ఇలా చెబితే చాలు అలా పట్టేసేవాడు. కథ చెప్పటంలో మంచి నిపుణుడు అతను.

నాన్న అప్పుడు మరో ఇద్దరిని వెతికి ఖాయం చేసుకుని 'ఇళెవు' తీసుకుని ఆట ప్రదర్శించారు.

ఆ రోజు నాన్నతో కలిసి నేను, మా అన్నయ్య ఆట ప్రదర్శనలో పాల్గొన్నాం.

ముగ్గురూ కలిసి ఆట ఆడటం అదే మొదటిసారి. అప్పుడు మాకు డబ్బు రూపేన సంభావనలు బాగా వచ్చాయి.

సుమారు 3000 రూపాయలు వచ్చాయి.

నాన్న మా ఇద్దరిని దగ్గరగా కూర్చోబెట్టుకుని, "చూడు, నేనొక్కడిని ఆట ఆడితే 1000 రూపాయలు వచ్చేవి. దేవుడు ఎలా ఇచ్చాడో చూడండి. ఒక మేళంలో ఎవరైతే కలిసి కష్టపడుతారో వాళ్ళకు అంతే సుఖం లభిస్తుంది" అని అన్నారు.

నాన్న బతికి ఉన్నంత వరకూ ఈ తత్వాన్నే పాటిస్తూ వచ్చారు.

ఆ కారణంగానే మా నలుగురు అన్నదమ్ములను ఈ కళలో పాల్గొనేలా చేశారు.

చనిపోయే సమయంలోనూ "మీరు ఏ కారణంగానూ బొమ్మలు పంచుకోకండి" అని మా చేత ప్రమాణం చేయించుకున్నారు.

దాని అర్థం మేమందరం ఒకే 'అట్ట' (వేదిక) మీద ఆట ప్రదర్శించాలనే కోరిక ఆ ముసలాయనది.

మేము పాపాత్ములం.

నాన్న కోరికను సంపూర్ణంగా తీర్చడానికి మాకు సాధ్యం కాలేదు.

అందుకు నాన్నను ఇప్పటికీ క్షమాపణలు అడుగుతుంటాను.

'పెద్దల పండుగ' రోజునైతే నాన్న, నాన్న ఆట, నాన్నకు ఇచ్చిన మాట గుర్తుకొస్తాయి.

ఆ రోజు ఆయనను క్షమించమని మరీ మరీ వేడుకుంటాను.

(తరువాయి వచ్చే సంచికలో...)

బూర్ల వేంకటేశ్వర్లు
9491598040

# ఆపత్కాలపు కవిత్వచూపు

**ప**శ్చిమ ఆఫ్రికాలో 1981లో మొదలై ప్రపంచమంతా వ్యాపించిన HIV వైరస్ వలన మూడున్నర కోట్లమంది బలయ్యారు. 2009-10లలో వచ్చిన స్వైన్ ఫ్లూ మెక్సికోలో మొదలై ఐదు లక్షల మందిని పొట్టనబెట్టుకున్నది. 2015లో దోమల ద్వారా వచ్చిన జికా వైరస్ దక్షిణ, మధ్య అమెరికాలలో ఎంతో మంది జీవితాలపై ప్రభావం చూపింది. 2014-16లో వచ్చిన ఎబోలా వైరస్ పశ్చిమ ఆఫ్రికా గినియాలో మొదలై పదివేల మందికి పైగా బలి తీసుకున్నది. 2019లో మొదలైన కరోనా వైరస్ covid19 వలన, ప్రపంచ వ్యాప్తంగా కోటీ డెబ్బై నాలుగు లక్షల మందికి పైగా ప్రభావితులయ్యారు. సుమారు ఆరు లక్షల డెబ్బై ఐదు వేల మంది మరణించారు. భారతదేశంలో సుమారు పదిహేడు లక్షల మంది ప్రభావితులయ్యారు. ముప్పై ఆరువేల మందికి పైగా చనిపోయారు.

ప్రపంచ ప్రజలందరూ కరోనా వైరస్ వలన ప్రాణ భయంతో ఉన్నారు. రోజు రోజుకూ వైరస్ విస్తృతి వార్తలు వింటూ, దాని బారిన పడకుండా ఉండే జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సమాజంలోని పేద, ధనిక, వ్యాపార, మేధావి తదితర వర్గాలు భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నాయి. అయితే,మనుష్యులు కష్టాల్లో ఉన్నప్పుడు, ఆందోళన చెందుతున్నప్పుడు, వాళ్ళ బాధలను చూసినప్పుడు కవుల స్పందన ఎలా ఉన్నదో రేఖామాత్రంగాతెలపడం ఈ వ్యాసం ఉద్దేశ్యం.

11జూన్ 2020 నాటివాషింగ్టన్ పోస్ట్లో The poetry that speaks best to the pandemic అని జార్జ్ టౌన్ విశ్వవిద్యాలయం సహ ఆచార్యుడు సేత్ పెర్లో(Seth perlow) ఒక వ్యాసం రాశాడు. ఈయన "The poem Electric: Technology and the American Lyric" రచయిత. ఆయన ఏమంటాడంటే,"ఎప్పుడైనా భయానక పరిస్థితులు ఏర్పడితే నేను నా విద్యార్థులతో ప్రముఖ కవుల ఒక పోయెం పంచుకుంటాను". ఇది సెప్టెంబర్ 11 దాడుల తర్వాత నాకు అలవాటైంది అంటాడు. **అనుకోని సంఘటనలు జరిగి, భయానక పరిస్థితులు ఏర్పడినప్పుడు, కవుల సాంత్వన వాక్యాలు మనస్సుకు మందులాగా పనిచేస్తాయి. భయాందోళనలను తగ్గించి, ధైర్య విశ్వాసాలనిస్తాయి.** ఈ సందర్భంగా ఆయన ఉదాహరించిన W.H Auden రాసిన September 1, 1939 కవిత, W.S Merwin రాసిన Separation కవితలునాటి స్థితిని ప్రతిబింబిస్తాయి.

W.H Auden September 1, 1939 కవితలో "నేను భార్యకు నిజం చెప్తాను/ నేను నా పనిపై ఎక్కువ దృష్టి పెడతాను/ వారి నిర్బంధ ఆటను తిరిగి ప్రారంభించడానికి/ నిస్సహాయ గవర్నర్లు మేల్కొంటారు/ ఇప్పుడు/ఎవరు చెవిటి వారిని చేరుకోవచ్చు/ మూగవారి కోసం ఎవరు మాట్లాడగలరు?/ నా దగ్గర ఉన్నది స్వరంమాత్రమే/ ముడుచుకున్న అబద్ధాన్ని విడుదల చేయడానికి,

❖ ❖ ❖

ఆకలి ఎటువంటి ఎంపికను అనుమతించదు/పౌరుడికి లేదా పోలీసులకు/మనం ఒకరినొకరుప్రేమించుకోవాలి లేదా చనిపోవాలి"అంటాడు. ఆపత్కాలంలో సామాన్యులకోసం తన గొంతు నిచ్చి అబద్ధాన్ని విడుదల చేయిస్తానంటాడు. ఆకలి అందరికీ ఒక్కటేనని ఇప్పుడు అందరూ మానవీయ ప్రేమను ప్రకటించాలని అంటాడు.

W.S Merwin రాసిన Separation కవితలో"సూది బెజ్జంలోంచి దారం వెళ్ళినట్లుగా ఉంది నీవు లేని ఒంటరి తనం. ఇప్పుడు చేయగలిగిందల్లా నీ స్నేహపు రంగుల దారాలతో జ్ఞాపకాల్ని కుట్టుకోవడమే" అంటాడు.

వివిధ సందర్భాల్లో "ఒంటరితనం, ఓదార్పు, భౌతిక దూరం, గోడలమధ్యన జీవితం, ఆత్మీయులు లేకపోవడం, ఉన్నదంతా కోల్పోవడం'' లాంటి సమస్యలను పాశ్చాత్య కవులు గొప్ప అనుభూతితో చిత్రించారు. సాంఘిక జీవితం గురించి చాలా గొప్ప కవితలు రాశారు. మన సన్నిహిత సామాజిక క్షణాలలో కూడా దూరమనేది పాత్ర పోషిస్తుందని గుర్తించారు. మనం ఇతరులతో ఉన్నప్పుడు కూడా ఒంటరితనపు లోతైన భావాలు మనలో తలెత్తుతాయని గుర్తుచేస్తారు. కొన్నిసార్లు మన దగ్గరి సంబంధాలు గొప్ప దూరాలకు వంతెనగా ఉండవచ్చని అంటారు.

తెలుగులో ఆధునిక వచన కవిత్వంలో అనేక పార్శ్వాలున్నాయి. యుద్ధాలు జరిగినప్పుడు, తుపానులు ఉప్పెనలు ముంచెత్తినప్పుడు, భూకంపాలు సంభవించినప్పుడు – మానవీయ కోణంలో ఎన్నో కవితలు రాశారు తెలుగు కవులు. కొందరు ఆధునిక వచన కవులు రాసిన కవితా పాదాలు ఈనాటి సందర్భానికి సరిపోయేవి కనిపిస్తాయి. దేవరకొండ బాల గంగాధర తిలక్ రాసిన 'నగరంపై పీడనీడ' అనే అసంపూర్తి కవితలో "పవిత్రాగ్ని హోత్రాల వద్ద/ బజారులమ్మట రాజ ప్రాసాదాలవద్ద/ చేరిన యీ జనసందోహాన్ని చూడు ప్రభూ/ చిదిమితే పాల్గారే చిన్నారిబుగ్గలు/ ముక్కుతూ మూల్గుతూ ఉండే ముసళ్ళు/ మోహన యౌవన వనసుమాలు తరుణ వయస్కులు/ వీరందరినీ కనికరించు అవధరించు ప్రభూ/ ఈ నగరంపై ఏదో నల్లని పీడనీడ పడింది/ మృత్యువు తన భయంకర పాశాన్ని విసిరింది" అంటాడు. అందరికీ చిరపరిచితమైన శ్రీ శ్రీ బాటసారి కవిత కూడా బతుకుతెరువుకోసం పట్నానికి వచ్చిన వలస జీవి కష్టాన్ని వర్ణిస్తుంది. నిఖిలేశ్వర్ రాసిన 'విధ్వంస రాగం' కవితలో "మసిగా మిగిలిన శరీరాలపై/ పారుతున్న రక్తం మడుగులోంచి/ ఒక తల్లి చంకలో/ సిద్ధాంతాల గంట్లు పడని పసిపాప/ మంచీ చెడూ తెలియని మరో ఇద్దరు పిల్లలు/ నడుస్తున్న భయాక్రాంత విహ్వలమైన ముఖాలు/ ప్రతిఫలించిన పృథ్వీ నిర్మలత్వపు నిస్సహాయత" నేటి భయంకర కాలానికి సరిపోతాయి.

ఈనాటి విషమ పరిస్థితులకు కారణం ప్రకృతి విధ్వంసమే అని తలచినప్పుడు పాపినేని శివశంకర్ రాసిన 'ఆకుపచ్చని లోకంలో' కవితా వాక్యాలు సరిపోతాయి. "బహుశా ఒక స్వార్థాన్ని మోస్తూ మోస్తూ/ మనిషి నాగరికుడయ్యాడు/ స్వప్నం భగ్నమై దృశ్యం ధ్వంసమై/ మట్టితో తొలి రక్త బంధం తెగిపోయింది/ తనకీ తన చుట్టూ ఉన్నదానికి సామరస్యం తీరిపోయింది/ అసహజత్వం అమానవీకరణ/ సుడేసిన యంత్ర ధూమాల్లో మానవారణ్యాలు/ మానవారణ్యాల్లో ప్లాస్టిక్ చెట్లు/ లాభాల వేటలో పక్షీ పశువూ చెట్టూ చేమా అన్నీ పరాయివే/ చల్లని నీడలు కరిగిపోయాయి/ కిలకిలలూ కువకువలూ ఆవిరై/ నదులూ అంతర్నదులూ కలుషితాలై/ ఇప్పుడు ప్రకృతే మనిషికి ప్రథమ శత్రువు/ క్రౌర్యానికి రూపంలేదు-అది కనబడదు గాక కనబడదు/ నేల మూగది ఆక్రోశం వినబడదు గాక వినబడదు"

నేటి వలస కూలీల దుస్థితిలాంటిదే నీళ్ళకోసం వలసపోయిన వాళ్ళ స్థితి. నాళేశ్వరం శంకరంలోని 'వలస' కవితా వాక్యాలు నేటి సందర్భానికి చాలా దగ్గరగా ఉన్నాయి. "ఇప్పుడు తరలిపోతున్న వాణ్ణి చూస్తే/ దిగులుగా టెలిఫోన్ తీగ మీద ఏకాకిగా పాడుకునే పక్షి గీతంలా ఉంటుంది/ విసిగిపోయి తీరం చేరిన అలల నాదంలా ఉంటుంది/ పాకుతూ పరుగెత్తి పేలిన ఎయిరిండియా దిగులుగీతంలా ఉంటుంది/ భూమిని వదులుతున్నందుకు దిగులు/ పరిసరాలను వదులుతున్నందుకు దిగులు"

అయినవాళ్ళు ఐ.సి.యూలో ఉంటే ఎలా ఉంటుందో దేవీప్రియ 'నువ్వక్కడ నేనిక్కడ' కవితా వాక్యాలను చదివినప్పుడు తెలుస్తుంది. "నువ్వక్కడ ఐ.సి.యూలో/అకస్మాత్తుగా నువ్వు సృష్టించుకున్న నీ కొత్త ప్రపంచంలో/ నీకేమి జరుగుతున్నదో తెలియని స్థితిలో నువ్వు/ నేనిక్కడ సముద్రం మధ్య/ ఒంటి స్తంభం మేడవంటి ఈ నిశ్శబ్దపు గదిలో/ నాకేమి జరుగుతున్నదో అర్థం కాని దశలో నేను/ రెండు వెలుగులు ఉన్నట్టుండి/ రెండు చీకట్లుగా మారిపోయిన ఘోరం ఇది రాజీ" అని ఒంటరితనపు బాధను కవిత్వీకరించాడు.

ఒక మరణం సంభవిస్తే, మరణాన్ని చూసి నేర్చుకోవాల్సింది ఏముంటుందో జింబో రాసిన "ఒక మరణం తర్వాత" కవితలో కనిపిస్తుంది. ఏముంటుందీ/ఒక మరణం తర్వాత/కాస్త బూడిద కాసిన్ని అస్థికలు/ కొంత బాధ మరికొన్ని కన్నీళ్లు/ ఏమైపొయ్యాయి?/ పంటి బిగువున వున్న పట్టింపులు మన కోపాలు/ ఏం సాధించాం?/ మన దుఃఖానికి ఏమైనా విలువుందా?/ మరణం తర్వాత తెలిసిన విషయం ఒక్కటే/ ఒక విషయాన్ని అంగీకరించడం వెనక ఎంత ఘర్షణ వుంటుందోనన్న విషయం/ ఒక జీవితాన్ని చూసి ఎంత నేర్చుకోవచ్చో ఒక మరణాన్ని చూసి/ అంతకన్నా ఎక్కువ నేర్చుకోవచ్చన్న విషయం'' జీవితం సాధించిందేమిటో, కోల్పోయిందేమిటో మరణాన్ని చూసి నేర్చుకోవాలనడం ఒక తాత్వికత.

నెల్లుట్ల రమాదేవి రాసిన 'గుప్పెడు ఓదార్పు-గోరంత ప్రేమా' ఎంతో చక్కగా ఈనాటి పరిస్థితికి అద్దం పడుతోంది. "నిశ్శబ్దపు సాయంకాలపు దిగులు నీడల్ని/ సందడి స్నేహాలతో హ్రస్వం చేయాల్సిందే/ వ్యాధి నివారణ అసాధ్యమైతే/ వ్యధా నివారణ వృధా కానేరదు/ అనంత దూరాల నిరంతర ప్రయాణంలో/ ఇవాళ అతడూ రేపు మనమే కదా/ నిశ్చయంగా విషాదాంత నాటకమని తెల్సినా/ నిస్సహాయపు ప్రేక్షకులుగా మిగలకూడదు/ జనన మరణాల మధ్య సాగే జీవన ప్రయాణంలో/ అలసట తీర్చే ఆత్మీయ వృక్షాలమవుదాం/ కరిగిన హృదయం కార్చే కడలేని కన్నీటిని తుడిచే/ చేతివేళ్ళ స్పర్శలమవుదాం/ నిరాశతో క్రుంగి కృశించిన భుజాలపై ఓదార్పు పావురాలమవుదాం/ అవును నిజమే/ శాస్త్రం నిర్ధారిస్తుంది/ వైద్యం చికిత్సనిస్తుంది/ కానీ, ప్రేమ నయం చేస్తుంది కదా/ అందుకే గుప్పెడు ఓదార్పునూ/ గోరంత ప్రేమనూ ఇద్దాం" అని మానవీయ నైజాన్ని ప్రకటిస్తుంది.

ఆశారాజు రాసిన ఈ కవితా వాక్యాలు గొప్ప ఊరటనిస్తాయి. "ఒంటరితనం భయపెడితే/ మా ఇంటికిరా/ నడవలేక పడి ఉంటే/ నన్ను పిలువు/ ఇది సముద్రం మిత్రమా/ ఈదలేనపుడు/ నా చేయి పట్టుకో/ ఊపిరాడకపోతే/ నన్ను చుట్టుకో/ నేను మునిగిపోయినా/ నువ్వు ఒడ్డుకు చేరుతావు". ఎన్ని సమస్యల్లో ఉన్న వాడికైనా, ఎంత ఉత్పాతంలో కొట్టుకుపోయే మనిషికైనా ఈ కవితా వాక్యాలు,బతుకు మీద ఆశను చిగురింపజేస్తాయి.

ఇక ప్రస్తుత కరోనా సందర్భానికి వస్తే తెలుగులోనూ, ఇతర భాషల్లోనూ వివిధ మాధ్యమాల ద్వారా అనూహ్య స్పందన వచ్చింది. కవిత్వ ప్రక్రియలైన వచన కవిత, గేయం, పద్యం, నానీలు వంటి చాలా ప్రక్రియల్లోనూ సాహిత్యం వచ్చింది. అమితాబ్ బచ్చన్ మొదలుకొని ఎందరో సినిమా సెలబ్రిటీలు పాటల రూపంలో సందేశాలిచ్చారు. కొన్ని టీవీ చానళ్లు పాటలను, కవిత్వ కార్యక్రమాలను రూపొందించి చైతన్యపరిచాయి. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, కరోనాపై ఒక కవితను ఉదాహరించి తెలంగాణలోని కవులు విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ధైర్యాన్నిచ్చే కవితలు రాయాలని పిలుపునిచ్చారు.తోట సుభాషిణి సంకలనం చేసిన'క్రిమి సంహారం',బిల్ల మహేందర్ సంపాదకత్వంలో'వలస దుఃఖం', నల్లెల రాజయ్య సంపాదకత్వంలో 'దుఃఖ పాదం'పేరుతో కరోనా కవితా సంకలనాలు వెలువడ్డాయి. 'రిటన్ గిఫ్ట్ టు కరోనా' అని ఒక యూట్యూబ్ చానల్లో వందల సంఖ్యలో వీడియో కవితలను అప్లోడ్ చేశారు.

**వలస కూలీల దుఃఖం గురించి 'పిల్ల జెల్లా ఇంటికాడ ఎట్ల ఉండ్రో' అని తండ్లాడిన ఆదేశ్ రవి పాట గుండె గుండెనూ కలచివేసింది. అట్టడుగు బాధితుల గోసకు గొంతునిచ్చి, సరళమైన పదాలనుపయోగించి, ఇంత పెద్ద దేశంలోని విషాదాన్ని ఒక్క పాటలో పలికించిన ఆదేశ్ రవి బహుదా ప్రశంసనీయుడు.** ప్రఖ్యాత సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కూడా కరోనా కవితను గానం చేశారు.'వాళ్ళు ఇల్లు చేరాలి' అని గాజోజు నాగభూషణం రాసిన కవిత ఎంతోమందిని ఆలోచింపజేసింది. నెత్తురు పాదాలతో బయల్దేరిన వలస కూలీల దుస్థితిని హృద్యంగా పలికించిన పాదాలు చాలా మంది ప్రశంసలు పొందింది. అట్లాగే, రావులపాటి సీతారాం కవిత"ఎందుకు సీతక్కా.....ఎందుకే సీతక్కా......?" అంటూ సగటు మనుష్యుల క్రియా శూన్యతను, స్వార్థ పరత్వాన్నిబైటపెడుతూనే, మానవీయంగా ప్రవర్తించిన మనిషిని దేవుణ్ణి చేసి కీర్తించింది. 'నేటి మాట వినర సాటి మనిషి' అనే మకుటంతో డా. కోయి కోటేశ్వరరావు "కోవిడ్డూరం" శతకం రాశాడు.కరోనా కవిత్వం గురించి వ్యాసాలు కూడా వచ్చాయి.

తెలుగులో వస్తున్న ఈనాడు దిన పత్రిక నెలరోజుల పాటు కరోనాపై కదనం పేరుతో కవితల పోటీ నిర్వహించింది. ఈ పోటీలకు ముప్పై రోజులలో ఇరవై వేల కవితలు వచ్చాయి. కరోనా పరిణామాల గురించి,సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన వాళ్ళ దగ్గర నుండి ఇప్పుడిప్పుడే కవితాలోకంలోకి అడుగు పెట్టిన వాళ్ళు కూడా ఎన్నో కవితలు రాశారు.ఈ కవితల్లో ప్రధానంగా ఈ విపత్కర సమయంలో మానవత్వాన్ని ప్రదర్శించాలని, ఇంటా బయటా ఒక మానవీయ ప్రపంచాన్ని నిర్మించాలని చెప్పడం కనిపిస్తుంది. ప్రకృతి విధ్వంసం పట్ల ఆవేదన, కరోనా కష్ట కాలంలో ప్రాణాలను పణంగా పెట్టి సేవ చేస్తున్న వారిపట్ల కృతజ్ఞత చూపడం కనిపిస్తుంది. వలస కూలీల గురించి, వీధి వ్యాపారుల గురించి, కార్మికుల గురించి, రైతుల గురించి బాధపడడం కనిపిస్తుంది. ధైర్యంతో, ఆత్మ విశ్వాసంతో పరిస్థితులను ఎదుర్కొనే భరోసానివ్వడం కనిపిస్తుంది. అట్లాగే, ఆత్మ విమర్శ చేసుకొని ఇక నుంచైనా ఒక మార్పును ఆహ్వానించాలనే జ్ఞానోదయం కలిగినట్లు ప్రకటించడం కనిపిస్తున్నది. జాగ్రత్తలు చెప్పడం, ఉపదేశాలు ఇవ్వడం, సహాయకారులను మెచ్చుకోవడం ఇలా అనేక అంశాల మీద ఈ కవులు స్పందించారు.

కరణం కళ్యాణ్ కృష్ణకుమార్
9848428978

# ఊరొచ్చేస్తోంది...!



"ఓరేయ్ ఈరేశం.. కాస్త ఆగరా.. కాళ్ళు పీకుతున్నాయ్.. ఈ కొండరాయి మీద కూకుందాం" అంటూ రోడ్డు ప్రక్కన ఉన్న ఎత్తైన కొండరాయి మీద కూలబడ్డాడు రాధయ్య... "సరే ఈన్నే ఉండుమావా కొంచెం ముందుకెళ్ళి నీళ్ళేమన్నా దొరుకుతాయో సూసొస్తా"...అన్న ఈరేశం మాట పూర్తికాక ముందే... "వద్దులేరా..రెండు నిముసాలు కూలబడు.. ఎల్లిపోదాం" అన్నాడు రాధయ్య. పిడచ కట్టుకు పోయిన నాలికని తడపాలని, ఊరని లాలాజలం కోసం ఎండిన గొంతు చెలమలో ఆరాటపడుతున్న రాధయ్య చూపుకు వీరేశం చేతిలో నేల చూస్తున్న ఖాళీ సీసా వెక్కిరిస్తున్నట్లు కనిపించింది.

తలకీ మూతికీ కలిపి కట్టుకున్న తువ్వాలు తీసి చెమటలు కక్కుతున్నమొఖం తుడుచుకుంటూ ''ఎంత దూర మొచ్చుంటాంమావా, శానా ఊర్లు దాటినంగానీ మనూరిప్పుడల్లా వత్తదంటావా "అంటూనే చుట్టూ పరచుకున్న ఎర్రటి ఎండకు మెరుస్తున్న కొండలు , ఎండిన మట్టి పెళ్ళలూ , చూస్తూ దూరంగా రోడ్డుపై మోసం చేయాలని తపిస్తున్న ఎండమావుల్ని చూసి తనలో తానే నవ్వుకున్నాడు వీరేశం.

" ఏంటి ఈరేశం.. అట్టా నవ్వుతున్నావ్..." చేవ లేని ఆ నవ్వుని చూసి అడిగాడు రాధయ్య. "ఏంలేదు మావా ఇవన్నీ ఒకప్పుడు అడవులే అంటావా కంటిసూపు ఎంత సారించినా నీడిచ్చేసెట్టే లేకబాయే... మనం ఏడున్నాం మావా ఎడారిలో గాదుగదా!" వీరేశం అనుమానానికి రాధయ్య కూడా చుట్టూ చూసి తనలో తాను నవ్వుకుని సర్లే పద ఇలా కూర్సుంటూ పోతే రోజులెల్లిపోతాయ్... అని అప్పటికే చెమట తుడుచుకోవడానికి తీసిన తలపాగాని చుట్టుకుంటూ..కొసను మూతికి కూడా చుట్టుకుని వీరేశం వెనుకే కదిలాడు, ఎల్ల లేవో తెలియని అనంత ప్రయాణం కొనసాగింపుగా.

రాధయ్య, వీరేశంలు ఇద్దరూ ప్రకాశంజిల్లాలోని కరువు ప్రాంతమైన కనిగిరి సమీపంలోని పామూరుకు చెందిన రైతులు. రాధయ్యకు యాభై రెండేళ్ళుంటాయి. రాధయ్య అల్లుడే వీరేశం. వీరేశానికి ఇరవై ఏడేళ్ళుంటాయి. గ్రామంలో కరువు తాండవించడంతో నమ్ముకున్న భుమి కడుపు నింపడం లేదని ఏదో ఒకటి చేసి పట్నం వెళ్ళి బ్రహ్మాండంగా బ్రతకొచ్చని ఆశ మొలకెత్తి, భార్యా పిల్లలని సొంత వూర్లో వదిలేసి, హైదరాబాద్ వెళ్ళి బిల్డింగ్ వర్కర్స్‌గా పనిచేస్తున్నారు. అనుకోని పరిస్థితుల్లో మాయదారి రోగమేదో వచ్చిందని, పని లేక, పస్తులుండలేక సొంత వూరి బాటపట్టారు లక్షల్లో ఇద్దరై. ఏ ప్రకృతీ వారిని మెత్తగా పలకరించలేదు. ఏ పిల్లగాలీ వారి చెమటను తల్లి కొంగై తుడవలేదు. ఏ చినుకూ యాత్రికుడై తరలివస్తున్న వారి కోసం వారబోసి ముందరి నేల తడిపి స్వాగతం పలకలేదు. రోళ్ళు పగిలే రోహిణీ ఎండ .. పురి విప్పిన నెమలై నాట్యం చేస్తోంది. అయినా నడక.. నడక..నడక...ఎడతెగక సాగిపోతున్న వారెవ్వరినీ ధగధగమంటున్న ఎండ మాత్రం ఏం చేయలేక పోతోంది. వారి సహనం ముందు ప్రతి రోజూ ఓడిపోతూనే ఉంది. వారి కాలికింద అసహనంగా నలిగిపోతోంది. ఆ

సమయమంతా వారిద్దరికీ కనిపిస్తోంది ఒక్కటే... వారి గమ్యం సొంతూరి పొలిమేర.

"ఒరేయ్..ఈరేశం అదిగో దూరంగా ఏదో ఊరు కనిపిత్తాంది.. పొద్దు పొడుత్తాడంది.. ఆ ఊరెళ్ళి అడిగితే ఏ మంచి మనిషో మనకి సాయం చేయకపోడు. తినడానికి ఏం దొరక్క పోయినా కాసిని నీళ్లన్నా దొరికితే కాస్త సత్తా వత్తది. ఏ గుడికాణ్ణో పడుకుని పొద్దున్నే ఎలాదం" అన్నాడు రాధయ్య. "అట్నే మావా,...అటే ఎళ్దాం పదా".. అని అటుగా నడక మొదలెట్టాడు మామ రాధయ్యని అనుసరిస్తూ వీరేశం. నడిచి నడిచి చెప్పులు కరచి కాలిన బొబ్బల్లా మారిన పాదాలు పగిలి రక్తపుగూడు కట్టుకున్నాయి. అప్పటికే దాదాపూ రెండు వందల కిలోమీటర్లు వారం రోజులుగా నడుస్తున్న ఆ కాళ్ళు శ్రమని మరచిపోయాయ్.

కనిపించిన గ్రామంలోకి వెళ్దామనుకుంటే.. గ్రామం మొదల్లోనే పెద్ద ముళ్ల కంచె వేశారు.. ప్రపంచం నుంచి తనని తానే వెలేసుకున్న ఆ గ్రామ పొలిమేర చూసి బాధేసింది ఇద్దరికీ. అంతలో అక్కడ కాపలా ఉన్న పోలీసు కానిస్టేబుల్ "ఎవర్రా మీరు గ్రామంలోకి రావడానికి వీలులేదు వెళ్లండీ.. వెళ్ళండీ..." అని గదమాయించాడు.

"అయ్యా మంచినీళ్ళు కూడా దొరకలేదు పొద్దుటాల్నుంచి, కాస్త మంచిళ్ళు ఇప్పించండీ" అన్నాడు వీరేశం. ఏమనుకున్నాడో గానీ ఆ ఖాకీ దుస్తుల్లోని పెద్దమనిషి వెంటనే "నాకూ నీళ్ళు లేవయ్యా పొద్దున తెచ్చుకున్న నీళ్లూ అడుక్కు వచ్చినయ్.. ఓ పని చేయండి ఈ మూలాటంగా ఎళితే మంచి నీళ్ళ సెరువుంది.. అక్కడికెళ్ళి నీళ్ళు తెచ్చుకోండి" అని సలహా ఇచ్చాడు.. చెరువు అనగానే పని దగ్గర మినరల్ వాటర్ బబూల్స్ లోని నీళ్ళు తాగటం అలవాటైన ఇద్దరూ ఒకళ్ళ మొహం ఒకళ్ళు చూసుకున్నారు." ఏం కాదు సామీ .. అది మంచి నీటి చెరువే మా ఊరోళ్ళు బాగు చేసుకున్నారీ మధ్య ఎల్లండి, త్వరగా నీళ్ళు తీసుకుని వెళ్ళిపోండి" అన్నాడు.

కానిస్టేబుల్ చెప్పినట్లే.. కొద్ది దూరంలో ఉన్న చెరువు చూసి ఉబ్బి తబ్బిబ్బాయ్యారిద్దరూ..ఆ చెరువు నీరే పరమానందంగా తాగి ముఖాలు కడుక్కుని తమ వద్ద ఉన్న రెండు బాటిళ్లలో నీరు నింపుకుని కొద్ది దూరం వెళ్ళి హైవే పైకి ఎక్కి మరలా నడక మొదలెట్టారు. అంతలో వెనుక నుండి వెళ్తున్న రిక్షా వీరిద్దరినీ దాటినాక ఆగింది. ఎవరో ఇద్దరు ముసలోళ్ళు. రిక్షా తొక్కుతున్న చిన్న కుర్రోడు రిక్షా ఆపి దిగి పరిగెత్తుకుంటూ రాధయ్య వాళ్ల దగ్గరికి వచ్చాడు. " ఓ భయ్యా.. పీనేకా పానీ దోనా.. మేరా నానాం నానీకో ప్యాస్ లగే హై యే బంద్ కే వజైసే సుభాసే పానీచ్ నై మిలా" అన్నాడు.. వాణ్ణి చూడగానే ముచ్చటేసింది.. హైద్రాబాదీ హిందీ అలవాటైన రాధయ్యా.." క్యోం నహీ.. మీలేగా.. జరూర్.. ఆప్ లోగో కహాసే కహా తక్ జానే వాలే..?" అని అడిగాడు.. ఎలా అర్ధమైందో వెంటనే "ఓ తెలుగు వాలా.. మేమూ ఉత్తరప్రదేశ్ నుంచి వస్తయ్.. తమిళనాడు వెళ్తై.." అని తెలిసీ తెలీని తెలుగు భాషలో ఎంచక్కా చెప్పాడు.. వాణ్ణి చూస్తూనే చేతికి బాటిల్ అందించాడు రాధయ్య. టమ మాత్రు భాష వారికి జీవితంలోని అత్యంత అవసరమైన పరిస్థితుల్లో ఎంతగ్గా ఉపయోగపడిందో.. ఆ పిల్లాడి కళ్ళను చూసే వారికి మాత్రమే అర్ధమవుతుంది.

వాడు పరిగెత్తుకెళ్ళి రిక్షాపై పడిపోయి ఉన్న వాడి నాయానమ్మకు బాటిల్ లోని నీళ్ళు తాగించాడు.. " బంద్ కే వజైసే సబ్ లోగ్ చలే గయే హం అకేలే హోగయే.. బచ్చే కే వజైసే హమారా దేశ్ చలా జారే..! అని చెప్పాడు ముసలాయన అప్పటికే రిక్షాని సమీపించిన వీరిద్దరితో..! "షుక్రియా.. అని దణ్ణం పెట్టి " లేలో యే ఫల్... "అని చేతిలో యాపిల్ ఇవ్వ బోయాడు.. " నై నై బహుత్ దూర్ జారే.. రఖ్ లే భయ్.." అని చెప్పి వారిని పంపి .. తమ నడకను కొనసాగించారు. నిరాటంకంగా నడక కొనసాగిన కొన్ని గంటల తర్వాత ఓ బస్ షెల్టర్ కనిపించడంతో అక్కడ పడుకుందామని నిర్ణయించుకున్నారు ఇద్దరూ.

"సరే మావా నేనుకూర్చుంటా నువ్ కాసేపు తొంగో.." అంటూ అప్పటికే ఆగిపోయిన సెల్ వంక చూసత్తా '' తొందరగా ఇంటికొచ్చేయండయ్యా చంటిది ఎదురుచూస్తున్నాది" అన్న, భార్య మాట్లాడిన చివరి మాటలు గుర్తు తెచ్చుకుంటూ తుండు బస్టాండ్ అరుగుపై విధిలించి కూలబడ్డాడు. అప్పటికే మరో సిమెంట్ అరుగు మీద వాలిన రాధయ్యకు తన చిన్ననాటి రోజులు గుర్తొచ్చాయి.. మనం ముందుకెళుతున్నామా..? వెనక్కా..? పదవ తరగతి రెండు సార్లు తప్పిన రాధయ్య, అల్లోచన వెల్లువలో కొట్టు మిట్టాడాడు.. తన చిన్నతనంలో చూసిన రోజులు ఇప్పుడు మరలా గమనించడం ఆశ్చర్యం వేసింది. గ్రామాల్లో వెలేసిన కుటుంబాల పరిస్థితి గురొచ్చింది.. చెరువులో నీరు త్రాగటం.. పచ్చని చెట్ల నీడలూ గురొచ్చాయ్.. ఆ ఆలోచనల వరదలో పొలం గట్టున బురద పూవై పూసిన నాయన గుర్తొచ్చాడు.

× × ×

"నాయానా.. అమ్మా.. నేనొచ్చాం.. అం తిందాం రా" అన్న 7 ఏళ్ళ రాధయ్య పిలుపుతో "వచ్చున్నారయ్యా.. చెట్టుకిందకూకోండి.. వచ్చేచ్చున్నా.." అంటూ పచ్చని పొలాల్లోకి కాలువ నుంచి నీరొదిలి.. పారతో గాళ్ళు సర్ది .. కాలువ నీళ్ళతో చేతులు కడుక్కుని వచ్చి పెళ్ళాం తెచ్చిన బువ్వ తింటూ కొడుకుని ప్రేమతో చూసత్తా.. కళ్ళెగరేసిన వీరయ్యతో... "చేతికున్న మట్టి కడుక్కో నాయనా, కూల్లో అయ్యోరు సెప్తిరిగందా" అన్న రాధయ్య తో...."ఈ మట్టేరా మనకి అన్నం పెడతాంది..మనకేమైద్ది.. ఏంగాదు నాయనా " అన్నాడు వీరయ్య.

ఆశ్చర్యంగా చూస్తున్న రాధయ్యను.. ''ఇదిగో చూడు సిన్నోడా..బూమితల్లిని నమ్ముకున్నోడికి ఎప్పుడూ అన్నాయం జరగదురా.. కట్టాలంటావా వత్తంటయ్ ఫోతాంటయ్.. ఏం రమనమ్మా.." అన్నాడు మధ్యలో పెళ్ళాన్ని పలకరించి.. "అవునయ్యా సత్తెం" అంది పెనివిటి పలుకే పరమాన్నమన్నట్లు. తానుతింటూ తింటూ మధ్యలో చెరో ముద్ద పెట్టాడు వీరయ్య..! రమణమ్మ సిగ్గుతో కొంగర్లు చుట్టుకుపోగా.. వీరయ్య బుజమెక్కి ఉప్పమ్మ ఉప్పు.. అని ఊగసాగాడు రాధయ్య.

"సరే నేను సాయంకాలం వస్తా గందా.. మీరు ఇంటికి పోండి.. జాగ్రత్తగా సరేనా.. నువ్ కాసేపు అయ్యోరు జెప్పింది సదువుకో... నువ్ సదువుకుంటే మనకట్టాలు దీరతాయ్" అన్న వీరయ్యతో " సరే నువ్ తొరగా ఇంటికి రా నాయనా.."అంటూ నవ్వుకుంటూ వెళ్తూ తండ్రిని చూస్తూ.. "టాటా" అంటూ తల్లితో వెళ్ళిన రాధయ్య తండ్రి నవ్వుని మరలా చూళ్ళేదు.. పలుకు వినలేదు. అప్పటికే

మార్కెట్‌కి పంపిన ధాన్యం గిట్టుబాటు రాలేదని తెలిసి .. అప్పుల వాళ్ళు వేధిస్తారని భయపడి పురుగుమందు తాగి బలవన్మరణం చెందాడు వీరయ్య.. పొలంలోనే తరతరాలుగా వారి వంశం నమ్మిన భూమి ఒడిలోనే.

నాన్నజ్ఞాపకాలతో ప్రతిరోజూ పొలం గట్టున తచ్చాడి వెళ్ళే వాడు రాధయ్య. కాస్త ఊహ వచ్చాక తెలిసిందేంటంటే అప్పటికే అప్పులోళ్ళు ఉన్న పొలంలో ఎకరం మిగిల్చి అంతా లాగేసుకున్నారు.. అందుకే పొలం పనులంటే గిట్టదు రాధయ్యకి. వీరయ్య మోతుబరిగా తిరిగిన ఊర్లోనే వ్యవసాయ కూలీగా ఏ నామూషీ లేకుండా వెళ్ళిన రమణమ్మని చూసి ఎదిగాడు రాధయ్య. నాయన్ను మింగిన పొలం అంటే అసహ్యం పెంచుకున్నాడు. దీనికితోడు కరవు తాండవించడంతో రైతుల జీవితాలు అనేక ప్రాంతాల్లో దుర్భరంగా మారాయి. అందులో విరి మండలం ఒకటి. చివరకు పట్నంలో అయితే బాగా సంపాదించవచ్చని వలస బాటపట్టాడు రాధయ్య.

"ఏంది మావా.. కంట్ల నీళ్ళుగారుతున్నాయ్.. అత్తగాని గుర్తొచ్చిందా ఏందీ.." అన్న వీరేశం మాటలతో స్వగతంలోకి వచ్చిన రాధయ్య.. లేదల్లుడూ మీ తాత గుర్తొచ్చాడు.."అసలు మనం అమ్మలాంటి ఊరొదిలి ఏదో బావుకుందామని పట్నం ఆ.. పాలి...నగరం ఎల్లాం గందా.. ఏం సంపాదించినం.. సెప్పు.. ఏరా మాట్టాడవ్..? నిజమే గందా..? ఏవన్నఎనకేసినమా..? లేకబాయె? మహా అయితే మత్తు కోసం ఎప్పుడన్నా కాత్తంత మందు తాగినమంతేదప్ప.. ఏమన్నా సంతోషంగ గడిపినమా ..? లేదే..! ఇదిగో ఇంతలో ఈ మాయదారి రోగమొచ్చింది ..ఏం రోగమ్రా అదీ.. ?? "

"కరోనా మావా.."

"ఆ అదే.. కరవనా అంటూ అది కరిసేసే సరికి తింటానికి తిండి లేక, ఉంటానికి కొంపగోడు లేక, ఇంద ఇట్లా రోడ్డున బడుళ్లా.. ఎవరికి ఎవరూ పట్టనట్లు.. మనిషికి మనిషిని దూరం చేసేసిన ఈ మాయదారి రోగం మంచే జేసిందో సెబరే చేసిందో.. గానీ అందర్నీ ఊళ్లకి బంపిత్తాంది..

'' అదేందిమావా.. మనవొక్కళ్లమా ఏందీ పెపంచకమే గజగజలాడిపోతావుళ్ళా.. మనమే గందా కాస్త పుష్టిగుండాది"

''అవున్రా.. ఈరేశం.. మనం మనూరొదిలి మన మట్టి మాలచ్చినొదిలి ఏడకనో బోతే ఎవడూ పట్టించుకోకుండా, ఎవడూ చుక్క మంచిళ్ళియకుండా వదిలేత్తే అమ్మే గదరా మనల్ని రారమ్మని పిలుత్తాంది".

"అవును మావా నిజమే...మానాయన పొలానికెళ్ళి పోగ్గొట్టి సచ్చిపోయిండనే గందా.. నేనూ నీ యెనకాలొచ్చినా. నాయన సానా సార్లు జెప్పుళ్ళా, ఉన్న ఊర్లో పొలం పనిచేసుకుని కలో గంజో తిన్నా బతికేయొచ్చురా, జనానికి బువ్వ బెట్టేటోళ్లం మనమే పంజేయకుంటే ఎట్రా కొడకా అనేవోడు నాయన. ఎంత అవసరమొచ్చినా ఏడికీ ఎల్లమాకా నేలతల్లిని నమ్ముకో అని జెప్పుళ్ళా.. మనసేడాగింది.. డబ్బు కోసం... నీకూతుర్ని.. నా బిడ్డని వదిలేసి ఊర్ల బడ్డా.. ఇగో ఇప్పుడు మనం సచ్చినా ఎవరికీ తెల్దుగా మావా..?" పది రోజుల్లో కనీసం పలకరించినోడు లేకబాయె నీళ్ళిచ్చినోడు లేడాయె ఎవరికెవరం మావా , తెల్లారిద్దో లేదో తెలియకుండె గందా..!" అంటున్న వీరేశం కళ్ళు వర్షాకాలం పంట కాల్వలయ్యాయి.. గొంతు..చలికాలం గాలి చుట్టుముట్టినట్లు వణకసాగింది.

అల్లుడికి సర్ది చెప్పి పడుకోబెట్టాడే గానీ.. రాధయ్య మనసు మననులో లేదు..'' లచ్చల మంది నగరాలకని బోతే.. పొలాలేడుంటాయ్.. అడవులేడుంటాయ్.. నీళ్ళేడుంటాయ్... మన ఊరిని మనమే పట్టించుకోకపోతే... యేరే వాళ్ళు మనల్ని పట్టించుకోకపోవడంలో తప్పేముందీ" అని అనుకున్నాడు..

× × ×

ఆశల రేడు ఆది యోగి చీకట్ల నుంచి మరలా వెలుగు వైపు ప్రయాణం మొదలెట్టాడు. గబాగబా నడుస్తున్నారిద్దరూ. లక్ష్యం తప్ప వేరే ధ్యాస లేదిద్దరికీ. సచ్చే లోపు ఊరి పొలిమేర చూడాలి అదొక్కటే వారికి ఇప్పుడు కనిపిస్తోంది. బాధంతా పంటి బిగువున దాచేసి.. భయం మొత్తం భుజానికి వేళాడుతున్న బ్యాగుల్లో నెట్టేసి జిప్ వేసి.. నడక.. నడక...నడక. తమ ఊరు..తమని కన్నఊరు.. తమకి లాలపోసిన ఊరు.. తమకి మాట నేర్పినఊరు.. ఆట పాట నేర్పినఊరు.. సదువు జెప్పిన ఊరు.. పుస్తెలై ఎదురు చూస్తున్న ఊరు.. కళ్లు పిల్లలై గడపకి వేలాడిన ఊరు.. ప్రతి అడుగుకూ పలకరింపుల ఊరు... భక్తి వసపోసిన ఊరు.. అదిగదిగో.. ఊరి గుడి.. అదిగదిగో సదివిన బడి దూరంగా పొలిమేర నుంచి కనిపిస్తున్న పరిమళం. ఊరిలోంచీ వస్తున్న నేపాలీ గూర్ఖా కనిపించాడు.. "మనకి కనిపించని నేల అతణ్ణి ఎలా పోషిస్తోందీ"అన్న ప్రశ్న ఇద్దరి గుండెల్నీ ఓసారి మెలిపెట్టింది. అడుగుల్లో వేగం పెరిగింది.

పరిగెడుతున్న రాధయ్య కళ్ల కాళ్ళు అకస్మాత్తుగా ఊరి పొలిమేరలో చచ్చుపడినట్లు ఆగిపోయాయి. పొలిమేరలో రాళ్ళు రప్పలతో నిండిన ఆనాటి పచ్చటి పొలం .. నాయన పోయాక ఎడారై నోరెళ్లబెట్టిన అన్నదాత.. నాల్రోజుల రోజుల క్రితం దాహంతో అల్లాడిన తన పరిస్థితి గుర్తొచ్చి భోరున ఏడుస్తూ, ఎండిన నేలమీదకు పరిగెట్టి నేలపై పడి ముద్దు పెట్టుకున్నాడు రాధయ్య. నాయన నవ్వు కనిపించింది. నెత్తిన ముద్దు పెట్టుకున్న అనుభూతి తారసలాడింది. ఆగని దుఖం పొంగి ఆ నేల పాదాలను కడిగేస్తోంది.

"ఏమైంది మావా.. అంటూ మావ వెనుకాలే పరిగెత్తుకొచ్చి నేలపై బడి కన్నీరు మున్నీరవుతున్న రాధయ్యను ఓదార్చే ప్రయత్నం చేస్తున్నవీరేశంతోబ'' చూడరా బూమితల్లి గుండె ఎట్టా పగిలిపోయున్నాదో. మీ తాత కలల పొలంరయ్యా ఇది.. అని ఒకవైపు అల్లుడికి చెబుతూనే మరో వైపు నేలను ముద్దాడుతూ "నాయనా నీ మాటా దాటి ఏడకెళ్ళనయ్యా.. ఈ మట్టి మాలచ్చినొదిలి యాడికి బోనయ్యా" అంటూ బోరున విలపించసాగాడు.

రాధయ్య చేష్టలతో విస్తుపోయిన వీరేశానికి ఇంటి దగ్గర .."పెనివిటీ" అని ఎదురు చూస్తున్న పెండ్లాం గుర్తు రాలేదు.. నెలల పసిగుడ్డూ గుర్తు రాలేదు. పరిగెత్తి పరిగెత్తి వచ్చిన ఊరు గుర్తురాలేదు... తన పొలం గుర్తొచ్చింది.. నాయన ప్రాణంలా చూసుకున్న మట్టి మారాణి గుర్తొచ్చింది. తన పొలాన్ని ఒక్కసారి చూడాలనిపించింది. అకస్మాత్తుగా పొలం వైపు గట్టున పడి పెద్దగా రోదిస్తూ. పరుగు లంఘించాడు. ఎండపిట్ట తనకి మబ్బుల రెక్కల్ని అడ్డు పెట్టుకుని... చిన్న చిన్న చినుకై ఆనంద బాష్పాభిషేకం మొదలెట్టింది.

పుస్తక సమీక్ష

# ప్రచ్ఛన్న వస్తుశిల్పాలు

## విమర్శనాత్మక వ్యాసాలు



రచన : సాగర్ శ్రీరామకవచం
వెల : రూ. 200/-
ప్రతులకు :ఉషారాణి శ్రీరామకవచం, జమ్మిచెట్టు బజారు, లాయరుపేట(పో), ఒంగోలు, ప్రకాశం జిల్లా-523 002
ఫోను: 98854 73934,

ఇప్పుడు వస్తున్న రచనలలో విభిన్నంగాను, విలక్షణంగాను ఉండటమే కాకుండా ఈ సంకలనంలో ఒక వినూత్నమైన సాహిత్య సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు సాగర్‌శ్రీరామ కవచం (ఎస్. రామమోహనరావు). అది, సాహిత్య సృజనకు సంబంధించిన వస్తు శిల్పాల గురించి. రచనలలో ఏవిషయాలగురించి చెప్పబడుతుందో దానిని 'వస్తువు' అనీ, చెప్పే విధానాన్ని, పద్ధతిని శిల్పం అని పరిగణిస్తాం. ఆ రెండు అవిభాజ్యమైనవి, సజీవ ఐక్యతతో నిలుస్తాయి. అయితే, అందుకు భిన్నంగా వస్తుశిల్పాల విషయంలో ఒక కొత్త సిద్ధాంతాన్ని తన వ్యాసాలలో సూత్రీకరించి, విమర్శకులకు, సాహితీ వేత్తలకు మేధోమధనంచేసి, ఎంతో పరిశోధన చేయవలసిన పని పెట్టారు ఈ సంపుటంలో - సాగర్ శ్రీరామకవచం.

సంక్షిప్తంగా ఆ సిద్ధాంతం యిదీ - ఒక వస్తువుని అనుసరించి, మరో వస్తువు, దానిని అనుసరించి సాగే శిల్పంతో సమాశ్రయంగా మరో శిల్పం - ప్రచ్ఛన్నంగా ఉంటాయి. ఈ ప్రచ్ఛన్న వస్తుశిల్పాలు రచయిత పరిణతి మూలంగా అంతస్సారంగా ప్రవహిస్తాయి. అవి రచన మధ్యలోపుట్టి రచనముగింపుకి తారాస్థాయికి చేరుకుంటాయి. బలహీనమైన ప్రధానవస్తువు ప్రచ్ఛన్న వస్తువుగా, ప్రధాన శిల్పంగా ఆవిష్కరింపబడతాయి. ఆ కారణంగా, రచనలోని పాత్రలు కొంత దూరం నడిచాక రచయిత మాట ఏమాత్రం వినకుండా స్వతంత్ర ప్రతిపత్తిని ఏవిధంగా చాటుకుంటాయో, ఆ విధంగానే ప్రచ్ఛన్న వస్తు శిల్పాలు రచనా క్రమంలోకి దూసుకుచ్చి రచనాక్రమాన్ని ముందుకు తీసుకువెడతాయి. ఈ విధమైన ప్రచ్ఛన్నవస్తు శిల్పాలు పరిష్కారరంగంలోకి రచయిత చేరుకోవాలంటే, తాను ఒక తపోస్థితికి, ఒక నిమగ్నతకి, ఒక అలౌకిక తాదాత్మ్యస్థితికి లోను కావాలి. అప్పుడే గొప్ప రచన సృష్టించబడుతుంది.

ఈ విధంగా వ్యక్తపరిచిన తన కొత్త ప్రతిపాదనని విమర్శకులు అంగీకరించినా, అంగీకరించకపోయినా, ప్రతిరచనలోను ఈ వినిర్మాణ ప్రక్రియను స్పష్టంగా చూపగలననీ,కాలం మాత్రం ఈ అభిప్రాయాన్ని స్వీకరిస్తుందనే నమ్మకం రచయితకు ఉండటం అభినందనీయమే! అయితే యీ సూత్రీకరణపై విస్తృతంగా చర్చ జరగవలసిఉంది.

ఈ సంకలనం మూడు భాగాలుగా వర్గీకరించబడింది. 20 వ్యాసాలతో 'ప్రచ్ఛన్న వస్తుశిల్పాలు', సాగరవచనం శీర్షికన 15 వ్యాసాలు; చివరగా 'విభిన్న' పేరుతో 05 వ్యాసాలు ఉన్నాయి. నిజానికి ఈ 40 వ్యాసాలలో కేవలం ఐదు మాత్రమే'వ్యాసాలు' అనదగినవి. మిగిలిన చిన్నవ్యాసాలు లేదా 'గల్పికలు' అని పేర్కొనవచ్చు. మొదటి భాగంలో వ్యాసాలు ప్రచ్ఛన్న వస్తు శిల్పాల గురించి - కొంత వివరణ, మరోకోణం, వాటి వెనుక మేధస్సు పాత్ర, వాటి యొక్క అంతర్గతశక్తి రూపాలు ఆ రెండిటి యొక్క క్రియా శీల పాత్ర మొ॥ విషయాలపై అనుసంధానంగా వెలువడినవి. ఇక, రెండవభాగం "సాగరవచనం"లో నివి భాష, విమర్శ, పోస్ట్ మోడర్నిజమ్ వంటి అంశాలపై చిన్న వ్యాసాలు, వీటిలో 'మహిళా ఉద్యమాలు' వేరు, స్త్రీ ఉద్యమాలు వేరు (పు.87) 'ప్రవచనకారులతోనే పెనుప్రమాదం' (పు 106) వంటి వ్యాసాలలో రచయిత వెలిబుచ్చిన అభిప్రాయాలు వివాదాస్పదంగ కొందరు భావించే అవకాశం ఉంది. మూడవ భాగంలో - అస్తిత్వవాదం, వర్తమాన విమర్శపై ఒక సమాలోచన, సమాజమూ- విమర్శావేరు కాదు అనే చిన్న వ్యాసాలు సద్విమర్శనాత్మకంగా సాగాయి. మొత్తం మీద రచయిత ఈ సంకలనంలో ప్రచ్ఛన్నవస్తు శిల్పాలపై వినూత్నమైన ప్రతిపాదన చేయటమే కాకుండా, వస్తు శిల్పాల పట్ల ప్రాచీన సిద్ధాంతాన్ని వల్లెవేయటం ఏమాత్రం అంగీకారం కాదని, అదే సమయంలో తాను చేస్తున్న సూత్రీకరణపై చర్చ జరగాల్సిన అవసరం ఎంతో ఉందని పేర్కొనటం ఆహ్వానించదగిన విషయం. రచయిత చెప్పినట్లుగా "ఇదే ప్రచ్ఛన్న వస్తుశిల్పాల ప్రచ్ఛన్న రహస్య యాత్ర రచనలో... అది తవ్వి తీయాల్సిన అవకాశం ఎంతో ఉంది" గత దశాబ్దకాలంలో (2010-2020) సాగర్ రచనలు 'రసరేఖ', 'రచన', 'విఖ్యాత' తెలుగులోగిలి మొ॥ మాసపత్రికలలోను 'మనం', 'ఆంధ్రప్రభ' దినపత్రికలలోను ప్రధానంగా 22 చిన్నవ్యాసాలు 'నవమల్లెతీగ' మాసపత్రికలలోను ప్రచురింపబడి పాఠకులను ఆలోచింపచేస్తూనే ఉన్నాయి.

-ఎం.వి. శాస్త్రి
9441342999


సరసిగారి నుండి 2 కార్టూన్ల పుస్తకాలు



నవ్వుకోరోనాయనా!
పుటలు: 216, వెల :150/-



కరోనా కరకజ్జం
పుటలు: 80, వెల :50/-

ప్రతులకు : నవోదయ బుక్ హౌస్ 3-3-865, కాచీగూడ, హైదరాబాద్-500 027
ఫోను: 040 24652387, 900413413

గరిపెల్లి అశోక్ రచనలు

ప్రతులకు:గరిపెల్లి సౌజన్య 404, వి.ఎల్.ఆర్. రెసిడెన్సీ, సిద్ధార్థ స్కూల్ ప్రక్కన, శ్రీనివాసానగర్, సిద్దిపేట, తెలంగాణ- 502 103
చరవాణి: 9849649101



మా బడి కతలు
పుటలు: 71, వెల:80/



సరికొత్త ఆవు-పులి కథలు
పుటలు :58, వెల :156/-

**పుస్తక సమీక్ష**

# కార్గిల్ యుద్ధం



## ఒక విజయం...ఒక గుణపాఠం

రచన : చలసాని నరేంద్ర

వెల : రూ. 200/-

ప్రచురణ : సోషల్ కాజ్, ప్లాట్ నెం. 201, శ్రీనిధి రెసిడెన్సీ ఇం.నెం.12-13-754, స్ట్రీట్‌నెం.1తార్నాక హైదరాబాదు-500 017

ఫోన్: 70138 26651

**2019**వ సం॥ జులై 26వ తేదీనాటికి, జమ్ముకాశ్వీర్‌లోని కార్గిల్ జిల్లాలో పాక్ సైనికులు ఆక్రమించిన భూభాగాన్ని భారతీయసైన్యం తిరిగి స్వాధీనం చేసుకోవటం పూర్తిఅయి 20సం॥లు నిండాయి. 'కార్గిల్ విజయదివస్'గా పేరొంది, మాతృదేశసేవలో అమరులైన సైనికులకు శ్రద్ధాంజలి ఘటించే క్రమంలో హైదరాబాద్‌లోని స్వచ్ఛంద సంస్థ 'సోషల్ కాజ్' సంస్థ ఈ పుస్తకాన్ని తీసుకు వచ్చింది. సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలను తనదైన విశిష్టరీతిలో విశ్లేషించే మానవ హక్కుల కార్యకర్తగా, పాత్రికేయునిగా క్రీయాశీలంగా సామాజిక జీవనంలో వ్యవహరించే చలసాని నరేంద్ర, 37 అధ్యాయాలతో కూర్చిన కార్గిల్ యుద్ధచరిత్ర - యీ పుస్తకం.

1999వ సం॥ మే-జూలై నెలలో పాకిస్తాన్ కార్మికులు జమ్ము కాశ్మీర్‌లోని కార్గిల్ జిల్లాలోనికి చొరబడి ఎత్తయిన పర్వత శిఖరాల మీద కీలకమైన ప్రదేశాలలో స్థావరాలు ఏర్పాటు చేసుకుని దాడికి దిగబడగా, భారత సైన్యం దిగువున ఉండి యుద్ధం చేయవలసివచ్చింది. అధికారిక వివరాల ప్రకారం భారత సైనికులు 527 మంది అమరులుకాగా, పాకిస్తాన్ సైనికులు అసంఖ్యాకంగా మృతిచెందారు. సాంప్రదాయ యుద్ధానికి దిగేందుకు పాకిస్తాన్ సైనికులు అసంఖ్యాకంగా మృతిచెందారు. సాంప్రదాయ యుద్ధానికి దిగేందుకు పాకిస్తాన్‌కు సంసిద్ధత, సామర్ధ్యం లేకున్న దొంగచాటుగా, ప్రచ్ఛన్నంగా కార్గిల్ చొరబాటు వంటి చర్యలతో భారత భూభాగంలోకి పరిమిత యుద్ధాల ద్వారా అస్థిరత సృష్టించడమే అదేశపు ఎత్తుగడ అనేది బహిరంగ రహస్యమే. పాకిస్తాన్ దాడులు మొదట 1947-48లో తర్వాత 1965లోను, ఆ తర్వాత 1971లో బంగ్లాదేశ్‌లో భారతసేనలు సాధించిన విజయం తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలు సాధారణస్తితికి తీసుకువచ్చేందుకు గాను విస్తృతమైన ప్రాతిపదిక ఏర్పాటు చేస్తూ జులై 2, 1972,న సిమ్లా ఒప్పందం జరిగింది. అయినా పాక్ తన ధోరణి మార్చుకొనక ఆ ఒప్పందాన్ని తుంగలోతొక్కి, భారత్‌తో ప్రత్యక్షపోరు చేయలేక, చొరబాటులు, దొంగచాటు దాడులుచేస్తూ భారత్‌తో సంబంధాల విషయంలో ఎదురయ్యే యిబ్బందుల పరిష్కారానికి మిలటరీ, పారామిలటరీ నిర్ణయాలు, చర్యలపై పాకిస్తాన్ ఆధారపడుతోంది.

రచయిత పేర్కొన్నట్లు కార్గిల్ యుద్ధం - పరిమితంగాను, రెండుదేశాలు అణ్వస్త్రాలను సమకూర్చుకున్న తర్వాత, మొత్తం ప్రపంచ దృష్టిని ఆకర్షించిన; మొదటి సారిగా టి.వి.ప్రసారాల ద్వారా ప్రత్యక్షంగా ప్రజలు వీక్షించిన యుద్ధంగా ప్రత్యేకతలు కలిగి ఉంది. ఈ యుద్ధంలో మనదేశ సైనిక పోరాట పటిమ, శ్రద్ధ, పట్టుదల వంటి అంశాలు ప్రజల మదిలో ఎల్లప్పుడు చిరస్థాయిగా నిలుస్తాయి. ఈ సందర్భంగా సారధ్యం, అనుసరించిన దౌత్యం, స్వతంత్ర భారత చరిత్రను ఒక మలుపుతిప్పాయి. ఈ విజయంతో భారత్ బలోపేతమైతే, పాక్ బలహీనమైంది.

అయితే, కార్గిల్ యుద్ధం భారత్‌కు గుణపాఠాలు కూడా నేర్పిందని రచయిత గుర్తుచేయడం, ఆ వివారలను విశ్లేషణాత్మకంగా ప్రామాణికంగా పొందుపరిచిన అంశం ప్రశంసనీయం. భారత రక్షణ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయవలసిన అవసరాన్ని కార్గిల్ యుద్ధం వెల్లడి చేసింది. జాతీయ భద్రతా అంశాల నిర్వహణ, నిఘావ్యవస్థను బలోపేతం చేయడం, సరిహద్దుల నిర్వహణ, నిఘావ్యవస్థను ఏర్పరచుకోవడం పట్ల దృష్టిపెట్టడం జరిగింది. 'దీర్ఘకాలిక రక్షణ ప్రణాళికవైపు దృష్టి' '21వ శతాబ్దపు భద్రతా సంస్కరణలకు శ్రీకారం', 'రక్షణరంగం ముందడుగు', అనే ఆధ్యాయాలతో కార్గిల్ యుద్ధం నేర్పిన గుణపాఠాలను ఏవిధంగా సరిదిద్దుకోవలసి ఉన్నదీ - రచయిత అత్యంత వివరణాత్మకంగా, సులభమైన స్పష్టమైన శైలిలో పాఠకులకు అందించిన తీరు చెప్పుకోదగినదిగా ఉంది.

భారత్ పాక్ దేశాల మధ్య సంబంధాలు విభజన నాటి నుండీ ఏవిధంగా పరిణమిస్తూ వచ్చినదీ, కార్గిల్ యుద్ధానికి పూర్వరంగం, పాకిస్థాన్‌తో మనకు పొంచిఉన్న ప్రమాదం, జమ్ము-కాశ్మీర్ యొక్క చారిత్రక పూర్వరంగం, పాక్ అనైక్యతతో భారీ మూల్యం చెల్లించిన వైనం - యీ విధంగా ఎన్నో ఆసక్తికరమైన విషయాలను పాఠకుల దృష్టికి తీసుకువచ్చిన రచయిత కృషి అత్యంత అభినందనీయం. భారత రక్షణ శాఖ, సైనిక వ్యవస్థ లోటుపాట్లు - ఎటువంటి విషయాలను అక్షరబద్ధంచేసి, ఆ నేపధ్యంలో ఆ వస్తువుతో, ఒక సిద్ధాంత గ్రంథాన్ని తలపించేలా సాగిన ఈ గ్రంథ రచన- తెలుగు సాహిత్యంలో విభిన్నంగాను విశిష్టంగాను నిలచిపోతుందనటంలో సందేహంలేదు.

-ఎం.వి. శాస్త్రి

9441342999

**జాతీయ విద్యా విధానం 2020**

**విశ్లేషణ మరియు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు**



ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ,

తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ

పుటలు: 64, వెల :20/-

ప్రతులకు :డి. రమేశ్ పట్నాయక్, 9440980396

ప్రొ: కె.క్ష్మినారాయణ, 9441219028

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# ఆదివాసీ కొంగు బంగారం – నాగోబ జాతర










**ఆదిలాబాదు జిల్లాలోని ఇంద్రవెల్లి మండలంలోని స్లాప్యర్ గ్రామంలో ఫిబ్రవరి 11 నుండి 15 వరకు నాగోబ జాతర జరిగింది. ఈ సందర్భంగా నాగోబ జాతర గురించి తెలుసుకుందాం.**

**మూల** ఆదివాసీలు అంటే ప్రకృతి సిద్ధమైన మానవ సమూహం. అందులో గోండులది ఒక ప్రత్యేకత. ఆదివాసీ గోండుల జెండా చిహ్నం సూర్య చంద్రులు. ఆది ఎర్రరంగుతో ఉంటుంది. అందుకే గోండు తెగవారు సూర్యవంశం అని చెప్పుకుంటారు. పంచభూతాలతో సూర్య చంద్రుల ద్వారా పరిణామం చెందినామని, దీనిలో భాగంగానే ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలు తయారైనాయని, దాని ఆధారంగానే ఆదివాసీ గూడాల జనపాలన, జీవ పరిరక్షణ, మానవ విలువలు, క్రమశిక్షణ, ఆచారవ్యవహారాలు, పండుగల పద్ధతులు, వంశాలు, గోత్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. దీనికి మూలపురుషుడు, వ్యవస్థాపకుడు– *పాహండి కుపార్ లింగు.*

ఈ వంశంలో దాదాపు 8 రకాల వారు ఉంటారు. ఉదా:–మడావి, వెడ్మ, పంద్ర, మర్సుకోల, పూర్య, మెస్రం నాగబడి మొదలగు వారంతా 7 గోత్రాల వారే! ఈ వంశం వారందరికి(జల్లి+సల్లే) పెద్ద దేవర ఉంటుంది. నాగ్ బిడియ మెస్రం వారికి కూడా ఉంటుంది. కాని బుయగోట్టి మెస్రం వారికి మాత్రం నాగోబానే తమ దేవుడిగా కొలుస్తారు. ఏ వంశం వారికి ఆ వంశం (పెర్సపెన్ జాగా) సంస్థానాలు ఉంటాయి.

ఈ జాతరకు నాగోబ పూజకు మెస్రం వంశం వారే కాక వారి బంధువులు, ఆడపడుచులు (సేలక్ మయక్) సోరియాల్ ధరియల్ వస్తారు. ఆడపడుచుల భర్తల (సోరియాల్ ధరియల్) అవసరం తప్పకుండా ఉంటుంది. వీరు లేక పోతే నాగోబ పూజ జరగదు.

అమాయక ఆదివాసులు నిరక్షరాశ్యులైన పేదప్రజలు జాతరకి వచ్చి, తమకు అవసరమైన ఇత్తడి, రాగి, దేవుళ్ల విగ్రహాలు, పెండ్లి, వ్యవసాయ సామగ్రి తీసుకుంటారు. వ్యాపారి ఎంత చెప్పితే అంత ఇచ్చి తీసుకోనిపోతారు. ఇది ఆనవాయితీగా జాతరలో జరుగుతున్నది.

ప్రకృతి సిద్ధంగా పంచ భూతాలను నమ్ముతూ, వాతావరణంలో జరుగుతున్న అద్భుతాలను దేవుడిగా పూజిస్తున్న ఆదివాసుల మనోభావాన్ని కూడా– బహుళజాతి కంపెనీలకు తాకట్టు పెట్టి, వ్యాపార దృష్టితో ధ్వంసం చేస్తూ, ఆదివాసీ సంస్కృతిని, ఆదివాసులను మైదాన ప్రాంతాలకు తరుముతూ, ఆదివాసీ స్థలాలను, సంపదను వశపరుచుకోవడం జరుగుతుందని గుసగుసలతో బయటి మేధావులు కోడైకూస్తున్నారు. మూల ఆదివాసి గోండు తెగ తమ ఆచారాలతో జరుపుచున్న మెస్రం బయిగోట్టి వంశ దేవుడైన నాగోబ జాతర కూడా ఆధునికంగా మారినది. 1942లో నైజాం ప్రభువు ఆహ్వానంమేరకు లండన్ నుండి వచ్చిన మానవ శాస్త్రవేత్త హైమన్‌డార్ఫ్ 1992 వరకు గోండుల జీవన విధానాలను పరిశోధించి ఆనాటి, ప్రభుత్వాలకు నివేదికలు అందించినాడు. **ప్రభుత్వ పథకాలు ఆదివాసులకు అందాలంటే ప్రభుత్వయంత్రాంగం, నాయకులు గూడాల వద్దకే వెళ్ళాలి. లేదా నాగోబ జాతరలలో, రాయిసెంటర్‌లకి పోయి సమస్యలు పరిష్కారించాలి. ఎందుకంటే వారి గోండు భాష వీరికి రాదు, వీరి భాష వారికి రాదు. అందుకే కేస్లాపూర్ నాగోబ జాతరలో గోండీ జన సమూహం సమస్యల పరిష్కారానికి 1995 నుంచి దర్బార్ జరుపుతున్నారు. నాగోబ జాతర పాలక పార్టీలకు వేదికగా మారింది. వచ్చిన లక్షలాది ప్రజలకు కనీస సౌకర్యాల కల్పన కష్టంగా మారింది. వందల మైళ్ళ నుండి నడిచి వచ్చేవారి కోసం నీరు, ఆహారం, పడుకోవడానికి సరైన స్థలం ఏమీ ఉండదు.**

ఇక్కడకు సుదూరాల నుండి వచ్చిన వారు పడే ఇక్కట్లు– వచ్చే జాతరకాలానికి ఉండవద్దని కోరుకుందాం.

–ఆత్రం భుజంగ్ రావ్, 9440585605

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
APRIL 2021 Vol :7, Issue 2

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23




If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244